


### ఖరీఫ్‌కు సమృద్ధిగా
## ఎరువుల నిల్వలు

- బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం
- రైతులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టీకరణ

10

# రుణమాఫీకి గ్రీన్‌సిగ్నల్



- రెండో విడతకు భూములిచ్చే రైతులకు అవకాశం
- అమరావతి రైతులకు వార్షిక కౌలు పెంపునకు ఓకే
- ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్
- విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌లకు ఆమోదం
- విశాఖ, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో అంబేడ్కర్ గురుకుల సీవోఈ
- వివరాలు వెల్లడించిన సమాచార మంత్రి కొలుసు పార్థసారథి

3

రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి సుస్థిర అభివృద్ధి సాధించడంపై మంత్రివర్గ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు రూ.9,355 కోట్ల మంజూరుకు కేబినెట్ ఓకే చెప్పింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 2,943 తాగునీటి పథకాలు రూ.1,811 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులిచ్చింది. విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో రెండో విడతకు భూములిచ్చే రైతులకు సాగు రుణమాఫీకి ఆమోదం తెలిపింది. భూమి సమీకరించే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు రుణమాఫీకి ఆమోదించింది. 2026 జనవరి 6కంటే ముందు తీసుకున్న రుణాలకు ఈ మాఫీ వర్తిస్తుంది. భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు వార్షిక కౌలు పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అజెండాలోని 30కి పైగా అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు సమావేశం అనంతరం సమాచార మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.



## అభ్యంతరకర వ్యాఖ్యలను ఉపేక్షించొద్దు: సీఎం ఆదేశం

సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై విస్తృతంగా చర్చ జరిగింది. నేతలను కించపరుస్తూ చేసే వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వైకాపా వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని నేతలకు సీఎం సూచిస్తూనే.. అభ్యంతరకర వ్యాఖ్యలకు తెగబడితే ఉపేక్షించొద్దని పోలీసు అధికారులను గట్టిగా ఆదేశించారు. స్వార్థ రాజకీయాల కోసం బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను అడ్డు పెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారని.. అలాంటి వాటిపై పూర్తి నియంత్రణ రావాలని సీఎం ఆదేశిస్తూనే.. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారానికి ఐజీస్థాయి అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు.

2

### దుర్వినియోగానికి చెక్ పెట్టాలి!

సోషల్ మీడియా 'అతి'పై కేబినెట్ సీరియస్
కఠిన చట్టాలకు సీఎం ఆదేశం: మంత్రి పార్థసారధి

2

## పెట్టుబడుల శంఖారావం!



కొరియా గడ్డపై ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల శంఖారావం! మంత్రి నారా లోకేష్ సియోల్ పర్యటనలో ఆరో రోజూ అదే వేగాన్ని ప్రదర్శించారు. సీఐఐ భాగస్వామ్యంతో సియోల్‌లో నిర్వహించిన ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్, 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కొరియా రోడ్‌షోలో లోకేష్ కీలకోపన్యాసం.. కొరియన్ ఇన్వెస్టర్లను కట్టిపడేసింది. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఆటోమొబైల్స్, ఈవీలు, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ఏపీ అవకాశాలను మంత్రి లోకేష్ అనర్గళంగా కొరియా కంపెనీల ముందుంచారు. భారత రాయబారి గౌరంగలాల్ దాస్, కొరియా విదేశాంగ శాఖ డైరెక్టర్-జనరల్ లీ మిన్-క్యోంగ్ సహా ఉన్నతాధికారులు, సీఐఐ ప్రతినిధుల హడావుడి కొట్టొచ్చినట్టు కనిపించింది. రాష్ట్ర పెట్టుబడి అవకాశాలపై ఐటీఈ అండ్ సీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని సవివర ప్రజెంటేషన్ ఇచ్చారు. నవంబర్‌లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఈ రోడ్‌షో వేదికగా నిలిచింది. మొత్తంగా 120మందికి పైగా ప్రతినిధుల హాజరుతో సియోల్ రోడ్‌షో సూపర్ సక్సెస్‌గా నిలిచింది. కొరియా-ఏపీ వాణిజ్య బంధానికి ఇది మరో మైలురాయిగా మారింది.

#### మిగులు ఇథనాల్ వినియోగానికి
### త్వరలోనే మార్గదర్శకాలు



- తయారీదారులకు.. ప్రభుత్వానికి మేలు చేసేలా చర్యలు
- ఇథనాల్ తయారీదారులతో భేటీలో మంత్రి కొల్లు రవీంద్ర


10

### రెండేళ్లలో రెట్టింపు సంక్షేమం



- ప్రజలపట్ల చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం
- జగన్‌రెడ్డిది మోసపూరిత సంక్షేమం
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం

11





# దుర్వినియోగానికి చెక్ పెట్టాలి!

- దుర్వినియోగానికి చెక్ పెట్టాలి!
- సోషల్ మీడియా 'అతి'పై కేబినెట్ సీరియస్
- కఠిన చట్టాలకు సీఎం ఆదేశం: మంత్రి పార్థసారథి

అమరావతి (చైతన్య రథం): సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతోపాటు తీవ్ర నష్టం కలిగించే 'రోగంగా' మారుతోందని కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల మంత్రి కె పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, అసత్య ప్రచారం కోసం కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి కార్యకలాపాలకు కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై డీజీపీ, పోలీసు అధికారులు క్యాబినెట్‌కు సమగ్ర నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. విదేశాల్లో అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు, భారత ఐటీ చట్టంలోని లోపాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించినట్టు వివరించారు.

మహిళలను, బాలికలను కించపరిచే పోస్టులు, వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై చట్టాలను మరింత బలోపేతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారన్నారు. రాష్ట్రస్థాయి సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని ఈ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై అన్ని ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో నైపుణ్యం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అవసరమైతే నియమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారని చెప్పారు. సోషల్ మీడియా దుర్వినియోగ నియంత్రణపై దేశ విదేశాల్లో అమలులో ఉన్న ఉత్తమ విధానాలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం) అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్టు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు. అలాగే రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి సుస్థిర అభివృద్ధి సాధించడంపై క్యాబినెట్‌లో విస్తృత చర్చించామని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిరంతర అమలుకు రాష్ట్ర ఆర్థిక పటిష్టత అత్యంత కీలకమని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులకు మెరుగైన భవిష్యత్, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించే విధానాలపై ప్రతి క్యాబినెట్‌లో చర్చ జరుగుతోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.





## అభ్యంతరకర వ్యాఖ్యలను ఉపేక్షించొద్దు: సీఎం ఆదేశం

అమరావతి (చైతన్య రథం): సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. శుక్రవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై చర్చ జరిగింది. నేతలను కించపరుస్తూ చేసే వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. వైకాపా వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని నేతలకు సీఎం సూచించారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించొద్దని పోలీసు అధికారులను ఆదేశించారు. కులపరమైన అంశాలు, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో వేగంగా స్ప్రెడ్ చేస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. తమ స్వార్థ రాజకీయాలకు బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్‌లను అడ్డు పెట్టుకుని కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వీటిపై పూర్తి నియంత్రణ రావాలని సీఎం ఆదేశించారు. సోషల్ మీడియాలో ఫేక్ వార్తల నియంత్రణకు హోంశాఖ, న్యాయ శాఖ కలిసి పనిచేయాలన్నది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమతమని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. వాట్సప్ యూజర్ నేమ్ అందుబాటులోకి వస్తే సోషల్ మీడియా సమస్యలు అధికమవుతాయని డీజీపీ హరీశ్‌గుప్తా అభిప్రాయపడ్డారు. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారం కోసం ఐజీస్థాయి అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు.

చైతన్యరథం





మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి రామనారాయణరెడ్డితో కేక్ కట్ చేయించారు. ఆయురారోగ్యాలతో ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు.

# రుణమాఫీకి గ్రీన్‌సిగ్నల్

- రెండో విడతకు భూములిచ్చే రైతులకు ఛాన్స్
- అమరావతి రైతులకు వార్షిక కౌలు పెంపునకు ఓకే
- పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్
- 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌లకు ఆమోదం
- విశాఖ, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో అంబేడ్కర్ గురుకుల సీవోఈ ఏర్పాటు
- రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి సాధనపై విస్తృత చర్చ
- అజెండాలోని 30 అంశాలను ఆమోదించిన కేబినెట్
- వివరాలు వెల్లడించిన సమాచార మంత్రి కొలుసు పార్థసారథి






అమరావతి (చైతన్య రథం): రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి సుస్థిర అభివృద్ధి సాధించడంపై మంత్రివర్గ సమావేశంలో విస్తృత చర్చ జరిగినట్టు మంత్రి పార్థసారథి తెలిపారు. అజెండాలోని 30కి పైగా అంశాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు వివరించారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు రూ.9,355 కోట్ల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 2,943 తాగునీటి పథకాలు రూ.1,811 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు క్యాబినెట్ అనుమతి ఇచ్చిందన్నారు. రాజధాని అమరావతిలో రెండో విడతకు భూములిచ్చే రైతులకు సాగు రుణమాఫీకి ఆమోదం తెలిపింది. భూమి సమీకరించే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు రుణమాఫీకి ఆమోదించింది. 2026 జనవరి 6కంటే ముందు తీసుకున్న రుణాలకు ఈ మాఫీ వర్తిస్తుంది. భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు వార్షిక కౌలు పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. మెట్ట రైతులకు రూ.40 వేలకు, జరీబు రైతులకు రూ.60 వేలకు కౌలు పెంపునకు ఆమోదించింది. మెట్ట రైతులకు ఏటా రూ.3 వేలు, జరీబు రైతులకు రూ.5 వేల చొప్పున కౌలు పెంపు అమలుకు ఓకే చెప్పింది. రెండో విడత భూసమీకరణ గ్రామాల్లోని ఇనాం భూములకు పరిహారానికి కేబినెట్ ఓకే చెప్పింది. 307 ఎకరాల ఇనాం భూములకు దేవదాయశాఖకు రూ.159 కోట్ల పరిహారం చెల్లింపునకు అంగీకరించినట్టు మంత్రి పార్థసారథి వెల్లడించారు. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చ జరిగింది. పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో కాన్సర్ట్‌ల నిర్వహణ, కాన్సర్ట్‌లకు ప్రత్యేక విధానం ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదేవిధంగా రూ.50 కోట్లతో పర్యాటక ప్రచారానికి ఆమోదం తెలిపిన కేబినెట్, నెల్లూరులో ఐటీసీ హోటల్, కడపలో మాధవి హోటల్‌కు, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు, కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు నిర్ణయించింది.

విశాఖ, గుంటూరు, నెల్లూరులో అంబేద్కర్ గురుకుల సీవోఈ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐఐటీ జేఈఈ, నీట్‌కు రెసిడెన్షియల్ కోచింగ్ ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణకు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్‌కు ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ సిఫార్సులతో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించిన సంస్థలకు భూకేటాయింపులకు అనుమతులు ఇచ్చింది.

**కేబినెట్ ఆమోదించిన మరిన్ని అంశాలు:**

**ఎన్ఎఫ్‌డీబీకి భారీ అక్వేరియం, కార్యాలయం కోసం భూకేటాయింపులకు ఆమోదం.**

**ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం.**

**సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం.**

## సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం అమలు

రాష్ట్ర మంత్రివర్గం సమావేశం తరువాత భేటీలో చర్చించిన విషయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి సుస్థిర అభివృద్ధి సాధించడంపై క్యాబినెట్‌లో విస్తృతంగా చర్చించామన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిరంతర అమలుకు రాష్ట్ర ఆర్థిక పటిష్టత అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులకు మెరుగైన భవిష్యత్, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించే విధానాలపై ప్రతి క్యాబినెట్‌లో చర్చ జరుగుతోందని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు.

సోషల్ మీడియా సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే "రోగంగా" మారుతోందని క్యాబినెట్ ఆందోళన వ్యక్తం చేసిందని మంత్రి పార్థసాథి తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.



# కొరియాలో ఏపీ పెట్టుబడుల సందడి

## సియోల్‌లో సీఐఐ రోడ్‌షో.. మంత్రి లోకేష్ కీలకోపన్యాసం









అమరావతి (చైతన్య రథం): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో దక్షిణ కొరియాలోని సియోల్‌లో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ -2026 కొరియా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హెచ్‌ఆర్డీ, ఐటీ, ఆర్‌టీజీఎస్ మంత్రి నారా లోకేష్‌తో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నడిచింది. ఆంధ్రప్రదేశ్-కొరియా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలను బలోపేతం చేసే అవకాశాలను అన్వేషించేందుకు ఈ సెషన్‌లో సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం, కొరియా ప్రభుత్వం, ఇన్వెస్ట్ కొరియా, కోట్రా, కొరియా పరిశ్రమ, సీఐఐ ఆంధ్రప్రదేశ్ సీఈఓల ప్రతినిధి బృందం నుంచి సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ తన కీలకోపన్యాసంలో పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడుల సౌలభ్యం, సాంకేతికత ఆధారిత పాలన, ఉద్యోగ కల్పనపై ఏపీ ప్రభుత్వం ఎలాంటి దృక్పథాన్ని అనుసరిస్తుందో సవివరంగా ప్రస్తావించారు. ఎలక్ట్రానిక్స్, ఐటీ, సెమీకండక్టర్లు, ఆటోమొబైల్స్, ఈవీలు, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, ఆహార శుద్ధి, ఓడరేవులు, లాజిస్టిక్స్, అధునాతన తయారీ రంగాల్లో బలమైన అవకాశాలతో ప్రపంచ పెట్టుబడిదారులకు భారత్‌లోని అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానాల్లో ఏపీ ఒకటిగా నిలుస్తోందంటూ కొరియన్ ఇన్వెస్టర్లను తన అనర్ఘళ ఉపన్యాసంతో ఆకట్టుకున్నారు. వ్యూహాత్మక పెట్టుబడి గమ్యస్థానంగా ఏపీని పరిశీలించాలని కొరియా కంపెనీలను ఆహ్వానించిన లోకేష్, చురుకైన పాలన, నైపుణ్య శక్తి, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఓడరేవుల అనుసంధానం, పెట్టుబడిదారులకు అనుకూల విధానాల కలయిక ఏపీ సొంతమంటూ.. సరికొత్త ముఖచిత్రాన్ని ఇన్వెస్టర్ల ముందు పెట్టారు. పెట్టుబడిదారుల కోసం పారదర్శక వ్యవస్థకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



స్వాగతోపన్యాసం చేసిన కొరియాలోని భారత రాయబారి గౌరంగలాల్ దాస్, భారత్-కొరియా మధ్య పెరుగుతున్న ఆర్థిక భాగస్వామ్యాన్ని, ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంలో రాష్ట్రస్థాయి భాగస్వామ్యం ప్రాముఖ్యతను వివరించారు. తయారీ, సాంకేతికత, రవాణా, ఆవిష్కరణల్లో ఏపీ బలాలు కొరియా ప్రపంచస్థాయి సామర్థ్యాలతో దగ్గరగా సరిపోలుతున్నాయని పేర్కొన్నారు. కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆసియా, పసిఫిక్ వ్యవహారాల బ్యూరో డైరెక్టర్-జనరల్ లీ మిన్-క్యోంగ్ మాట్లాడుతూ, భారత్-కొరియా మధ్య ఆర్థిక, సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

సీఐఐ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్, అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ నరేంద్ర కుమార్ తన ప్రారంభోపన్యాసంలో ఏపీ, దక్షిణ కొరియా మధ్య బలమైన పరస్పర పూరకతలు ఉన్నాయని పేర్కొన్నారు. అధునాతన తయారీ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, క్లీన్ టెక్నాలజీలు, స్మార్ట్ మౌలిక సదుపాయాల్లో కొరియా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందగా, భారత్‌లో విస్తరించాలనుకునే కొరియన్ కంపెనీలకు ఏపీ బలమైన వేదికగా నిలుస్తుందని చెప్పారు. పెట్టుబడులను ప్రోత్సహించేందుకు, విధానపరమైన చర్చలు, ప్రపంచ భాగస్వామ్యాల కోసం ప్రభుత్వం, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి సీఐఐ ఏపీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

ఏపీ ఐటీఈ అండ్ సీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని.. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై సవివర ప్రజెంటేషన్ ఇచ్చారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ టెక్నాలజీలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ, లాజిస్టిక్స్, ప్రతిభ లభ్యత, వర్ధమాన రంగాల్లో రాష్ట్ర బలాలను వివరించిన ఆయన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పెట్టుబడి పర్యావరణ వ్యవస్థ నిర్మాణంపై ప్రభుత్వ దార్శనికతను తెలియజేశారు. విశాఖపట్నంలో నవంబర్ 12-13, 2026 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026ను ప్రచారం చేసేందుకు, కొరియా పరిశ్రమల భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఈ రోడ్‌షో ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఏపీ పెట్టుబడి సామర్థ్యాన్ని, పారిశ్రామిక బలాన్ని, భాగస్వామ్య అవకాశాలను ప్రపంచ పెట్టుబడిదారులకు ప్రదర్శించే ప్రధాన అవకాశంగా సదస్సు నిలవనుంది. కార్యక్రమానికి ఉన్నత ప్రభుత్వ అధికారులు, కొరియా పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడి ప్రోత్సాహక సంస్థలు, వ్యాపార నాయకులు, సీఐఐ ఏపీ సీఈఓల ప్రతినిధి బృందం సభ్యులతో సహా 120మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు.




- పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే లక్ష్యం
- కొరియాతో ఆంధ్రప్రదేశ్‌ది విజయవంతమైన భాగస్వామ్యం
- ఏపీపట్ల విశ్వాసానికి కియా మోటార్స్ పెట్టుబడి నిదర్శనం
- కొరియా మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీని తీర్చిదిద్దుతాం
- స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్.. మా విజయ రహస్యం
- ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలి
- సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ కొరియా రోడ్ షోలో మంత్రి లోకేష్ పిలుపు

## ఏపీ-కొరియా భాగస్వామ్యంలో

# కొత్త అధ్యాయానికి శ్రీకారం

సియోల్ (సౌత్ కొరియా): ఏపీ-కొరియా భాగస్వామ్యంలో మరో కొత్త అధ్యాయాన్ని లిఖించబోతున్నాం. పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యం. కొరియాతో ఆంధ్రప్రదేశ్‌ది విజయవంతమైన భాగస్వామ్యం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లో 31వ సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సౌత్ కొరియా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...
"సియోల్‌లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ మీ మధ్య ఉండటం ఎంతో గౌరవంగా ఉంది. అంతకంటే ముఖ్యంగా, ఇప్పటికే వేలాదిమంది జీవితాలను మార్చిన, భవిష్యత్తులో ఆసియాలో అత్యంత కీలకమైన ఆర్థిక భాగస్వామ్యాల్లో ఒకటిగా నిలిచే సామర్థ్యమున్న ఈ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో ఆనందంగా ఉంది. ముందుగా నా గురించి కొద్దిగా చెప్పాలనుకుంటున్నా. నేను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. అయితే గత రెండేళ్లుగా నాకు మరో ప్రధాన బాధ్యత కూడా ఉంది. అదే ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ పెట్టుబడులు, సాంకేతికత, ఉపాధి అవకాశాలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం" అన్నారు.

### పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే లక్ష్యం

2024లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నా లక్ష్యం ప్రపంచాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం. గత రెండేళ్లలో దావోస్, సింగపూర్, జపాన్, రష్యా, మధ్యప్రాచ్యం, యూరప్, ఇప్పుడు కొరియావంటి అనేక దేశాల్లో పర్యటించాం. మా లక్ష్యం కేవలం ఎంవోయూలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు... శాశ్వతంగా నిలిచే భాగస్వామ్యాలను నిర్మించడం. ఈ పర్యటనలో నా కొరియా మిత్రుల్లో ఒకరు నాకు ఇచ్చిన ప్రశంసను ఎంతో విలువైనదిగా భావిస్తున్నా. ఆయన నన్ను 'పల్లి పల్లి మంత్రి' అని పిలిచారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా... త్వరగా' (వేగవంతమైన) అని అర్థం. అదేవిధంగా మా ప్రభుత్వం కూడా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం అని లోకేష్ స్పష్టం చేశారు.

### కొరియాతో ఏపీది విజయవంతమైన భాగస్వామ్యం

"ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అనుగుణంగా పనిచేయాలనేది మా నమ్మకం. ఫైళ్లు టేబుళ్లపై నిలిచిపోకూడదు. పెట్టుబడిదారులు కార్యాలయాల కారిడార్లలో వేచి చూడకూడదు. అనుమతుల కోసం అవకాశాలు ఆలస్యం కాకూడదు. మా ప్రభుత్వాన్ని నిర్వచించేది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. బహుశా అందుకే నాకు కొరియాలో సొంత ఇంటి వాతావరణం కనిపిస్తోంది. కొరియాతో మా సంబంధం కొత్తది కాదు. ఈరోజు ఏపీలో 35కి పైగా కొరియా కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### ఏపీపట్ల విశ్వాసానికి కియా మోటార్స్ పెట్టుబడి నిదర్శనం

"2016లో కియా మోటార్స్ ఏపీలో పెట్టుబడి పెట్టాలనే ధైర్యవంతమైన నిర్ణయంతో మా ప్రయాణం ప్రారంభమైంది. కియా మోటార్స్ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం కేవలం ఒక పెట్టుబడి మాత్రమే కాదు. అది మాపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. అతి తక్కువ కాలంలోనే అనంతపురంలోని కియా ప్లాంట్ ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థకు అత్యుత్తమ ఉత్పాదకత కలిగిన తయారీ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామం మరింత ముఖ్యమైంది. కియా ఒంటరిగా రాలేదు. కియాతోపాటు మొత్తం ఎకో సిస్టమ్‌ను తీసుకువచ్చింది. ఈరోజు అనంతపురం భారతదేశంలోని అత్యంత విజయవంతమైన కొరియన్ ఆటోమొబైల్ క్లస్టర్లలో ఒకటిగా ఎదిగింది" అని వివరించారు.

### కొరియా భాగస్వామ్యంతో పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మించడమే లక్ష్యం

"ఇప్పుడు మేం రెండో అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతదేశంలో తన మూడో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కోసం శ్రీసిటీని ఎంపిక చేసింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ప్యాకేజింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఈవీ కాంపోనెంట్స్, ఫుట్‌వేర్, ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో కూడా కొరియా కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ పర్యటన మమ్మల్ని మరింత ముందుకు తీసుకెళ్లింది. నౌకా నిర్మాణం, సెమీకండక్టర్లు, భారీ పరిశ్రమలు, సముద్ర పరికరాలు, స్టార్టప్‌ల రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ కావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్-కొరియా మధ్య భాగస్వామ్యం కేవలం ఒక కంపెనీ గురించి కాదు.. పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మించడమే మా లక్ష్యం" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### కొరియా మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీని తీర్చిదిద్దుతాం

"ఇటీవల భారత్‌లో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ జరిపిన పర్యటన ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. రెండు దేశాల ప్రభుత్వాలు వచ్చే దశాబ్దానికి జాయింట్ స్ట్రాటజిక్ విజన్‌ను ఆమోదించడం జరిగింది. ఇకపై ఈ సంబంధం కేవలం వాణిజ్యానికే పరిమితం కాదు. సెమీకండక్టర్లు, ఏఐ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, షిప్ బిల్డింగ్, మారిటైం సెక్యూరిటీ, క్రిటికల్ మినరల్స్, క్లీన్ ఎనర్జీ, ట్రస్టెడ్ సప్లై చెయిన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీ రంగాలకు విస్తరించింది. ప్రస్తుతం భారత్-కొరియా ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27 బిలియన్ డాలర్లకు చేరింది. 2030నాటికి దీన్ని 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని రెండు దేశాల ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ లక్ష్యాన్ని మనం సాధించడమే కాకుండా అధిగమిస్తామని కూడా నమ్ముతున్నా. ఈ వృద్ధిలో ఏపీ కూడా ముఖ్య భూమిక పోషించాలని కోరుకుంటోంది. కేవలం భారతదేశంలోని మరో రాష్ట్రంగా కాకుండా.. భారతదేశంలోకి కొరియా పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యమైన మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్ గేట్ వేగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది" అని మంత్రి విశదీకరించారు.

### నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీ సొంతం

"పెట్టుబడులకు ఏపీనే ఎందుకు ఎంచుకోవాలనేందుకు కొన్ని కారణాలున్నాయి. ఆంధ్రప్రదేశ్ 190 బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. ఏటా దాదాపు 21 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసే భారతదేశంలోని అగ్రగామి రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. సుమారు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరం, అనేక నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, అనువైన భూమి ధరలు, యువతతో కూడిన నైపుణ్యవంతమైన మానవ వనరులు, ప్రకటనలకంటే అమలుకే అధిక ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వం.. ఏపీ బలాలుగా ఉన్నాయి. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, షిప్ బిల్డింగ్, డేటా సెంటర్లు, ఏఐ, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ మ్యానుఫ్యాక్చరింగ్, అడ్వాన్స్ డ్ మెటీరియల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వాకల్చర్‌వంటి రేపటి పరిశ్రమలను మేం నిర్మిస్తున్నాం. కొరియా సాంకేతిక నైపుణ్యం.. ఆంధ్రప్రదేశ్ విస్తృత సామర్థ్యంతో కలిసినప్పుడు అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని మేం విశ్వసిస్తున్నాం" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

### స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మా విజయ రహస్యం

"ఏపీ ప్రత్యేకతల గురించి చాలామంది అడుగుతారు. అందుకు మూడు 'ఎస్'లు ప్రధాన కారణాలుగా చెబుతాను. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్. ప్రతి విజయవంతమైన పెట్టుబడి గమ్యస్థానం వెనుక ఒక సమర్థవంతమైన పెట్టుబడి ప్రోత్సాహక సంస్థ ఉంటుంది. మావద్ద అది ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు. భారతదేశంలోని అత్యుత్తమ పెట్టుబడి ప్రోత్సాహక సంస్థల్లో ఇదొకటి. మా యువ, ఉత్సాహభరితమైన బృందం పరిశ్రమలతోపాటు వివిధ రాష్ట్రాల పెట్టుబడి ప్రోత్సాహక సంస్థల నుంచి వచ్చిన నిపుణులతో ఏర్పడింది. త్వరలో మరికొంతమందిని కూడా చేర్చుకోబోతున్నాం. వారు ఎక్కడినుంచి వస్తారో మీకు ఇప్పటికే తెలిసి ఉండవచ్చు" అని మంత్రి లోకేష్ అన్నారు.

### పెట్టుబడుల సాధనలో ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డుది ప్రత్యేక స్థానం

"ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకి ఒక విషయం స్పష్టంగా చెప్పా. వారు కేవలం పెట్టుబడులను తీసుకురావడమే కాదు... భారతదేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. ఎంఓయూతో ఈడీబీ పని ముగిసిపోదు. అసలు పని అప్పుడే ప్రారంభమవుతుంది. పెట్టుబడిదారులకు భూమి గుర్తించడం, అనుమతుల ప్రక్రియలో మార్గనిర్దేశం చేయడం, ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సరఫరాదారుల వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమస్యలను పరిష్కరించడం, విస్తరణలో సహకరించడంవంటి ప్రతి దశలో ఈడీబీ తోడ్పడుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే... మీ మొత్తం పెట్టుబడి ప్రయాణంలో ఈడీబీ మీ భాగస్వామి" అంటూ మంత్రి ఉత్సాహం నింపారు.

### ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలి

"కియా ఏం సాధ్యమో చూపించింది. ఎల్జీ తదుపరి అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఇప్పుడు మరెన్నో కొరియా కంపెనీలు కూడా ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నాం. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, షిప్ బిల్డింగ్, ఆటోమోటివ్, బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, మెరైన్ ఎక్విప్ మెంట్, ఏఐ, ఫుడ్ ప్రాసెసింగ్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో ఏపీ స్వాగతం పలుకుతోంది. మా ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుతో సంప్రదించండి. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించండి. మా పరిశ్రమలను చూడండి. మా వేగాన్ని పరిశీలించండి. అదేవిధంగా నవంబర్‌లో ఏపీలో నిర్వహించే సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు మీ అందరినీ హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నా" అని లోకేష్ పిలుపునిచ్చారు.

### ఏపీ-కొరియా భాగస్వామ్యంలో మూడో అధ్యాయాన్ని లిఖించబోతున్నాం

ఆంధ్రప్రదేశ్-కొరియా భాగస్వామ్యంలోని మొదటి అధ్యాయం ఆటోమొబైల్ రంగం ద్వారా లిఖించడం జరిగింది. రెండో అధ్యాయం ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇప్పటికే కొనసాగుతోంది. మూడో అధ్యాయాన్ని మనమందరం కలిసి సెమీకండక్టర్లు, షిప్ బిల్డింగ్, ఏఐ, క్లీన్ ఎనర్జీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో లిఖించబోతున్నాం. 2030 నాటికి భారత్- కొరియా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 50 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే లక్ష్యాన్ని రెండు దేశాలు నిర్దేశించుకున్నాయి. ఆ ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన శక్తిగా నిలుపుదాం. కొరియాలో వేగంగా ముందుకు సాగాలనేందుకు ఒక అందమైన ఫిలాసఫీ ఉంది. 'పల్లి పల్లి'. ఆంధ్రప్రదేశ్ కూడా అదే స్ఫూర్తిని స్వీకరించింది. మేం లక్ష్యంతో, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. ఈ ప్రయాణంలో మీరందరూ మాతో కలిసి నడవాలని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్, కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆసియా, పసిఫిక్ వ్యవహారాల బ్యూరో డైరెక్టర్ జనరల్ లీ మిన్-క్యోంగ్, ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డా.కిమ్ టే హ్యుంగ్ (హ్యుంగ్ కిమ్) సీఐఐ ఆంధ్రప్రదేశ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఛైర్మన్ ఎస్.నరేంద్ర కుమార్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్ లీడర్ సంగ్ హియో, సోలమ్ సీవోవో జే గ్యాబ్ హా, కోట్రా అవుట్‌బౌండ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఎం అండ్ ఏ టీమ్ డిప్యూటీ డైరెక్టర్ డే క్యున్ కిమ్, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ శుభమ్ భన్సల్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# ఏపీకి విస్తరించండి!

- గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదన
- కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ చో హన్ చుల్‌తో మంత్రి లోకేష్ భేటీ









సియోల్ (సౌత్ కొరియా): గృహోపకరణాలు, నీరు, గాలి శుద్ధి పరికరాల సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ (దక్షిణ కొరియా) ఓవర్సీస్ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెచ్‌వోడీ చో హన్ చుల్, ఆసియా రీజియన్ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... “శ్రీసిటీలోని గృహోపకరణాల క్లస్టర్‌లో అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, డైకిన్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి సంస్థలున్నాయి. దేశంలో 40శాతం ఏసీలు, 35శాతం టీవీలు ఏపీలో తయారవుతున్నాయి. ఇందుకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉంది. ఇక్కడినుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడం సులభం. దక్షిణ భారతదేశంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వాణిజ్యానికి భారతదేశం ఒక విశ్వసనీయ తయారీ భాగస్వామిగా ఉంది. ఈ అనుకూలతల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ లేదా తిరుపతిలో గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి” అని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ మాట్లాడుతూ... “దక్షిణ కొరియాలో నంబర్ 1 ప్రెషర్ రైస్-కుక్కర్ల తయారీ సంస్థ అయిన కుకూ ఎలక్ట్రానిక్స్, ఇప్పుడు నీరు, గాలి శుద్ధి ఉపకరణాల అద్దె రంగాలవైపు మళ్లుతోంది” అని తెలిపారు. వంటగది ఉపకరణాలు, నీటి శుద్ధి, గాలి మరియు ఆరోగ్యం (ప్యూరిఫైయర్లు, హ్యూమిడిఫైయర్లు, బిడెట్లు) తయారీతోపాటు ప్రపంచవ్యాప్తంగా 10 లక్షలకు పైగా ఉపకరణాల యూనిట్లు తమవద్ద అద్దెకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తమ సంస్థ 40కి పైగా దేశాలకు గృహోపకరణాలను ఎగుమతి చేస్తోందని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా భారత మార్కెట్లో రైస్ కుక్కర్లు, ఎయిర్ ప్యూరిఫైయర్‌లను విక్రయిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌కు హామీ ఇచ్చారు.







# శ్రీసిటీపై దృష్టిపెట్టండి




**మోటివ్ లింక్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ప్రతిపాదన - సీఈవో కిమ్ కి-హాన్‌తో మంత్రి లోకేష్ భేటీ**

సియోల్ (సౌత్ కొరియా): దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్, పాసివ్ కాంపొనెంట్స్ తయారీ సంస్థ మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్, ఇంటర్నేషనల్ సేల్స్ అండ్ రీసెర్చ్ జనరల్ మేనేజర్ బైద్య శర్మతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... “ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ విడిభాగాలు, ఎస్ఎండీ/పీబీఏ ఉత్పత్తి, ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్, ఇతర ఈవీ మాగ్నెటిక్స్ విడిభాగాలు తయారు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేయండి. ఇందుకు అవసరమైన విద్యుత్, నీరు, లాజిస్టిక్స్‌వంటి మౌలిక సదుపాయాలతో కూడిన భూమి శ్రీసిటీలో సిద్ధంగా ఉంది. ఏపీలోని స్పేస్ సిటీ, స్కైరూట్, ఏఎంసీఏ వంటి రక్షణరంగ తయారీ యూనిట్లలో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించండి. ఎంసీఎన్ఈఎక్స్, సోలమ్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ వంటి ఇతర కొరియన్ కంపెనీలతోపాటు శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్టను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్ మాట్లాడుతూ... భారతదేశంలో గ్రీన్‌ఫీల్డ్ ఈవీ-కాంపోనెంట్స్ (ట్రాన్స్‌ఫార్మర్లు/ డీసీ కన్వర్టర్లు) ప్లాంట్ కోసం స్టెర్లింగ్ టూల్స్‌తో ఒక టెక్-లైసెన్స్ జాయింట్ వెంచర్‌ను మోటిలింక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నైలో సెప్టెంబర్ 2025లో స్థాపించిందని తెలిపారు. భారత్‌లో తమ సంస్థ మొదటి స్వతంత్ర ప్లాంట్ తమిళనాడులోని శ్రీపెరంబుదూర్-ఒరగడమ్-చెన్నై ఆటో క్లస్టర్‌లో ఉందన్నారు. తాజాగా ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కిమ్ కి-హాన్ హామీ ఇచ్చారు.

# ఆంధ్రప్రదేశ్ సముద్ర రవాణా, షిప్ బిల్డింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టండి

## హెచ్ డి కోస్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్వోన్ యంగ్వాన్‌తో మంత్రి లోకేష్ భేటీ





సియోల్ (సౌత్ కొరియా): దక్షిణ కొరియా పెట్టుబడుల యాత్రలో భాగంగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ హెచ్ డి కొరియా షిప్‌బిల్డింగ్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్వోన్ యంగ్వాన్, టీమ్ లీడర్ హోంగ్ సున్జున్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర రవాణా, షిప్‌బిల్డింగ్ పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... "పారిశ్రామిక, ఆఫ్ షోర్ ఇంజనీరింగ్ స్థాపనకు ప్రపంచస్థాయి అవకాశాలను, ఆంధ్రప్రదేశ్ ఇస్తున్న ప్రత్యేక ప్రయోజనాలను వివరించారు. సుమారు 1053 కి.మీ.ల సుదీర్ఘ తీరప్రాంతంతో భారత తూర్పుతీరంలో ఏపీ వ్యూహాత్మక ప్రాంతంగా ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఆరు పోర్టులతోపాటు కొత్తగా రాబోయే డీప్-వాటర్ పోర్టులు, ప్రపంచస్థాయి లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్, పెట్టుబడిదారులకు అనుకూల పాలసీలు ఏపీ ప్రత్యేకతలుగా వివరిస్తూ, రాష్ట్రంలో అమలుచేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు.. పెట్టుబడిదారులు తమ ప్రాజెక్టులను త్వరగా ఏర్పాటు చేయడానికి రూపొందించిన గవర్నెన్స్ మోడల్‌గా వివరించారు. ఇందుకు కియా మోటార్స్, దాని



సరఫరా వ్యవస్థ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వంటి కొరియన్ కంపెనీలు సాధించిన విజయాలను ఉదహరించారు. భారీ పారిశ్రామిక ప్రాజెక్టులను అతితక్కువ సమయంలో అమలుచేసిన చరిత్ర, సామర్థ్యం ఏపీకి ఉన్నాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఇతర ముఖ్య పెట్టుబడులను మంత్రి లోకేష్ తెలియజేస్తూ గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్ మిట్టల్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్ట్ ఇటీవల ఏపీని ఎంచుకున్నాయి. ఇవి ప్రపంచ కంపెనీల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాలపై పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తాయని అన్నారు. భారతదేశంలోకి వచ్చే ఇన్వెస్టిమెంట్లలో సుమారు 25శాతం పెట్టుబడులను ఆకర్షించి దేశంలో ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందని తెలిపారు. "హ్యూండయి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని షిప్‌బిల్డింగ్ అవకాశాలను వివరించడం ఎంతో ఆనందంగా ఉంది. అనేక కొరియన్ కంపెనీలు మా రాష్ట్రంలో పెట్టుబడిపెట్టి రికార్డ్ సమయంలో కార్యకలాపాలు ప్రారంభించాయి. వాటికి మా ప్రభుత్వం పూర్తి మద్దతు అందించింది. అలాగే మీరు కూడా ఏపీని సందర్శించి ఇక్కడ ఉన్న బహుళ అవకాశాలను పరిశీలించాలని మీ టీమ్‌ను ఆహ్వానిస్తున్నాను" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

హెచ్ డి కోస్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్వోన్ యంగ్వాన్ మాట్లాడుతూ.. హెచ్‌డి కోస్‌ను ఏపీలో ప్రపంచస్థాయి షిప్‌బిల్డింగ్, సముద్ర ఇంజనీరింగ్ ఉపకరణాల కోసం వివిధ ప్రాంతాలను పరిశీలించాల్సిందిగా ఇచ్చిన ఆహ్వానం సంతోషదాయకం. టెక్నికల్, లాజిస్టికల్, వాణిజ్య అవసరాల ఆధారంగా సరైన, అనుకూల ప్రాంతాలను గుర్తించి మా అధికారులు మీకు తెలియజేస్తారు. దీర్ఘకాలిక అభివృద్ధికి అవసరమైన సరైన ఎకోసిస్టమ్ ఏపీ అందజేయగలదని మేము బలంగా విశ్వసిస్తున్నాం" అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికాభివృద్ధి విజన్, పెట్టుబడిదారులకు అత్యంత అనుకూల వ్యాపార వాతావరణాన్ని సృష్టించే తీరును ప్రత్యక్షంగా చూసి అవగాహన చేసుకునేందుకు, మా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో సమావేశమయ్యేందుకు ఏపీ రావాల్సిందిగా మంత్రి లోకేశ్ హెచ్‌డి కోస్ బృందాన్ని ఆహ్వానించారు.

# ఏపీలో ఎండ్ టు ఎండ్



- **పీసీబీ క్లస్టర్ నిర్మాణానికి సహకరించండి**
- **షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్‌తో మంత్రి లోకేష్ భేటీ**



సియోల్ (సౌత్ కొరియా): ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల తయారీలో పేరెన్నికగన్న షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్, ఇంజనీరింగ్ అడ్వైసివ్ షిబ్లీ అహమ్మద్‌లతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీకి ఏపీని గమ్యస్థానంగా ఎంచుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నాయుడుపేట వద్ద అభివృద్ధి చేసిన పీసీబీ ఎకోసిస్టమ్ వద్ద సిర్మా, జెట్‌వర్క్, ఎపిటోమ్, సిప్సా టెక్ అనే నాలుగు కంపెనీలు తయారీ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎండ్-టు-ఎండ్ పీసీబీ క్లస్టర్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు. షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్ మాట్లాడుతూ... "భారతదేశంలో ఈవీ/ఆటో, హెల్త్‌కేర్, స్మార్ట్ మీటరింగ్ కోసం పీసీబీలు, సీసీఎల్, ఈఎంఎస్‌లు తయారుచేసే అతిపెద్ద ప్లాంట్‌ను తిరుపతి జిల్లా నాయుడుపేటలో ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. రూ. 1,595 కోట్లతో ఏర్పాటు చేయబోతున్న ప్లాంట్ ద్వారా 2,170మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని టేహూ కిమ్ తెలిపారు.



# ఆంధ్రప్రదేశ్‌లో "బెస్"

- తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి
- డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేష్ భేటీ




సియోల్ (సౌత్ కొరియా): మెషిన్ విజన్, ఎడ్జ్ ఏఐ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్‌లో ప్రత్యేకత కలిగిన డెల్టా ఎక్స్ (దక్షిణ కొరియా) ఫౌండర్ అండ్ సీఈవో స్టీఫెన్ కిమ్, సంస్థ నాయకత్వ బృందంతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ 160 జిడబ్ల్యు గ్రీన్ ఎనర్జీ, 25 జిడబ్ల్యు బెస్ ప్రాజెక్టుల నిర్మాణమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇంగాట్‌లు, సోలార్-గ్రేడ్ సిలికాన్ వేఫర్‌లు, పీవీ సెల్‌లు, బ్యాటరీ సెల్‌లు, సోలార్ మాడ్యూళ్ల తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తోంది. పోర్టు యాక్సెస్‌తోపాటు మౌలిక సదుపాయాలు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో ఒక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తయారీ యూనిట్ నెలకొల్పండి. యుటిలిటీ-స్కేల్ స్టోరేజ్, డేటా-సెంటర్ ఆపరేటర్లు, ఇండస్ట్రియల్ పార్కుల కోసం రాష్ట్ర డిస్కమ్‌లు, పునరుత్పాదక ఇంధన డెవలపర్‌లతో అనుసంధానించడం ద్వారా మార్కెట్ ఇంటిగ్రేషన్ ప్రారంభించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్ మాట్లాడుతూ.. దక్షిణ కొరియాలో సెప్టెంబర్ 2020లో స్థాపితమైన తమ సంస్థ భారత కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో బెస్ తయారీ యూనిట్ నిర్మాణంపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.





# ఏపీలో కోట్రా/ఇన్వెస్ట్ కొరియా కార్యాలయాన్ని ప్రారంభించండి

**కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యాంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ**





సియోల్ (సౌత్ కొరియా): ఇన్వెస్ట్ కొరియా సంస్థ కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యాంగ్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. అమరావతి లేదా విశాఖపట్నంలో ఒక ప్రత్యేక కోట్రా /ఇన్వెస్ట్ కొరియా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. మెట్రో నగరాలు వినా దక్షిణ భారతదేశంలో ఇది మొదటి ఉప-జాతీయ కోట్రా కార్యాలయం అవుతుంది. ఇది ఏపీఈడీబీలో అంతర్భాగంగా ఉండే కోట్రా డెస్క్‌నుండి పూర్తిస్థాయి కార్యాలయంగా దశలవారీగా అభివృద్ధి చెందుతుంది. దీనికి సియోల్‌లోని కోట్రా /ఇన్వెస్ట్ కొరియాకు అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ డెస్క్ పనిచేస్తుంది. దీనిద్వారా ఏపీఈడీబీ -కోట్రా నడుమ బలమైన బంధం ఏర్పాటై పరిశ్రమదారులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పెట్టుబడిదారుల అవసరాలు, కమ్యూనిటీ అవసరాలపై నాలెడ్జ్ పార్టనర్‌గా ఉమ్మడిగా ఒక ప్రత్యేక కొరియా ఇండస్ట్రియల్ పార్క్ /కొరియా క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. ఏపీలోని శ్రీసిటీ, విశాఖపట్నం, అనంతపురం/కియా ఎకోసిస్టమ్‌కు కొరియన్ వ్యాపార ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించండి. ఏపీలో నిర్వహించనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ (12, 13 నవంబర్ 2026)లో కొరియా సంస్థలు పెద్దఎత్తున హాజరయ్యేలా ప్రోత్సహించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.


# అమరావతిలో శాంసంగ్

- ఆర్ అండ్ డీ ఏర్పాటు చేయండి
- ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేష్ భేటీ



సియోల్ (సౌత్ కొరియా): శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఎఫైర్స్) యంగ్ జో యున్, గ్లోబల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ నామ్ సూ పార్క్‌తో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "రాష్ట్రంలోని 10 జీడబ్ల్యు డేటా-సెంటర్ పైప్‌లైన్‌ను కేంద్రంగా చేసుకుని, డేటా సెంటర్లు, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌తో కూడిన పూర్తి ఏఐ-కంప్యూట్ స్టాక్ కోసం భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్ కేంద్రంగా మార్చండి. ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ-రెడీ హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను సంయుక్తంగా అభివృద్ధి చేయడంతోపాటు ఏపీలో ఏఐ-సర్వర్ తయారీని లోకలైజ్ చేయడానికి ముందుకు రండి. ఏపీలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించండి. విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఓసాట్ క్లస్టర్‌ను కేంద్రంగా చేసుకుని, ఆంధ్రప్రదేశ్‌లో కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక ఓసాట్ సదుపాయాన్ని ఏర్పాటుచేసే అవకాశాలను అన్వేషించండి. రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా, ఆంధ్రప్రదేశ్‌లో మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి. అమరావతి రాజధాని నగరం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల నిర్మాణంలో శాంసంగ్ భాగస్వామి కావాలి" అని కోరారు. ఆంధ్రప్రదేశ్ 133-క్యూబిట్ ఐబీఎం క్వాంటం సిస్టమ్ టూపై పరిశోధన చేయడానికి, శాంసంగ్ యొక్క ఆర్ అండ్ డీ విభాగాన్ని అమరావతి క్వాంటం వ్యాలీలోకి తీసుకురండి. శాంసంగ్ తన బహుళ విభాగాలకు నిలయంగా ఉండేలా ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని ఏపీలో నిర్మించాల్సిందిగా మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఎఫైర్స్) యంగ్ జో యున్ మాట్లాడుతూ... ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.





# గోదావరి పంచిన వరం!

# పట్టిసీమ నిలిపిన స్థైర్యం!!

- ఎల్‌నినో సవాళ్ల మధ్య కృష్ణా డెల్టాకు గోదావరి భరోసా
- 3 రోజుల్లో 1.33 టీఎంసీ జలాలు.. మళ్లీ రుజువైన దూరదృష్టి
- దశాబ్దకాలంలో 443 టీఎంసీ.. రైతు నోట పట్టిసం నామస్మరణ

గోదావరి పొంగిన ప్రతిసారీ.. కృష్ణమ్మ దాహం తీరుస్తున్న పట్టిసీమ!

మూడు రోజుల్లో 1.33 టీఎంసీ జలప్రవాహం.. కృష్ణా సంగమానికి చేరువ

ఎల్‌నినో సెగలు, జలాశయాలు అడుగంటినా.. చెక్కుచెదరని కృష్ణా డెల్టా భరోసా

మోటార్లు ఆన్ చేసిన మంత్రి నిమ్మల.. గోదావరి మాతకు జలహారతి

దశాబ్ద కాలంలో 439 టీఎంసీ జలాలు.. నేటికి 442 టీఎంసీ దాటిన చరిత్రాత్మక ఘనత

44 లక్షల ఎకరాలకు జీవం.. రూ.50 వేల కోట్ల సంపద సృష్టి

ఒకనాడు "ఒట్టిసీమ" అంటూ ఎద్దేవా.. నేడు కళ్లెదుటే కళ్లు చెదిరే విజయగాథ

ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని దాటుకుని.. కూటమి పాలనలో పూర్వవైభవం

గోదావరి-కృష్ణా వాటాలపై వివాదాలు కొనసాగుతున్నా.. మళ్లింపు మాత్రం నిరాఘాటం

పోలవరం పూర్తయ్యేదాకా కృష్ణా డెల్టాకు ఊపిరి పోస్తున్న శాశ్వత వారధి పట్టిసీమ

నదులు కేవలం జల ప్రవాహాలు కావు. తరతరాల నాగరికతలకు జీవం పోసిన ప్రాణధారలు. గోదావరి, కృష్ణా ఒక్కోవేళ ఒక్కో మాదిరిగా ప్రవర్తించినా, రెండు నదులనూ కలిపే వారధిగా నిలిచిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఏటా తన ప్రాధాన్యాన్ని కొత్తగా, బలంగా నిరూపించుకుంటూనే ఉంది. రుతుపవన దాగుడు మూతలతో.. ఈ వానాకాలమూ అదే జరిగింది. పోలవరం స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.550 మీటర్లకు చేరి, 1,07,800 క్యూసెక్కుల వరద దిగువకు వదులుతుంటే, ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అధికారులు 20 మోటార్లతో 7,080 క్యూసెక్కుల నీటిని కృష్ణాకు ఎత్తిపోశారు. కేవలం మూడు రోజుల్లోనే 1.33 టీఎంసీ గోదావరి జలాలు కృష్ణా పవిత్ర సంగమానికి చేరువయ్యాయి. ఇది వినడానికి సాధారణ నీటిపారుదల గణాంకంలా అనిపించొచ్చు. కానీ, వాస్తవానికి ఇది వేల ఎకరాల పంట నెర్రలు తీయకుండా కాపాడే నిశ్శబ్ద యుద్ధం!

ఈ వానాకాలం ప్రారంభంలోనే జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఏలూరు జిల్లాలో పర్యటించారు. పట్టిసీమ, తాడిపూడి ఎత్తిపోతల పథకాల మోటార్లను స్వయంగా ఆన్ చేసి గోదావరి మాతకు జలహారతిచ్చారు. 12 పంపుల ద్వారా 4,248 క్యూసెక్కుల నీటిని కుడి కాల్వకు వదిలారు. తర్వాతి రోజుల్లో పోలవరం వద్ద గోదావరికి 50 వేల క్యూసెక్కుల వరద రాగా, తూర్పు, పడమర, మధ్య కాల్వల ద్వారా 15,500 క్యూసెక్కుల నీటిని పూర్తి సామర్థ్యంతో విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. ఇది సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు... "నీరున్నపుడే మళ్లించా"లన్న కూటమి ప్రభుత్వ దూరదృష్టితో కూడిన ఒక సాంకేతిక, రాజకీయ సంకల్పం!

పట్టిసీమ కథ వెనుక నిర్దుష్టమైన చారిత్రక నేపథ్యముంది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపే గోదావరి వరద వృధా జలాలను కృష్ణాకు మళ్లించాలన్న ఆలోచనతో నేటి, నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నదీ అనుసంధాన పథకానికి శ్రీకారం చుట్టారు. 2016నాటికే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఈ ఎత్తిపోతల, రోజుకు 8,500 క్యూసెక్కుల గోదావరి జలాలను మళ్లించే సామర్థ్యంతో నిర్మితమైంది. అప్పట్లో దీనిపై రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకూ పెద్ద రాజకీయ దుమారమే రేగింది. స్వార్థపూరిత రాజకీయాలతో రగిలిపోయే ప్రత్యర్థి ముష్కరులు.. దివ్యమైన పథకాన్ని అపహాస్యం చేశారు. "ఒట్టిసీమ" అంటూ ఎద్దేవా చేశారు. సంకల్పం పెట్టుకున్న మునిలా విమర్శలను భరించిన చంద్రబాబు మౌనానికి.. ఇప్పుడు కాలమే సమాధానం చెప్తోంది. గత దశాబ్ద కాలంలో పట్టిసీమ ద్వారా 439 టీఎంసీ గోదావరి జలాలు కృష్ణా డెల్టాకు చేరాయన్నది తాజా అంచనా. ఒక టీఎంసీ నీటితో సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగు చేయవచ్చన్న లెక్కన చూస్తే, ఈ జలాలు దాదాపు 44 లక్షల ఎకరాల్లో పంటలకు ఆధారమయ్యాయి. ఎకరాకు సగటున 30 బస్తాల దిగుబడి, ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే ఈ నీరు రైతులకు రూ.18 వేల కోట్లకుపైగా ప్రయోజనం చేకూర్చిందని చెప్పక తప్పదు. ఇటీవలి గణాంకాల ప్రకారం ఈ మొత్తం ఇప్పటికే 442 టీఎంసీ దాటిందని, ఈ ప్రాజెక్టు ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా వ్యవసాయ సంపద సృష్టించామని ప్రభుత్వం చెప్పుకోవడంలో అతిశయోక్తి లేదు. జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఈ ప్రాజెక్టును వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా అభివర్ణించారు. 442 టీఎంసీకి పైగా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు విజయవంతంగా మళ్లించామని, ఆ ప్రాంతాల్లో పంటలు సమృద్ధిగా పండి రూ.50వేల కోట్లకుపైగా సంపద సృష్టించామని కూటమి మంత్రిగా తలెత్తుకుని మరీ ప్రకటించారు. ఇది -రాజకీయ ముష్కరులకిచ్చే సమాధానం కాదు, సంపద సృష్టిలో కూటమి ప్రభుత్వాధినేత సంకల్ప బలాన్ని చాటిచెప్పే ఆనందం!

ఈ ఏడాది పరిస్థితి మరింత ప్రత్యేకం. వర్షాభావం, ఎల్ నినో ప్రభావంతో కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి, జూరాల, శ్రీశైలం, తుంగభద్ర, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాలన్నీ నీటి కొరతతో తల్లడిల్లుతున్నాయి. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రాజెక్టుల్లోని నీరు ఆవిరయ్యే ప్రమాదం ఏర్పడింది. కృష్ణా బేసిన్‌లోని ప్రధాన జలాశయాలన్నీ అడుగంటడంతో.. కృష్ణా డెల్టా ఎండిపోయే ప్రమాదం ముంచుకొచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనే, ఎగువనుంచి వస్తున్న గోదావరి వరద నీటిని వృథాగా సముద్రంలో కలవనివ్వకుండా కృష్ణాకు మళ్లించే పట్టిసీమ మరోసారి రైతన్నలకు ఆసరా అయ్యింది. ఈ నేపథ్యంలోనే, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిర్వహణ పూర్తి నిర్లక్ష్యానికి గురైందని, రాజకీయ విద్వేషంతో పట్టించుకోలేదని జలవనరుల మంత్రి నిమ్మల వ్యక్తం చేసిన ఆగ్రహంలో అర్థం లేకపోలేదు. మంత్రి ఆవేదనలో ఒక విషయం మాత్రం స్పష్టం.. -నీటి పంపిణీ అనేది కేవలం ఇంజినీరింగ్ సమస్య కాదు, అది నిరంతర రాజకీయ చిత్తశుద్ధి, పరిపాలనా చురుకుదనంతో ముడిపడిన అంశం. ఐదేళ్లపాటు రాష్ట్రంలో విధ్వంసక పాలన సాగించిన తోలుమందం వైసీపీకి ఏనాటికీ అర్థంగాని విషయమది!

ఇక్కడ మరో విషయాన్నీ ప్రస్తావించాలి. గోదావరి జలాల వాటాలపై ఏపీ-తెలంగాణ మధ్య న్యాయపరమైన, రాజకీయ చర్చలు కొనసాగుతున్నాయి. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఇటీవలి అధ్యయనం ప్రకారం గోదావరిలో మొత్తం 3,397 టీఎంసీ జలాలుండగా, ఉమ్మడి ఏపీకి 1,435 టీఎంసీ, పట్టిసీమ ద్వారా కృష్ణా బేసిన్‌కు మళ్లిస్తున్న 45 టీఎంసీ కలిపి 1,480 టీఎంసీ వరకూ లభ్యత ఉందని స్పష్టం చేసింది. పట్టిసీమ ద్వారా కృష్ణా బేసిన్‌కు ఏపీ మళ్లిస్తున్న 45 టీఎంసీని కూడా కలిపితే మొత్తం 1,480 టీఎంసీ వరకు నీళ్లు లభ్యమవుతాయని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. ఈ గణాంకాలపై ఇరు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలున్నా, పట్టిసీమ ద్వారా జరుగుతున్న జలాల మళ్లింపు శాస్త్రీయంగానూ, న్యాయపరంగానూ ఏపీకి కీలక ఆధారంగా నిలుస్తోందన్నది కాదనలేని సత్యం. అంతేకాక, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే వరకూ పట్టిసీమే కృష్ణా డెల్టాకు ప్రధాన ఆధారమని, ప్రాజెక్టు పూర్తయ్యాక దీన్ని పక్కనపెడతామని ట్రిబ్యునల్ ముందు ఏపీ స్పష్టం చేసిన సంగతి కూడా గమనార్హం. అంటే పట్టిసీమ అనేది ఒక శాశ్వత పరిష్కారం కాదు, పోలవరం పూర్తయ్యే వరకూ కృష్ణాడెల్టాను నిలబెట్టే ఒక వారధి మాత్రమే!

ఒకప్పుడు సముద్రంలో కలిసిపోయి వృథా గోదావరి వరద జలాలు, నేడు పట్టిసీమ ద్వారా కృష్ణాకు ప్రాణధారగా మారుతున్నాయి. ఇది కేవలం ఇంజినీరింగ్ విజయంకాదు...నదుల అనుసంధానం వెనుక ఉన్న దూరదృష్టికి, ప్రణాళికాబద్ధమైన అమలుకు నిలువెత్తు నిదర్శనం! ప్రతి వానాకాలం గోదావరి పొంగుతున్నప్పుడు, ఆ వరద నీటిని సద్వి నియోగం చేసుకుంటూ కృష్ణా డెల్టా రైతుల కంట కన్నీరు రాకుండా చూసే బాధ్యతను ఈ పథకం సమర్థంగా నిర్వర్తిస్తోంది. ఎల్ నినో వంటి ప్రకృతి సవాళ్లు ఎదురైనప్పుడూ, సకాలంలో తీసుకున్న నిర్ణయాలు, వేగవంతమైన అమలు ఎంత కీలకమో ఈఏడాది పరిణామాలు మరోసారి రుజువు చేశాయి.

అయితే, ఈ విజయగాథ మనకు ఒక హెచ్చరిక కూడా. నీటి భద్రత అనేది ఒకసారి సాధించి వదిలేసే విషయం కాదు, అది నిరంతరం కాపాడుకోవాల్సిన బాధ్యత. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం, పట్టిసీమ వంటి తాత్కాలిక పరిష్కారాలపై శాశ్వతంగా ఆధారపడకుండా దీర్ఘకాలిక జలవనరుల ప్రణాళికలు రూపొందించడం ప్రభుత్వాల ముందున్న అసలు సవాలు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, గోదావరి-కృష్ణా వాటాలపై న్యాయపరమైన స్పష్టత సాధించడం కూడా అంతే ముఖ్యం. చివరిగా చెప్పాలంటే, పట్టిసీమ నేర్పిన పాఠం ఒక్కటే -ప్రకృతి ప్రసాదించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే చిత్తశుద్ధి ఉంటే, కరువు కాలంలో కూడా రైతన్న కళ్లలో ఆశాజ్యోతి వెలుగుతూనే ఉంటుంది. ఇది కూటమి ప్రభుత్వాధినేత చంద్రబాబు నమ్మకం. చంద్రబాబు సంకల్పం. చంద్రబాబు సాధించి చూపించిన వాస్తవిక దృశ్యం కూడా!!

- మహాదేవ

# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎరువుల సరఫరా
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టీకరణ

అమరావతి(చైతన్యరథం): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతోపాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90లక్షల మెట్రిక్‌టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో మంత్రి వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వఉంచామని,ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయశాఖ స్వాధీనంచేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు.అలాగే 85,683మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అనుగుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లాల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు.



### అసత్య ప్రచారాలు నమ్మొద్దు

విజయనగరం జిల్లాలోని ఆర్.అముదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్‌ఎస్‌కే పరిధిలో 731ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా,ప్రస్తుతం 90ఎకరాల వరి, 80ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు. ఈ ఆర్‌ఎస్‌కే పరిధిలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస, అప్పాపురం, ఎం.ఆర్.పేట గ్రామాలకు తొలి దఫా అవసరంగా 811బస్తాల యూరియా అవసరమని తెలిపారు. ఇప్పటికే బొడ్డవలస, అప్పాపురం గ్రామాలకు 225 బస్తాలు పంపిణీ పూర్తయిందని, మిగిలిన గ్రామాలకు 219 బస్తాలపంపిణీని యూరియా కార్డులు, APAIMS ద్వారా చేపట్టే సమయంలో రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో అదనపు డిమాండ్ ఏర్పడిందన్నారు.అదనంగా వెంటనే 444 బస్తాల యూరియాను సమీప రైతు సేవా కేంద్రం నుంచి తెప్పించి అదే రోజు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి, టోకెన్ విధానం, క్యూలైన్ ఏర్పాటుచేసి పంపిణీని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 9,987 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అందులో మార్క్‌ఫెడ్ వద్ద 4,850 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అవసరమైన ఎరువులను ప్రభుత్వం సమయానికి అందిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ యంత్రాంగం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరంఅప్రమత్తంగా పని చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## హాస్పిటాలిటీ రంగానికి 'జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్'ను పునరుద్ధరించండి

- మంత్రి దుర్గేష్‌కి ఏపీ ఛాంబర్స్, హోటల్స్ అసోసియేషన్ వినతి
- సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ



విజయవాడ(చైతన్యరథం):హాస్పిటాలిటీ రంగ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మరియు ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి హాస్పిటాలిటీ రంగానికి జీఎస్టీ సంస్కరణలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా.. వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 18% జీఎస్టీని 5%కు తగ్గించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి దుర్గేష్‌కు ప్రతినిధి బృందం విన్నించింది. కమర్షియల్ ఎల్‌పీజీ వినియోగిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు.. పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగిస్తున్న సంస్థలతో పోలిస్తే అధికనిర్వహణ వ్యయాన్ని భరిస్తున్నాయని,దీంతో వ్యాపార నిర్వహణలో అసమాన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఈవ్యత్యాసాన్ని తొలగించి హాస్పిటాలిటీ రంగానికి సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హాస్పిటాలిటీ రంగానికి జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పునరుద్ధరణ అత్యంత అవసరమని, ఐటీసీ తొలగింపుతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణ వ్యయం,మూలధన వ్యయం గణనీయంగా పెరిగాయని,సుమారు 20%వరకు పెరిగిన అద్దె భారం కారణంగా ఇప్పటికే తక్కువ లాభాలతో నడుస్తున్న హాస్పిటాలిటీ రంగంపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి ఏర్పడిందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రతిపాదనలపై మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులతో కేంద్ర ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అదే విధంగా ఈ నెల 14న టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (TTAA), ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ASHA), ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, అసోసియేషన్ ఆఫ్ నార్త్ ఆంధ్ర డొమెస్టిక్ అండ్ ఇన్‌బౌండ్ టూరిజం సంయుక్తంగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురంలోని బెర్మ్ పార్క్ హరిత రిసార్ట్‌లో"ఆంధ్రప్రదేశ్ ట్రావెల్ ఏజెంట్స్ మీట్/ఇన్‌బౌండ్ టూరిజం కాన్‌క్లేవ్"కు తమ పూర్తి సహకారం అందిస్తున్నందుకు మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కాన్‌క్లేవ్ ప్రభుత్వ, పర్యాటక రంగం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌బౌండ్ టూరిజం అభివృద్ధికి దోహదపడే ముఖ్య వేదికగా నిలవనుందని అన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన వారిలో ఏపీ ఛాంబర్స్ సలహాదారు లక్ష్మీనారాయణ, అధ్యక్షులు పి.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.స్వామి, ప్రధాన కార్యదర్శి ఎస్.మూర్తి చిట్టూరి, జాయింట్ సెక్రటరీ ఎం.వి.పవన్ కార్తీక్, ఏపీ ఛాంబర్స్ సభ్యులు, టూరిజం కమిటీ మెంబర్ కళ్యాణి కాకాని ఉన్నారు.

## మిగులు ఇథనాల్ వినియోగానికి త్వరలోనే మార్గదర్శకాలు

- తయారీదారులకు.. ప్రభుత్వానికి మేలు చేసేలా చర్యలు
- ఇథనాల్ తయారీదారులతో సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో ఇథనాల్ తయారీ యూనిట్ల మనుగడను కాపాడటానికి, మిగులు ఇథనాల్‌ను పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేందుకు అవసరమైన మార్గదర్శకాలను త్వరలోనే జారీ చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సచివాలయంలోని మూడో బ్లాక్‌లో ఇథనాల్ తయారీదారుల సంఘం ప్రతినిధులతో శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగినప్పటికీ,కేంద్ర ప్రభుత్వ 'ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్' కోసం ప్రభుత్వ రంగ చమురుసంస్థలు కొనుగోలు చేస్తున్న పరిమాణం చాలా పరిమితంగా ఉందని అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా భారీగా ఇథనాల్ నిల్వలు మిగిలిపోతున్నాయని, ఫలితంగా తయారీ యూనిట్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదంఉందనివారు ఆందోళన వ్యక్తం చేశారు. మిగిలిపోయిన ఇథనాల్‌ను ఫార్మాస్యూటికల్స్, పెయింట్స్, కెమికల్స్ వంటి పారిశ్రామిక వినియోగదారులతోపాటు ప్రైవేట్ రంగ చమురు కంపెనీలకు విక్రయించేందుకు అనుమతించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలతో కుదుర్చుకున్న ఈబీపీ ఒప్పందం నెరవేర్చిన తర్వాతే, మిగిలిన మొత్తాన్ని ఇతర పరిశ్రమలకు మళ్లిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి హామీ ఇచ్చారు.

అసోసియేషన్ విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి.. పారిశ్రామిక అవసరాల కోసం మాత్రమే మిగులు ఇథనాల్ విక్రయాన్ని సులభతరం చేసేలా త్వరలో నిబంధనలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామిక అవసరాల కోసం అనుమతించే ఈ మిగులు ఇథనాల్ ఎలాంటి పరిస్థితుల్లోనూ దుర్వినియోగం కాకుండా, మద్యపాన అవసరాలకు మళ్లకుండా కఠినమైననిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. తయారీదారులు ఈబీపీ నిబంధనలను నూటికి నూరుశాతం పాటించేలా కొత్త మార్గదర్శకాలు రూపొందిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, తదితర అధికారులు పాల్గొన్నారు.






### కువైట్‌లో పాస్‌పోర్ట్, వీసా సేవలు

# తాత్కాలికంగా నిలిపివేత

### ఈ నెల 19 వరకు: భారత ఎంబసీ అప్డేట్

కువైట్: కువైట్‌లోని భారతీయులకు అక్కడి భారత ఎంబసీ ఒక ముఖ్యమైన అప్డేట్ ఇచ్చింది. పరిపాలనా పరమైన కారణాల వల్ల ఈ నెల 19వ తేదీ వరకు భారతీయుల సాధారణ పాస్‌పోర్ట్, వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఈ కాలంలో కేవలం అత్యవసర కేసుల్లో మాత్రమే సేవలు అందుబాటులో ఉంటాయి. ఇందుకోసం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాన్సులర్ విభాగాన్ని సంప్రదించాల్సి ఉంటుంది. తాత్కాలిక విరామం సమయంలో తత్కాల్ పాస్‌పోర్ట్, ఎమర్జెన్సీ సర్టిఫికెట్లు, ఈ–వీసాలు, సివిల్ ఐడీ గడువు ముగుస్తున్న వారికి స్వల్పకాలిక పాస్‌పోర్ట్ దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తారు.

తాత్కాలిక ఆంక్షలు ఎత్తివేసే వరకు సాధారణ పాస్‌పోర్ట్, వీసా సేవల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన పూర్తిగా నిలిచిపోతుంది. తదుపరి ప్రకటన వచ్చే వరకు కువైట్‌లోని అన్ని ఇండియన్ కాన్సులర్ అప్లికేషన్ సెంటర్లు కూడా మూసివేసి ఉంటాయి.

ఇదే తరహాలో ఇటీవల యూఏఈలో కూడా కొన్ని రోజుల పాటు భారత పాస్‌పోర్ట్, వీసా సేవలకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. అక్కడ కొత్త సర్వీస్ ప్రొవైడర్‌కు కాన్సులర్ సేవలు మారడం వల్లే ఆ సమస్య వచ్చినట్టు సమాచారం.

# రెండేళ్లలో రెట్టింపు సంక్షేమం..
# ఇంటింటా సంతోషం

- ప్రజల పట్ల చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం
- జగన్‌రెడ్డిది మోసపూరిత సంక్షేమం
- అరకొర పథకాలతోనే రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారు
- రూ. వేలకోట్ల బకాయిల భారం పెట్టి వెళ్లారు
- అప్పులకు వడ్డీలు, అసలు కట్టుకుంటూనే బకాయిలు తీరుస్తున్న కూటమి
- అదే సమయంలో ప్రజలకు మెరుగైన సంక్షేమం, సంపద సృష్టి
- సీఎం చంద్రబాబు పాలనలో జోడెడ్లలా అభివృద్ధి, సంక్షేమం
- జగన్ సహా వైసీపీలో ఎవరొచ్చినా చర్చకు సిద్ధం
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్

అమరావతి(చైతన్యరథం):కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతూ, ప్రతి ఒక్కరిలోనూ సంతోషం & వెల్లివిరుస్తోందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ కుమార్ పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విజయకుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మా ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి, పాలనలో తీసుకొచ్చిన మార్పులను వివరించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఈ రెండేళ్లలో ప్రభుత్వం అమలుచేసిన వందలాది సంక్షేమకార్యక్రమాల్లో ప్రధానమైన 12పథకాలను మాత్రమే తీసుకుంటే.. ఈ 12 పథకాల ద్వారానే రాష్ట్ర ప్రజలకు రూ.1,17,000 కోట్లకు పైగా సంక్షేమాన్ని అందించగలిగామన్నారు. ఇది గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం లాంటి ఉత్తిత్తి నమూనా కాదు, రాష్ట్రాన్ని ముంచేసే అప్పులనమూనా అంతకన్నా కాదు. రూపాయి అవినీతి లేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ), అన్న క్యాంటీన్లు, ఉచిత బస్సు ప్రయాణం,అన్నదాత సుఖీభవ,పెన్షన్ల రూపంలో నేరుగా లబ్ధిదారులకు అందించాం. దమ్ముంటే మేము ఖర్చుచేసిన ఈ రూ. 1,17,000కోట్లపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకురావాలని వైఎస్సార్సీపీకి సవాల్ విసురుతున్నాం.ఆధారాలతో సహా సమాధానం చెప్పడానికి మేము సిద్ధం.గతంలో జగన్మోహన్‌రెడ్డి రూ.2000 ఉన్న పెన్షన్‌ను ఐదేళ్ల పాటు లాగి,లాగి... చివరికి ఎన్నికలు వస్తున్నాయనగా రూ.3000చేశారు. మేము అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం రూ. 1000 వెయ్యి పెంచి, రూ.4,000 పెన్షన్ ఇస్తున్నాం. అంతే కాదు, 2024 జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలను కలిపి మరీ పేదలకు అందించాం.తమిళనాడులో రూ. 1500, కర్ణాటక, మహారాష్ట్రల్లో రూ. 1000, బీహార్‌లో రూ. 500 చొప్పున మాత్రమే పెన్షన్లు ఇస్తున్నారు.కొన్నిరాష్ట్రాల్లో రూ. 300 కూడా ఉంది. కానీ, దేశం మొత్తం మీద ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో తప్ప మరే రాష్ట్రంలోనూ పేదలకు నెలకు రూ.4,000 పెన్షన్ ఇవ్వడం లేదు. జూన్ 30వ తేదీ నాటికి రెండేళ్లలో కేవలం పెన్షన్ల కోసమే కూటమి ప్రభుత్వం రూ. 68,194.68కోట్లు ఖర్చు చేసిందని ఆయన వెల్లడించారు. అంతేకాదు, గత నెలలోనే అర్హులైన మరో 2లక్షల మంది వితంతువులు,ఒంటరి మహిళలకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేశాం. కూటమి ప్రభుత్వంలో పేదలు ఎంతో ఆనందంగా, ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని, సంక్షేమంతోపాటు రాష్ట్రాన్ని ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్తున్నామని నీలాయపాలెం విజయ్‌కుమార్ గర్వంగా ప్రకటించారు.

## రెండింతల అదనపు సాయం

మేము ప్రజాధనాన్ని ఏట్లో వేయడం లేదు, పేద ప్రజల సంక్షేమం కోసం వాడుతున్నాం. అందుకే ప్రతీ పైసా లెక్క చెబుతున్నాం. జగన్మోహన్‌రెడ్డి లాగా టీవీల్లో కేవలం బటన్లు నొక్కడం చూపించి, తీరా చూస్తే ప్రజల అకౌంట్లలో డబ్బులు పడకుండా మోసం చేసే రకం కాదు మా కూటమి ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే దానికి తోడుగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం దాదాపు రూ. 14,000 అదనంగా జోడించి అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు ఇస్తోంది. మొన్న జూన్ నెలలో విడుదల చేసిన వాయిదాతో కలిపి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ. 12,110కోట్లు అందించాయి. గతంలో జగన్మోహన్‌రెడ్డి కేంద్రం ఇచ్చే నిధులు కాకుండా తన వంతుగా ఇచ్చింది కేవలం రూ.6,000 మాత్రమే. కానీ కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ. 14,000 అదనంగా ఇస్తూ, వారి పెట్టుబడి భారాన్ని తగ్గిస్తోంది. వారం పది రోజుల క్రితమే ఈ సంవత్సరపు మొదటి విడత వాయిదా సొమ్ము రైతుల ఖాతాల్లో పడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 46.85లక్షల మంది రైతుల్లో ఎవరిని అడిగినా.. గత ప్రభుత్వం కంటే తాము రెండింతల అదనపు సాయం అందుకుంటున్నామని సంతోషంగా చెబుతారని పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత నెల నాటికి రూ. 2,207 కోట్లు వెచ్చించాం. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందించేందుకు ఈరెండేళ్లలోనే రూ. 941కోట్లు ఖర్చు చేశాం. ఎస్సీ, ఎస్టీ, చేనేత, నాయీ బ్రాహ్మణులకు కల్పిస్తున్న ఉచిత విద్యుత్ సబ్సిడీల కోసం రూ. 600కోట్లు కేటాయించాం. వైఎస్సార్సీపీ వాళ్లు కూడా తాము బటన్లు నొక్కామని, సాక్షి పేపర్లో ఫుల్ పేజీ హెడ్‌లైన్స్ వేసుకున్నామని గొప్పలు చెప్పుకోవచ్చని ఎద్దేవా చేశారు. కానీ, కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమానికి, వైఎస్సార్సీపీ చేసిన దానికి 'హస్తిమశకాంతరం' తేడా ఉందన్నారు. మా కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం 'ఏనుగు' లాంటిదైతే, గత వైఎస్సార్సీపీ పాలన 'దోమ' లాంటిది" అని ఆయన అభివర్ణించారు. చేసిన పనిని ధైర్యంగా ప్రజలకు చెప్పుకునేందుకే ఈ వివరాలన్నీ వెల్లడిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పెన్షన్ల కోసమే రూ.1,70,000 కోట్లు

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో (2019-2024) పెన్షన్ల కోసం ఖర్చు చేసింది కేవలం రూ. 84,000కోట్లు మాత్రమే. కానీ, మా కూటమి ప్రభుత్వం కేవలం ఈ రెండేళ్ల కాలంలోనే (జూన్ 30 నాటికి) ఏకంగా రూ. 68,194 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేసింది. ఈ లెక్కన 2029 నాటికి మా ఐదేళ్ల పదవీకాలం ముగిసేసరికి కేవలం పెన్షన్ల కోసమే కూటమి ప్రభుత్వం రూ. 1,70,000కోట్లు ఖర్చు పెట్టబోతోంది. వయసు పెరిగే కొద్దీ కొత్తగా పెన్షన్ పరిధిలోకి వచ్చే వారి సంఖ్య మారుతుంటుంది. ఉదాహరణకు ఈ రోజు 58ఏళ్లు ఉన్న వ్యక్తికి రెండేళ్లలో 60ఏళ్లు రాగానే ఆటోమేటిక్‌గా పెన్షన్ అందుతుంది. ఇలా లబ్ధిదారులు పెరుగుతున్నా.. ఎక్కడా వెనకడుగు వేయకుండా రూ. 4,000 పెన్షన్ నిరంతరాయంగా అందిస్తాం. గత వైసీపీ ప్రభుత్వంలో పెన్షన్లు పీకేయడానికి 1000 గజాలస్థలం ఉందనో, ఆరు-ఏడు రకాల కొసరు నిబంధనలు పెట్టి డ్రామాలు ఆడారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి కోతలు, మోసాలు ఏమీ లేవు, అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా పెన్షన్ అందుతోంది. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా బడ్జెట్ భారం తగ్గించుకోవడానికి 'ఒక కుటుంబానికి ఒకే బిడ్డ' అనే నిబంధనతో నగదు బదిలీ పథకాలు అమలు చేస్తున్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి కూడా అందరికీ ఇస్తానని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక ఒక్క బిడ్డకే పరిమితం చేసి మోసం చేశారు. కానీ మా కూటమి ప్రభుత్వం ఆ నిబంధనను పూర్తిగా తొలగించింది. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి(ఇంటర్మీడియట్) వరకు ఒకే ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నా, అర్హులైన పిల్లలందరికీ తల ఒక్కరికీ రూ. 15,000 చొప్పున అందిస్తున్నాం. ఇందుకోసం గత ఏడాది రూ. 10,000 కోట్లు ఖర్చు చేయగా, ఈ సంవత్సరం కూడా మరో రూ. 10,000



కోట్ల పైచిలుకు కేటాయించాం. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను కూడా ఈ పథకం పరిధిలోకి తెచ్చాం. అలాంటి పిల్లల పేరిట ప్రత్యేకంగా బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసి ఈ రూ. 15,000 అందిస్తున్నాం. తల్లి లేని అనాథలకు ఈ కూటమి ప్రభుత్వమే ఒక తల్లిలా అండగా నిలబడుతుంది. గత ప్రభుత్వం నాడు-నేడు పేరిట ఏవో కొన్ని స్కూళ్లలో రంగులు వేసి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది. దానికి భిన్నంగా మా ప్రభుత్వం ఈ రూ. 15,000 లబ్ధిలోనే రూ. 2,000లను పాఠశాలల్లోని టాయిలెట్లు,బాత్రూమ్‌లను నిరంతరం శుభ్రంగా, ఉంచేందుకు ప్రత్యేక నిధిగా కేటాయించి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తోంది. చేసిన ప్రతి పనిని ప్రజల ముందుపెట్టి,ధైర్యంగా నిలబడే ఏకైక ప్రభుత్వం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మాత్రమేనని విజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

## బకాయిల గురించి జగన్ చెప్పాలి

జగన్మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఒకటో, రెండో తేదీల్లో తన ఇంట్లో తనకు నచ్చిన విలేఖరులను మాత్రమే కూర్చోబెట్టుకుని ప్రెస్ మీట్లు పెడతారు కదా. ఈసారి మేము డిమాండ్ చేస్తున్నాం... దమ్ముంటే మీరు దిగిపోతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఎంత బకాయిపెట్టేసి పోయారో మాట్లాడండి!ఎలక్షన్ల ముందు కేవలం ఓట్ల కోసం బటన్లు నొక్కి, ఆ డబ్బులు అకౌంట్లలో పడకుండా సంవత్సరం పాటు విద్యార్థులను ఎందుకు వంచించారో సమాధానం చెప్పాలి. జగన్‌రెడ్డి పోతూ పోతూ కూటమి ప్రభుత్వానికి కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ. 4,000కోట్ల బకాయిలను వదిలిపెట్టారు. దానికి తోడు కాస్మెటిక్ ఛార్జీలు, హాస్టల్ ఫీజుల బకాయిలు మరో రూ. 1,300 కోట్లు ఉన్నాయి. అంటే మొత్తం రూ. 5,300 కోట్ల భారీ బకాయిలను విద్యార్థులకు ఎగ్గొట్టి వెళ్లారు. అందుకే ప్రజలు బుద్ధి చెప్పి మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు. జగన్‌రెడ్డి విద్యా దీవెన పథకం ఒక నకిలీ ముసుగు.కాలేజీలకు ఫీజులు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పేద విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లో చిక్కుకుపోయాయి. సొంత పత్రికలో ఫుల్ పేజీ యాడ్స్ వేసుకుని మురిసిపోయిన జగన్‌రెడ్డి ఫీజులు ఎగ్గొడితే, నేడు కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పాత బకాయిలన్నిటినీ కట్టుకుంటూ వస్తోందని విజయ్ కుమార్ చెప్పారు.

## మహిళల కోసం..

1995లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో పొయ్యి పొగ నుంచి మహిళలకు విముక్తి కలిగిస్తూ 'దీపం' పథకం ద్వారా ద్వాక్రా మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన ఘనత దక్కింది. నేడు 'దీపం 2' కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా కోటి 8లక్షల మంది మహిళా లబ్ధిదారులకు 4 కోట్ల 57లక్షల సిలిండర్లను విజయవంతంగా పంపిణీచేశాం. ఆగస్టు 15, 2025న ప్రారంభమైన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం ఈ ప్రతిష్ఠాత్మక పథకంకోసం ఇప్పటి వరకు రూ. 2,721కోట్లు ఖర్చు చేశాం. కొత్త ఆర్థిక సంవత్సరం (2025-26) ఏప్రిల్, మే, జూన్ మొదటి త్రైమాసికంలోనే రూ. 768 కోట్లు చెల్లించాం. అంటే రాష్ట్రంలోని ఆడబిడ్డల ఉచిత, సుఖవంతమైన బస్సు ప్రయాణం కోసం కూటమి ప్రభుత్వం ప్రతి నెలా రూ. 250 కోట్లకు పైగా కేవలం ఆర్టీసీ బస్సు చార్జీల కోసమే భరిస్తోందని మహిళాలోకం గమనించాలి. ఉచిత బస్సు పథకం వల్ల ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారనే విషయాన్ని గ్రహించి, మానవతా దృక్పథంతో కూటమి ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. ఆటోలు, త్రీ వీలర్లు, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం రూ. 436కోట్లు కేటాయించిందని విజయ్ కుమార్ తెలిపారు.

జగన్‌రెడ్డి కక్షపూరితంగా మూసేసిన అన్న క్యాంటీన్లను మేము రాగానే తిరిగి తెరిచాం. ఆగస్టు 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య రూ. 206కోట్లు దీనిపై వెచ్చించాం. గత ఒకట్రెండు సంవత్సరాలుగా (జూన్ 2024 నుంచి మొన్నటి మార్చి దాకా) అన్న క్యాంటీన్ల ద్వారా ఏకంగా 10 కోట్ల 41 లక్షల 84,967 టోకెన్లు జారీచేసి వేడి వేడి, నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అందించాం.ఇప్పటివరకు ఈఆహార నాణ్యతపై ఎవరూ ఒక్క తప్పు కూడా ఎంచలేకపోయారని విజయ్ కుమార్ అన్నారు.

## అప్పుల నమూనాకు చరమగీతం

కేవలం ఈ 12ప్రధాన పథకాల ద్వారానే కొండంత సంక్షేమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చామని, అప్పుల నమూనాకు చరమగీతం పాడి, అవినీతి లేని నిజమైన అభివృద్ధి నమూనాను కూటమి ప్రభుత్వం చూపిస్తోందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పోతూ పోతూ రాష్ట్రంపై వేసి వెళ్లిన వారసత్వ అప్పుల కోసం కూటమి ప్రభుత్వం ప్రతి సంవత్సరం అక్షరాలా రూ. 59,427కోట్లు కేవలం అసలు,వడ్డీల కింద కట్టాల్సివస్తోంది. ఇందులో కేవలం సంవత్సరానికి వడ్డీలే రూ. 37,284కోట్లు ఉన్నాయి. అంటే జగన్‌రెడ్డి చేసిన అప్పులకు మా కూటమి ప్రభుత్వం ప్రతి నెల రూ. 3,023కోట్ల పైచిలుకు కేవలం వడ్డీల కిందనే చెల్లిస్తోంది. వడ్డీలు రూ. 3,000కోట్లు, అసలుకింద మరో రూ. 2,000కోట్లు కలిపి...ప్రతి నెల దాదాపు రూ. 5,000కోట్లు గతప్రభుత్వ అప్పుల కోసమే సరిపోతోంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో పావు భాగం(25.37 శాతం) గత ప్రభుత్వ అప్పుల ఊబిని పూడ్చడానికే సరిపోతోంది. అయినా సరే, వెనకడుగు వేయకుండా మిగిలిన నిధులతోనే ఈ రెండేళ్లలో కేవలం 12 ప్రధాన పథకాల ద్వారానే రూ. 1,17,000 కోట్లు పేద ప్రజల సంక్షేమానికి ఖర్చు చేశాం. గత ప్రభుత్వంలో ఉన్న ఆర్థిక మంత్రి కేవలం ప్రగల్భాలు పలికేవారని, ఇప్పుడు ఆయన రావడం మానేశారని ఎద్దేవా చేశారు.

## పెరిగిన ఆదాయం

జగన్‌రెడ్డి తరువాత పెట్టబోయే ప్రెస్ మీట్‌లో సంపద సృష్టిపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో సగటున నెలవారీ జీఎస్టీ వసూళు రూ. 3,500కోట్లు మాత్రమే ఉండేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలోనే పారదర్శక విధానాల ద్వారా సగటు నెలవారీ జీఎస్టీ వసూళ్లను రూ. 4,950 కోట్లకు పెంచాం. అంటే గత ప్రభుత్వం కంటే నెలకు సరాసరి రూ. 1,400నుండి రూ. 1,500 కోట్ల అదనపు ఆదాయాన్ని ప్రభుత్వం సృష్టిస్తోంది. కూటమి ప్రభుత్వ పారిశ్రామిక, ఆర్థిక విధానాల వల్ల గత మే నెలలో 19 శాతం, జూన్ నెలలో 16శాతం వార్షిక వృద్ధి రేటు నమోదైంది. రాష్ట్ర సొంత జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) వృద్ధిలో 21శాతంతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచింది. సృష్టించిన ఈ సంపదనంతటినీ తిరిగి ప్రజల సంక్షేమం కోసమే ధైర్యంగా ఖర్చు పెడుతున్నామని విజయ్ కుమార్ చెప్పారు.

## చర్చకు సిద్ధం..

ఖర్మకాలి జగన్మోహన్ రెడ్డి మళ్లీ పేపర్లలో ఫుల్ పేజీ యాడ్స్‌వేసుకుని...తన ఐదేళ్లపాలనలో రూ. 2,70,000 కోట్లు ఖర్చు పెట్టానని డబ్బా కొట్టు కోవచ్చు. జగన్‌రెడ్డి చెబుతున్నట్లు అంత డబ్బు నిజంగానే పేదల అకౌంట్లలోకి పోయింటే... గత ఎన్నికల్లో ప్రజలు మీకు ఎందుకు ఓట్లువేయలేదు? ఎందుకు 11సీట్లకు పరిమితం చేశారు? అవి ప్రజల ఖాతాల్లోకి వెళ్లలేదు కాబట్టే, మిమ్మల్ని ఇంటికి పంపించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో అమ్మఒడి కింద కేవలం రూ. 20,000కోట్లు మాత్రమే ఇచ్చే... మా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ద్వారా పిల్లలందరికీ చదువు చెప్పిస్తూ ఐదేళ్లలో రూ. 40,000కోట్లు ఖర్చు పెట్టబోతోంది. రైతుల పెట్టుబడి సాయం కోసం గతప్రభుత్వం కేవలం రూ. 23,000కోట్ల చిల్లర ఇస్తే... మాకూటమి ప్రభుత్వం ఐదేళ్లలో ఏకంగా రూ. 50,000కోట్లు

- (మిగతా వివరాలు 13లో)

చైతన్యరథం

## నాడు పరిశ్రమల ముసుగులో జగన్ లూటీ...

# నేడు పెట్టుబడుల రాకతో ఉపాధి విప్లవం

- నాడు 'డిఫాక్టో సీఎం'గా జగన్‌రెడ్డి దోపిడీ
- క్విడ్ ప్రో కో కోసమే బ్రాహ్మణికి వేల ఎకరాల పందేరం
- బ్యాంకులో తాకట్టు.. రూ.350కోట్ల రుణం పేరుతో కనికట్టు
- సూట్‌కేస్ కంపెనీల ద్వారా తిరిగి జగన్ సంస్థల్లోకి రూ.74 కోట్లు
- నేడు చంద్రబాబు హయాంలో 14,000 ఎకరాల భూమి తిరిగి స్వాధీనం
- సొంత జిల్లా ప్రజలనే ముంచిన జగన్‌రెడ్డి.. చంద్రబాబు, లోకేష్‌లను చూసి నేర్చుకో
- ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

అమరావతి (చైతన్యరథం): గత పాలకుల దోపిడీ పాలనకు, నేటి కూటమి ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని పరిశ్రమలకు భూ కేటాయింపుల పేరుతో క్విడ్ ప్రోకో ద్వారా జగన్ కోట్లు దండుకున్నారని ఆరోపించారు. బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో రాయలసీమ యువతకు ఉపాధి ఇస్తాననే భ్రమకల్పించి భారీ దోపిడీ చేశారన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ అవినీతిని,ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పారిశ్రామిక ప్రగతిని ఆధారాలతో సహావివరించారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో.. ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి..తన తండ్రి ముఖ్యమంత్రి పదవిని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఏ రకంగా 'క్విడ్ ప్రో కో'కు పాల్పడ్డారో మనమంతా చూశాం. పరిశ్రమల స్థాపన ముసుగులో వందల, వేల ఎకరాల ప్రభుత్వ భూములను, ప్రజల ఆస్తులను తనకు కావాల్సిన కంపెనీలకు ధారాదత్తం చేసి.. దానికి ప్రతిఫలంగా జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్, సండూర్ పవర్ వంటి తన సొంత సంస్థల్లోకి కోట్ల రూపాయల నిధులను మళ్ళించుకున్న వైనం జగమెరిగిన సత్యం. దీనిపై సీబీఐ, ఈడీ కేసులు ఇప్పటికీ కోర్టుల్లో నడుస్తూనే ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లాలో తానేదో కొన్ని వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తున్నాననే భ్రమను కల్పించి..పరిశ్రమలస్థాపన పేరుతో నాడు బ్రాహ్మణి స్టీల్స్ సంస్థకు ఏకంగా 14,000 ఎకరాల భూములను కట్టబెట్టారు. అదంతా కేవలం దోపిడీ కోసమేనని కాలం నిరూపించింది. పరిశ్రమల ముసుగులో జగన్‌రెడ్డి ఏ విధంగా లూటీ చేశాడో చెప్పడానికి బ్రాహ్మణి స్టీల్స్ వ్యవహారమే ఒక ప్రత్యక్ష ఉదాహరణ. రాజశేఖర్‌రెడ్డి కాలంలో గానీ, ఆ తర్వాత జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గానీ జరిగింది ఉపాధి సృష్టి కాదు.. ఉపాధి పేరుతో కేవలం లూటీ మాత్రమే. కానీ ఈరోజు రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకొస్తూ, సంపదను సృష్టిస్తూ ఉపాధి విప్లవానికి నాంది పలికింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్నటువంటి అవిశ్రాంతమైన కృషి ఫలితంగా ఈరోజు దేశ, విదేశాల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు తరలివస్తున్నాయి. ఒకవైపు పెట్టుబడుల వరద, మరోవైపు యువతకు ఉద్యోగాల కల్పనతో ఒక గొప్ప ఉపాధి విప్లవం ఈరోజు మన కళ్ళ ఎదుటే సాక్షాత్కరిస్తోంది. నాడు దోపిడీ దొంగల పాలనలో భూములు లూటీ అయ్యాయి.. నేడు చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో పరిశ్రమల స్థాపనతో యువతభవిష్యత్తు బంగారుమయంగా మారుతోంది. గత పాలకుల అవినీతికి, కూటమి ప్రభుత్వ అభివృద్ధికి ఉన్న తేడాను రాష్ట్ర ప్రజలంతా గమనించాలని పట్టాభి కోరారు.

### నాడు జగన్ రెడ్డి 'డిఫాక్టో సీఎం'గా దోపిడీ..

గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో, ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఏ రకంగా ఒక అనాథరైజ్డ్ పవర్ సెంటర్ లా మారి, 'డిఫాక్టో సీఎం'గా చెలామణి అవుతూ రాష్ట్ర సంపదను లూటీ చేశాడో చెప్పడానికి ఈరోజు మీ ముందు కొన్ని తిరుగులేని ఆధారాలను, జీవో కాపీల వివరాలను ఉంచుతున్నాను. వైఎస్సార్ కడపజిల్లా జమ్మలమడుగు వద్ద స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపేరుతో నాటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 8/6/2007తేదీన జీవో నంబర్ 785ను విడుదల చేసింది. ఈ జీవో ద్వారా ఏకంగా 14,000 ఎకరాల ప్రభుత్వ భూమిని అత్యంత కారుచౌకగా బ్రాహ్మణి స్టీల్స్ సంస్థకు కట్టబెట్టారు. నాడు అక్రమ మైనింగ్ కేసుల్లో అడ్డంగా దొరికిపోయిన ఓబులాపురం మైనింగ్ కంపెనీ, గాలి జనార్దన్‌రెడ్డి వెనుక ఉన్న శక్తులే ఈ బ్రాహ్మణి ఇండస్ట్రీస్ వెనుక కూడా ఉన్నాయి. వీరంతా కలిసి ఆ రోజున స్టీల్ ప్లాంట్ పెడతామంటూ ఒక దొంగ ప్రతిపాదన ముందుకు తెస్తే.. నాటి ప్రభుత్వం ఎకరం భూమిని కేవలం అంటే కేవలం రూ.18,500 లకే ఇచ్చేసింది. ఎకరానికి రూ.18,500 చొప్పున లెక్కిస్తే.. ఈ 10,760 ఎకరాల భూమి విలువ కేవలం 20కోట్ల రూపాయలు. 3,115ఎకరాలు విమానాశ్రయం నిర్మాణం పేరుతో కట్టబెట్టారు. భూమి కేటాయింపు జీవో జూన్ 8,2007న వస్తే..10/10/2007న బ్రాహ్మణి స్టీల్స్‌కు శంకుస్థాపన చేశారు. ఆనాటి శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన అధికారిక చిత్రాలను ఒక్కసారి పరిశీలిస్తే..అక్కడ అన్నీ తానై నడిపించింది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనేది స్పష్టంగా కనబడుతోంది. నేను జగన్‌రెడ్డిని నేరుగా డిమాండ్ చేస్తున్నాను. ఆ రోజుకు నీకున్న అధికారిక హోదా ఏంటి? నువ్వేమైనా ఎంపీవా, ఎమ్మెల్యేవా లేక మంత్రా? జగన్‌రెడ్డి మొట్టమొదటిసారి ఎంపీ అయింది 2009లో. మరి 2007లో జరిగిన ఒక అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పక్కన నిలబడి, సీనియర్ క్యాబినెట్ మంత్రులందరినీ పక్కకు నెట్టేసి, కొబ్బరికాయ చేతపట్టుకుని నువ్వు ఏ హోదాలో శంకుస్థాపన చేశావు? ఎందుకంటే ఆనాడు క్విడ్ ప్రో కో ద్వారా నీ సొంత సంస్థలైన జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్, సండూర్ పవర్‌లలోకి కోట్ల రూపాయల నిధులు మళ్ళించుకోవడానికి డీల్ కుదుర్చుకున్న 'డిఫాక్టో సీఎం'నువ్వు కాబట్టే ఆ వేదికపై అంత హడావుడి చేశావు. శంకుస్థాపన జరిగి ఇన్నేళ్లయినా ఆ భూమిలో ఒక్క ఇటుకరాయి పెట్టలేదు, ఒక్క ఉద్యోగం సృష్టించలేదు. కేవలం తమ జేబులు నింపుకోవడం కోసమే పెట్టుబడుల ముసుగులో భూ బకాసురులకు ఆస్తులు దారాదత్తం చేశారు. కానీ ఈరోజు రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాప్రభుత్వం, చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. జగన్‌రెడ్డి లూటీకి బలైన ఆ14,000ఎకరాల ప్రజా సొత్తును కాపాడింది. కడపజిల్లా కలెక్టర్ చేకూరి శ్రీధర్ ఆదేశాలతో, న్యాయస్థానాల్లో ఉన్న అన్ని రకాల చట్టపరమైన ఆటంకాలను తొలగించుకొని, ఆ 14,000ఎకరాల భూమిని చంద్రబాబు ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది. ఒకవైపు ఆనాడు లూటీ అయిన భూములను వెనక్కి తీసుకుంటూనే.. మరోవైపు అదే కడపజిల్లాలో ప్రముఖ జిందాల్ కంపెనీ సహకారంతో చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నిజమైన స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేయించాం. ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ గారి అవిశ్రాంత కృషి వల్ల ఈరోజు రాష్ట్రంలో ఉపాధి విప్లవం కళ్ళముందు కనిపిస్తోంది. గత పాలకుల 'దోపిడీ'కి..చంద్రబాబు 'అభివృద్ధి'కి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలంతా గమనించాలని పట్టాభి కోరారు.

### రూ.350 కోట్ల లూటీ

ఓబులాపురం మైనింగ్ కంపెనీలో జరిగిన అక్రమ తవ్వకాలకు, ఈ బ్రాహ్మణి స్టీల్స్ భూముల కేటాయింపునకు విడదీయరాని సంబంధం ఉంది. ఆనాడు ఓబులాపురం మైనింగ్ కంపెనీలో తవ్వే ఐరన్ ఓర్(ఇనుప ఖనిజం)లో ఏకంగా 50శాతం.. అంటే సగం వాటాను జగన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, తాడేపల్లి ప్యాలెస్ గుమస్తాఅయిన సజ్జల రామకృష్ణారెడ్డి సోదరుడు సజ్జల దివాకర్‌రెడ్డికి చెందిన 'ఆర్‌ఆర్ గ్లోబల్', 'రెడ్ గోల్డ్ ఎంటర్ప్రైజెస్' కంపెనీలకి కట్టబెట్టారు. నాటి అధికారిక ఒప్పందం ప్రకారం.. అంటే ఓబులాపురం గనుల్లో



ప్రజా సొత్తును తవ్వేసి, దాన్లో సగానికి సగం వాటాను జగన్ రెడ్డి ఆత్మలైన సజ్జల బ్రదర్స్ బినామీ కంపెనీ రెడ్ గోల్డ్‌కు కారుచౌకగా అప్పగించడానికి డీల్ కుదుర్చుకున్నారు. ఈ రకమైన బినామీ అగ్రిమెంట్లు రాసిచ్చి, రూ.18,500లకే వేలాది ఎకరాలభూములను బ్రహ్మణి స్టీల్స్‌కు కట్టబెట్టినందుకు ప్రతిఫలంగా జగన్‌రెడ్డి నడిపే దిక్కుమాలిన అవినీతి పత్రిక 'సాక్షి'కి చెందిన జగతి పబ్లికేషన్స్ ఖాతాల్లోకి ఆర్‌ఆర్ గ్లోబల్ నుంచి నేరుగా రూ.44 కోట్లు వచ్చి పడ్డాయి. జగన్‌రెడ్డి బురద ఛానల్ 'సాక్షి' కి చెందిన ఇందిరా టెలివిజన్ ఖాతాల్లోకి అదే ఆర్‌ఆర్ గ్లోబల్ నుంచి మరో రూ.30కోట్లు చేరాయి. జగన్‌రెడ్డీ..ఆ 74కోట్ల రూపాయలు ఊరికేనే మీ అకౌంట్లలో వేసేశారా? ఓబులాపురం మైనింగ్ ఖనిజంలో సగం వాటాను మీ బినామీలకి కట్టబెట్టి, ఇటు పక్క 10,000 ఎకరాల భూమిని దోచిపెట్టినందుకు ఆర్‌ఆర్ గ్లోబల్‌సంస్థ మీ సాక్షిసంస్థల్లోకి గుమ్మరించిన లంచాలు కావా ఇవి? మీరేమో ప్రజల భూములను ఎకరానికి రూ.18,500చొప్పున, 10,400ఎకరాల భూమిని కేవలం రూ.20కోట్లకే బ్రాహ్మణి స్టీల్స్ యాజమాన్యా నికి రాసిస్తే.. ఆ ప్రభుత్వ భూమిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి ఏకంగా 350కోట్ల రూపాయల మేర భారీ రుణాన్ని బ్రాహ్మణి స్టీల్స్ యాజమాన్యం లాగేసింది. అంటే రూ.20కోట్ల విలువగా ప్రభుత్వం చూపించిన భూమిపై రూ.350కోట్లు లోన్ తీసుకుని.. అక్కడ ఒక్క ఇటుకరాయి పెట్టలేదు,ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. ఆ రూ.350 కోట్ల ప్రజా ధనాన్ని వివిధ మార్గాల్లో, షెల్ కంపెనీలు, సూట్‌కేస్ కంపెనీలద్వారా పక్కదారి పట్టించి, తిరిగి మీ బినామీల ద్వారా మీ జగతి పబ్లికేషన్స్, ఇందిరా టెలివిజన్ ఖాతాలకే మళ్ళించుకున్నారు. దీన్ని ఏమంటారో జగన్‌రెడ్డి చెప్పాలి. పెట్టుబడుల పేరుతో భూములు కేటాయించి, బ్యాంకుల నుంచి వందల కోట్లు దోచేసి, తిరిగి మీ జేబులు నింపుకునే పక్కా లూటీ దందా కాదా ఇది? ఈరోజు చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆభూములన్నింటినీ వెనక్కి తీసుకుని ప్రజా ఆస్తిగా మార్చింది. మిస్టర్ జగన్‌రెడ్డి.. ఇంతకంటే బహిరంగ సాక్ష్యం ఏం కావాలి మీ అవినీతికి? క్విడ్ ప్రో కో దోపిడీకి ఇంతకంటే సజీవసాక్ష్యం ఈ ప్రపంచంలోనే ఎక్కడైనా ఉంటుందా అని పట్టాభి ప్రశ్నించారు.

### ఒకే భవనం.. మూడు బినామీ కంపెనీలు

ఇక్కడ ఇంకో విషయం గురించి చెప్పాలి. జగన్ రెడ్డికి చెందిన అవినీతి పత్రిక సాక్షి మాతృ సంస్థ జగతి పబ్లికేషన్స్, ఆయన సూట్‌కేస్ కంపెనీలు 'రెడ్ గోల్డ్ ఎంటర్ప్రైజెస్','ఆర్‌ఆర్ గ్లోబల్ ఎంటర్ప్రైజెస్'... మూడూ హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 10లోని కృష్ణ సింధు రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్‌లోనే ఏర్పాటయ్యాయి. అదే అపార్ట్‌మెంట్స్‌లోని జీ–1లో జగతి పబ్లికేషన్స్, ఎఫ్–1లో 'రెడ్ గోల్డ్ ఎంటర్ప్రైజెస్', ఎస్–3లో 'ఆర్‌ఆర్ గ్లోబల్ ఎంటర్ప్రైజెస్' ఏర్పాటుకావటం కేవలం యాదృచ్ఛికమే అంటే నమ్మేయటానికి జనం అంతపిచ్చివాళ్లు కాదనే విషయాన్ని జగన్‌రెడ్డి,తాడేపల్లి ప్యాలెస్ గుమస్తా సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు సజ్జల దివాకర్‌రెడ్డి తెలుసుకోవాలి. కూడబలుక్కుని ఒక పథకం ప్రకారమే మూడు కంపెనీలను ఒకేచోట ఏర్పాటు చేసుకున్నారు.

బంజారాహిల్స్ కృష్ణసింధు రెసిడెన్సీలో జగన్‌రెడ్డి జగతి పబ్లికేషన్స్ పెడతాడు. అదే బిల్డింగ్‌లో సజ్జల బ్రదర్స్ పేరుతో రెడ్ గోల్డ్, ఆర్‌ఆర్ గ్లోబల్ సంస్థలను తెరుస్తారు. అదే చేత్తో.. ఓబులాపురం మైనింగ్ కంపెనీ గాలి జనార్దన్‌రెడ్డి బ్యాచ్‌తో అగ్రిమెంట్ రాసుకొని, ఆ గనుల్లో తవ్వే ఐరన్ ఓర్‌లో ఏకంగా 50శాతం వాటాను ఇదే బిల్డింగ్‌లోని 'రెడ్ గోల్డ్'కు కట్టబెడతారు. దానికి క్విడ్ ప్రో కో ప్రతిఫలంగా.. గాలి జనార్దన్ రెడ్డికి చెందిన బ్రాహ్మణి ఇండస్ట్రీస్ స్టీల్ ప్లాంట్ పేరుతో నాటి వైఎస్సార్ ప్రభుత్వం ద్వారా కడప జిల్లాలో వేలాది ఎకరాల ప్రజా భూమిని ఎకరం కేవలం రూ.18,500లకే దోచిపెడతారు. ఆ భూమిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి బ్రాహ్మణి యాజమాన్యం రూ.350 కోట్ల రుణం తెచ్చుకుంటుంది. ఆ డబ్బు షెల్ కంపెనీల ద్వారా తిరిగి ఇదే బిల్డింగ్‌లో ఉన్న 'ఆర్‌ఆర్ గ్లోబల్'లోకి వస్తుంది.. అక్కడి నుండి నేరుగా 'సాక్షి' జగతి పబ్లికేషన్స్‌లోకి రూ.44కోట్లు, ఇందిరా టెలివిజన్‌లోకి రూ.30కోట్లు లంచాల రూపంలో వస్తాయి. ఇదంతా ముందుగా వేసుకున్న పక్కా ప్లాన్ ప్రకారమే జరిగింది. అందుకే ఎలాంటి అధికారిక హెూదా లేకపోయినా జగన్‌రెడ్డి.. దగ్గరుండి మరీ బ్రాహ్మణి స్టీల్స్ ప్రాజెక్ట్‌కు శుంకుస్థాపన చేయించింది. అంతేకానీ స్టీల్ ప్లాంట్ వస్తే కడప జిల్లాలోని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని మాత్రం కాదు. ఇలా ఒకే అడ్రస్ వేదికగా, పెట్టుబడుల ముసుగులో వేలాది ఎకరాల భూములను బకాసురులకి కట్టబెట్టి, బ్యాంకుల సొమ్మును లూటీ చేసి, క్విడ్ ప్రో కో ద్వారా సొంత జేబులు నింపుకున్న జగన్ దొంగ చరిత్ర ఇవాళ నగ్నంగా సమాజంముందు నిలబడిందని పట్టాభి దుయ్యబట్టారు.

### కూటమి ప్రభుత్వంలో ఉద్యోగాల విప్లవం..

పెట్టుబడులు తీసుకురావడం అంటే ఏంటో, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం అంటే ఏంటో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాండ్, ఐటీ మంత్రి నారా లోకేష్ బ్రాండ్ చూసి జగన్‌రెడ్డి నేర్చుకోవాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఉపాధి విప్లవానికి సంబంధించిన గణాంకాలను ఆధారాలతో సహా పట్టాభి వివరించారు. గూగుల్ సంస్థకు కేవలం 480 ఎకరాలు కేటాయిస్తే.. ఏకంగా రూ.1,35,000 కోట్ల పెట్టుబడి, దాదాపు 1,80,000 మందికి ఉద్యోగాలు. టీసీఎస్ కి 21.16 ఎకరాల కేటాయింపునకు.. రూ.1,370కోట్ల పెట్టుబడి, 12,000 మందికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు. కాగ్నిజెంట్ 22.19 ఎకరాల కేటాయింపునకు.. రూ.1,582కోట్ల పెట్టుబడి, 8,000మందికి ఉపాధి. బీపీసీఎల్ ఏకంగా రూ.96,862కోట్ల భారీ మెగాప్రాజెక్ట్, కియా మోటార్స్‌కు గతంలో టీడీపీ హయాంలో 536ఎకరాలు ఇస్తే.. ఈ రోజు 11,000 మందికి పైగా ఉద్యోగాలతో అనంతపురంజిల్లా రూపురేఖలే మారిపోయాయి. మేము ఎన్నికల్లో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోవడానికి ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి నారా లోకేష్ ఐదు రోజులుగా నిద్రాహారాలు మాని సౌత్ కొరియాలో పర్యటిస్తున్నారని పట్టాభిరామ్ తెలిపారు. అక్కడ డజన్ల కొద్దీ కంపెనీలతో సమావేశాలు జరుపుతూ పెట్టుబడులు తీసుకొస్తుంటే.. జగన్‌రెడ్డి మాత్రం లూటీ చేసిన కంపెనీల రక్షణ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడని మండిపడ్డారు. 2022లో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి సంబంధించిన అక్రమాలు, లూటీ మొత్తం బట్టబయలైన తరుణంలో.. నాడు ముఖ్యమంత్రిగాఉన్న జగన్‌రెడ్డి ఆగస్టు 2022లో సుప్రీం కోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేస్తూ.. ఓబులాపురం గనుల్లో తిరిగి మైనింగ్ చేయడానికి తమ ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని నిస్సిగ్గుగా కోర్టు ముందు అంగీకరించాడు. నీ బినామీలకు, సజ్జల బ్రదర్స్ కంపెనీలకు ఆ ఇనుప ఖనిజంలో 50% వాటా దక్కడం కోసమే కదా ఈ బరితెగింపు? గత ప్రభుత్వ అక్రమాలకు భిన్నంగా ఈరోజు ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి వల్ల..

- (మిగతా వివరాలు 13లో)

# దేశద్రోహులకు జగన్ మద్దతా?

- రాజ్యాంగం, చట్టాల్ని అపహాస్యం చేస్తూ ప్రశ్న రావణ్‌కు అండగా నిలుస్తారా
- విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజం
- రాష్ట్రంలో శాంతి, భద్రతలు భేషుగ్గా ఉన్నాయి
- సమాజంలో విద్వేషాలు సృష్టించేలా వైసీపీ నేతల వైఖరి
- స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకు పోవడం ఖాయం

అమరావతి (చైతన్యరథం): దేశద్రోహానికి పాల్పడిన ప్రశ్న రావణ్‌ను ఏ విధంగా మద్దతు ఇస్తున్నారో జగన్ రెడ్డి చెప్పాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆయన బృందం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, సమాజ విద్రోహ విధానాలపై విజయనగరం ఎంపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియాసమావేశంలో ఆయనమాట్లాడుతూ..వైఎస్సార్‌సీపీ నాయకత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.దేశద్రోహానికి పాల్పడిన, సమాజంలో అలజడులు సృష్టిస్తున్న 'రావణ్' అనే వ్యక్తికి జగన్మోహన్‌రెడ్డి ఏరకంగా మద్దతు తెలుపుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని కలిశెట్టి డిమాండ్ చేశారు. ఈరోజు వైఎస్సార్‌సీపీకి చెందిన కృత్రిమమేధావి సుధాకర్‌రెడ్డి, దేశద్రోహ శక్తుల తరపున కోర్టుల్లోనూ, బయటా ఏవిధంగా వాదనలు వినిపిస్తున్నారో ప్రజలంతా గమనిస్తున్నారు. చట్టం అన్నా, రాజ్యాంగం అన్నా, హిందూ దేవతలన్నా కనీసం గౌరవం లేకుండా మాట్లాడే వ్యక్తిని వైఎస్సార్‌సీపీ వెనకేసుకురావడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో జగన్మోహన్‌రెడ్డి బహిరంగపరచాలి.సమాజంలో శాంతి భద్రతలను కాపాడే పోలీస్ వ్యవస్థపట్ల, మహిళల పట్ల, గౌరవప్రదమైన వ్యక్తులపట్ల కొందరు సామాజిక మాధ్యమాల్లోనూ, బయటా తప్పుడు ప్రచారాలు చేస్తుంటే... వారికి వైఎస్సార్‌సీపీ అండగా నిలవడం అత్యంత దారుణమని ఎంపీ మండిపడ్డారు. సమాజానికి ఒక తప్పుడు సంకేతాన్ని ఇచ్చేలా జగన్ టీమ్ వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంపై గౌరవం లేకుండా మాట్లాడేవారిని సమర్థించడం వైఎస్సార్‌సీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. గత కొంత కాలంగా వైఎస్సార్‌సీపీ నాయకులు సమాజాన్ని, ప్రజలను, ప్రజా ప్రభుత్వాలను హేళనచేస్తూ మాట్లాడుతున్నారు. కులాలు, ప్రాంతాల మధ్య లేనిపోని విభేదాలు సృష్టించి, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా మాట్లాడే తీరును వైఎస్సార్‌సీపీ సమర్థిస్తోంది. ఈ సమాజాన్ని కలిపే మాటలు మాట్లా డాల్సింది పోయి, మనుషులను విడగొట్టేలా వ్యవహరి స్తున్న వైఎస్సార్‌సీపీ తీరు చూసి సభ్య సమాజం నవ్వుకుంటోంది, తలదించుకుంటోందని కలిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు.

### రాక్షసుల మాదిరిగా..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కూటమిప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి నిందలు వేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల్లో ఏమాత్రం బలం లేని వైఎస్సార్‌సీపీ, కేవలం సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తోందని ఎంపీ ధ్వజమెత్తారు. జగన్మోహన్‌రెడ్డి నెలనెలా ముడుపులు (జీతాలు) ఇస్తూ కొంతమందిని సోషల్ మీడియా యాక్టివిస్టుల పేరుతో సంఘ విద్రోహ శక్తులుగా తయారు చేశారు. వీరు సమాజానికి హాని చేస్తూ, ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయికి రావడం సిగ్గుచేటు. పూర్వం పవిత్రమైన యజ్ఞాలను భగ్నం చేయడానికి రాక్షసులు ఎలాగైతే ప్రయత్నించేవారో... ఈరోజు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం చేస్తున్న 'అభివృద్ధి యజ్ఞాన్ని' భగ్నం చేయడానికి ఈ సోషల్ మీడియా రాక్షసులు ఆ రకంగానే తయారయ్యారు. జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలన్నీ ప్యాలెస్‌లకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. "జగన్ ఎప్పుడూ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఏరకంగా విధ్వంసం చేయాలా అని పథకాలు వేస్తుంటారు. అక్కడ వారం, పది రోజులు కుట్రలు పన్ని, ఆ తర్వాత తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి ప్రెస్ మీట్లు పెడతారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు లేపడమే ఆయన పని. జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి వచ్చి ప్రెస్ మీట్ పెట్టారంటే చాలు... రాష్ట్రంలో ఏదో ఒక అలజడి సృష్టించడానికి ఆయన సోషల్ మీడియా ముఠాలు రంగంలోకి దిగుతాయని దుయ్యబట్టారు.

### ప్రజలు అన్నీ గమనిస్తున్నారు..

గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనే సంఘ విద్రోహ శక్తులను అణచివేసి, లా అండ్ ఆర్డర్ (శాంతిభద్రతలను) అదుపులో ఉంచిన సమర్థుడైన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుకి గొప్ప పేరుందని ఎంపీ గుర్తుచేశారు. జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన మళ్లీ రాకూడదనే ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మాండమైన మెజార్టీ ఇచ్చి గెలిపించారని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో జాగ్రత్తగా పరిపాలిస్తూ, సమర్థులైన పోలీస్ ఆఫీసర్లను నియమించి శాంతిభద్రతలను కాపాడుతుంటే... ఉద్దేశపూర్వకంగా పోలీస్ వ్యవస్థపై, అధికారులపై వైఎస్సార్‌సీపీ నిందలు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కలిశెట్టి పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, బురదజల్లే రాజకీయాలు చేసే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తాను ముఖ్యమంత్రి పదవికోల్పోయాననే నిజాన్ని జగన్మోహన్ రెడ్డి మర్చిపోయినట్టు ఉన్నారని, ఆయన ఇప్పుడు కేవలం 'మాజీ ముఖ్యమంత్రి' మాత్రమేనని కలిశెట్టి ఎద్దేవాచేశారు. భవిష్యత్తులో కూడా వైఎస్సార్‌సీపీకి ప్రజలు అధికారం ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.



### నేరస్థులకు జగన్ మద్దతు

జగన్మోహన్‌రెడ్డి తన వ్యవహారశైలిని మార్చుకోవడం లేదు. పోలీస్ ఆఫీసర్లకు ఫోన్లు చేసి బెదిరించే స్థాయికి దిగజారారు. ప్రెస్‌మీట్లు పెట్టి మరీ సీఐ,ఎస్ఐ, డీఎస్పీ, ఎస్పీల పేర్లు ప్రస్తావిస్తూ, విధినిర్వహణలో ఉన్న పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడుతున్నారు. ఇలాంటి బెదిరింపులకు కూటమి ప్రభుత్వం భయపడదు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు దేశంలోనే నెంబర్ వన్ పొజిషన్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. "ఈ మాట నేనో,కూటమి ప్రతినిధో చెబుతున్నది కాదు. సాక్షాత్తు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్వయంగా సమీక్షా సమావేశాల్లో చెప్పారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో భారత దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేరబోతుందని దేశాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన మోదీ చెబుతుంటే... జగన్ అండ్ టీమ్ మాత్రం ఇక్కడ శాంతిభద్రతలు లేవంటూ బురదజల్లుతోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపైన,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పైన, బిజెపి నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకుల పైన వైఎస్సార్‌సీపీ చేస్తున్న అడ్డగోలు ఆరోపణలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఎంపీ అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడు బయటకు వచ్చినా, ఎవరిని పరామర్శిస్తున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. సమాజానికి కీడు చేసే శక్తులను, దేశద్రోహులను, నేరస్థులను మాత్రమే జగన్ పరామర్శిస్తూ సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సోషల్ మీడియాలో తప్పుడు కూతలు కూయించి, అబద్ధాలు ప్రచారం చేస్తే పార్టీ బలం పెరుగుతుందని అనుకోవడం జగన్ అమాయకత్వమే అవుతుందని ఎద్దేవా చేశారు. ఈ కూటమి ప్రభుత్వం ఐదు కోట్ల ఆంధ్రుల మనోభావాలకు ప్రతిరూపంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తోంది.జగన్మోహన్‌రెడ్డిని స్పష్టంగా హెచ్చరిస్తున్నాం... మీరు ఏ వేదికపై మాట్లాడినా, ఏ కార్యక్రమం చేసినా సమాజానికి ఇబ్బంది కలిగించేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉంటే మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుంది. చట్టవిరుద్ధ పనులను చూస్తూ ఈ ప్రభుత్వం ఊరుకోదని కలిశెట్టి హెచ్చరించారు.

### ఆ 11 సీట్లు కూడా ఉండవు..

ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశ విదేశాల్లో ఉన్న తెలుగువారంతా కోరుకున్న చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పినట్లు భవిష్యత్తులో మరో 15 ఏళ్ల పాటు ఈ ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబునాయుడుని, వారి కుటుంబాన్ని, ఎన్డీఏ కూటమి నాయకులను ఇష్టమొచ్చినట్లు విమర్శించిన వారికి మొన్నటి ఎన్నికల్లో ప్రజలు గట్టి బుద్ధి చెప్పి పక్కన పెట్టారు. ఈ మధ్య కాలంలో మళ్లీ ఒకరిద్దరు వచ్చి పిచ్చిప్రేలాపనలు చేస్తున్నారు.అలాంటి వారికి ఆయా ప్రాంతాల ప్రజలు త్వరలోనే తగిన బుద్ధి చెబుతారు. ప్రస్తుతం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ప్రధాని మోదీ కలిసి రాష్ట్ర ప్రగతి కోసం ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న పనుల వల్ల వైఎస్సార్‌సీపీలో మిగిలిన ఆ కొద్దిమంది నాయకులు, కార్యకర్తలు కూడా తలలు పట్టుకుంటున్నారని కలిశెట్టి ఎద్దేవా చేశారు. అమరావతిని కాదని జగన్‌చేసిన పనులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సంఘ విద్రోహ శక్తులకు ఆయన ఇస్తున్న మద్దతు చూసి వారి పార్టీ నాయకులే బాధపడుతున్నారు. జగన్ ఇప్పటికైనా కనీస ధర్మం పాటించాలి.ఒక మాజీ ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి తప్ప... వ్యవస్థలపై, పోలీసులపై నిందలు వేయడం ఆపాలి. లేకపోతే అసలే 11సీట్లకు పడిపోయిన మీ పార్టీ ఉనికి భవిష్యత్తులో పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డికి ప్రజా సమస్యల కన్నా సొంత సుఖాలు, అధికార దాహమే ఎక్కువని ఎంపీ దుయ్యబట్టారు. ప్రజలు మీకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. కనీసం పులివెందుల ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే... అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించే బాధ్యత లేదు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం ప్రజలను రెచ్చగొట్టడం, విధ్వంసం సృష్టించడం మాత్రమే ఆయనకు తెలుసని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని, దేవతలను విమర్శించే 'రావణ్' లాంటి వ్యక్తులకు మద్దతు ఇస్తున్న జగన్మోహన్ రెడ్డి బుద్ధిని ప్రజలు గమనిస్తున్నారని కలిశెట్టి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ సమాజానికి కీడు చేసే శక్తులకే అండగా నిలుస్తుందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమికి పూర్తి మద్దతు ఇచ్చి, వైఎస్సార్‌సీపీని జీరో చేయడం ద్వారా జగన్మోహన్ రెడ్డి నోరు మూయించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ స్పష్టం చేశారు.

---

## నాడు పరిశ్రమల ముసుగులో జగన్ లూటీ...
# నేడు పెట్టుబడుల రాకతో ఉపాధి విప్లవం

(12వ పేజీ తరువాయి)

బ్రాహ్మణి ఇండస్ట్రీస్ పేరుతో లూటీ అయిన ఆ 14,000 ఎకరాల భూమిని న్యాయస్థానంలో చట్టపరంగా పోరాడి, కలెక్టర్ ఆదేశాల ద్వారా తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. భూ బకాసురుల నుంచి ఆ వేలాది ఎకరాల భూమికి విముక్తి కల్పించి, మళ్ళీ దానిని ప్రజా ఆస్తిగా మార్చిన ఘనత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానిదేనని ఆయన కొనియాడారు.

### చంద్రబాబు, లోకేష్‌లను చూసి నేర్చుకో

కడప జిల్లా నా కంచుకోట, నేను కడప జిల్లా ముద్దుబిడ్డని అని బిల్డప్ ఇచ్చే జగన్ రెడ్డికి సొంత జిల్లా ప్రజలనే మోసం చేసి 14,000 ఎకరాల భూమిని దోచిపెట్టడానికి సిగ్గు అనిపించలేదా అని పట్టాభిరామ్ నిలదీశారు. పుట్టిన గడ్డను, సొంత నియోజకవర్గాన్ని ఏ రకంగా అభివృద్ధి చేయాలో మొన్ననే మూడు రోజులు కుప్పంలో పర్యటించి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. అలాగే మంగళగిరి నియోజకవర్గాన్ని ఏ రకంగా అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతున్నారో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ని చూసి నేర్చుకోవాలన్నారు. నువ్వు మాత్రం సొంత జిల్లా ప్రజల పొట్టగొట్టి, పెట్టుబడుల పేరుతో దోపిడీ చేసి ఇంకా నకిలీ టైటిల్స్ తగిలించుకుంటావా అని జగన్ రెడ్డిని ఉద్దేశించి మండిపడ్డారు. గత ప్రభుత్వ అవినీతికి, నేటి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించారు కాబట్టే జగన్ అవినీతి సామ్రాజ్యం కూలిపోయిందని స్పష్టం చేశారు. అందుకే ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా ముక్తకంఠంతో ఒకే నినాదం అందుకున్నారు.. అదే 'గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్.. ఎన్డీఏ కూటమి ఎగైన్ అండ్ ఎగైన్'. కూటమి ప్రభుత్వంలో మొదలైన ఈ ఉపాధి విప్లవం నిరంతరాయంగా కొనసాగుతుంది. జగన్ రెడ్డి దోపిడీ లెక్కలన్నీ తేల్చే సమయం ఆసన్నమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో, పారదర్శక విధానాలతో దేశ విదేశీ సంస్థలను ఆకర్షిస్తూ లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఒకవైపు పెట్టుబడుల పేరుతో వేలాది ఎకరాల ప్రజా భూములను లూటీ చేసి సొంత జేబులు నింపుకున్న జగన్ రెడ్డి మార్క్ అవినీతి పాలన.. మరోవైపు కేటాయించిన ప్రతి ఎకరం భూమికి వేలాది కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తున్న చంద్రబాబు నాయుడు మార్క్ అభివృద్ధి పాలన.. ఈ ఇద్దరు వ్యక్తులకు, ఈ రెండు ప్రభుత్వాల ఆలోచనా విధానాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రజలందరూ ఒక్కసారి గమనించాలని కోరారు. నాటి అవినీతి 'బూటకపు' శంకుస్థాపనలకు, నేటి 'నిజమైన' ఉపాధి విప్లవానికి ఉన్న తేడాను ప్రజలే నిర్ణయిస్తారని పట్టాభిరామ్ స్పష్టం చేశారు.

---

## రెండేళ్లలో రెట్టింపు సంక్షేమం.. ఇంటింటా సంతోషం

(11వ పేజీ తరువాయి)

రైతుల పాదాల చెంత పెట్టబోతోంది. గత ప్రభుత్వంలో ఆడబిడ్డలను టికెట్ కొనుక్కుని వెళ్లమన్నారు, పైసా సాయం చేయలేదు. కానీ మా కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో మహిళల ఉచిత ప్రయాణం కోసమే రూ. 8,000కోట్లు భరించబోతోంది. గత ప్రభుత్వం ఇష్టమొచ్చినట్టు కరెంట్ చార్జీలు పెంచితే ట్రూ అప్ చేస్తే... మేము దాన్ని తగ్గించి ట్రూ డౌన్ చేసి ఇప్పటికే రూ. 7,000కోట్లు ఖర్చు పెట్టి ప్రజలపై భారం పడకుండాకాపాడాం. మా ఆర్థిక సిద్ధాంతం చాలా స్పష్టం. సంక్షేమం అనేది జగన్‌రెడ్డి అనుకున్నట్టు భారంకాదు... అదొక ఆర్థిక పెట్టుబడి. మేము విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, బడుల మౌలిక సదుపాయాలు, అంగన్‌వాడీల పోషకాహారం, పేదల గృహనిర్మాణంపై పెడుతున్న ఖర్చు భవిష్యత్తు తరాల కోసం నిర్మిస్తున్న మానవ వనరుల అభివృద్ధి. రేపు ఈ విద్యావంతులైన, ఆరోగ్యవంతులైన విద్యార్థులే రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి ప్రధాన కారకులుగా మారి, ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల నుంచి బయటపడేసి అద్భుతమైన ఆర్థిక వ్యవస్థ వైపు నడిపిస్తారు. రాష్ట్ర సొంత వార్షిక ఆదాయంలో 23 శాతం నిధులను సంక్షేమానికి ఖర్చు పెడుతున్నాం. మరోవైపు జగన్ రెడ్డి వదిలివెళ్లిన పాపాల అప్పుల కోసం 25 శాతం ఆదాయాన్ని అసలు, వడ్డీలకు కడుతున్నాం. ఈ విషయంలో చర్చకు మేము సిద్ధం. మా నందమూరి బాలయ్య బాబు ఏదో సినిమాలో చెప్పినట్లుగా 'ప్లేస్ ఎక్కడైనా... టైమ్ ఏదైనా... స్టేషన్ ఏదైనా... ఐ యామ్ రెడీ! మేము చెప్పిన ఈ 12 పథకాల అంకెలపై, పెన్షన్లపై, అన్నదాత సుఖీభవపై, ఫ్రీ బస్సులపై, విద్యుత్ రాయితీలపై జగన్ కానీ, వైసీపీలో ఎవరైనా కానీ సవాల్ చేసే దమ్ముంటే చర్చకు రండి. ఇది కేవలం ప్రారంభం మాత్రమే... రేపటి నుంచి మా కూటమి నేతలు బీసీలకి ఎంతిచ్చాం, ఎస్సీలకి ఎంతిచ్చాం, మైనారిటీలకి, పాస్టర్లకి, అర్చకులకి ఎంతిచ్చామో లెక్కలతో సహా వివరిస్తారు. చర్చ కోసం తాము ఎప్పుడూ సిద్ధంగానే ఉంటామని విజయ్ కుమార్ స్పష్టం చేశారు.



విజయనగరం పట్టణం 44వ డివిజన్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు మత్స భవాని, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, గౌరీ రమణితోపాటు సుమారు 150 కుటుంబాల వారు శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు సమక్షంలో పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాతో పార్టీ లోకి ఆహ్వానించారు.

# క్రీడలతోనే మానసికోల్లాసం

## గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు వెల్లడి



గన్నవరం (చైతన్యరథం): క్రీడలు యువతలో మానసిక ఉల్లాసాన్ని నింపడమే కాకుండా క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండలం నున్నలోని ఇషు క్రికెట్ కార్నర్‌లో నిర్వహించిన డాన్ సూపర్ కింగ్స్ 10 ఓవర్ల క్రికెట్ టోర్నమెంట్ గ్రాండ్ ఫైనల్స్ ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉదయ్ సీసీ, ఎస్ఎస్ సీసీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం స్వయంగా బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. టాస్ గెలిచిన ఉదయ్ సీసీ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్ సీసీ 36 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉదయ్ సీసీ 5.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది.

ఎస్ఎస్ సీసీ రన్నరప్‌గా నిలిచింది. విజేత, రన్నరప్ జట్లకు ఎమ్మెల్యే యార్లగడ్డ ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు.

గెలుపు, ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. టోర్నమెంట్‌లో వెంకటేష్ ఉత్తమ బౌలర్‌గా, శ్రీను ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా ఎంపికై ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చకండి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రభుత్వ ఉద్దేశం, లక్ష్యాలను కొందరు ప్రభుత్వాధికారులు, సిబ్బంది నీరుగారుస్తున్నారని, లేని నిబంధనల పేరిట ప్రజల్లో భయాందోళన రేకెత్తిస్తున్నారని, వారిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ప్రజలందించిన అర్జీలను పరిశీలించిన ప్రత్తిపాటి సంబంధిత అధికారులతో మాట్లాడి, అర్జీదారులను ఇబ్బంది పెట్టకుండా సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు, కొందరు రైతులు తమ భూముల్లో బోర్లు వేసుకోవడానికి అధికారులు ఎన్.వో.సీలు అడుగుతున్నారని, అలానే తమకు ఇంకా పీఎంకిసాన్ నిధులు జమకాలేదన్న మరికొందరు రైతుల సమస్యలపై ప్రత్తిపాటి, పల్నాడు కలెక్టర్ తో మాట్లాడారు. ఆమె నుంచి రైతులకు స్పష్టమైన భరోసా ఇప్పించిన ప్రత్తిపాటి.. సమస్య పరిష్కరించే బాధ్యత తనదని వారికి ధైర్యం చెప్పారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోర్లు వేసుకోవడానికి ఎలాంటి ఎన్.వో.సీలు అక్కర్లేదు. అధికారులు లేనిపోని నిబంధనలతో రైతుల్ని భయాందోళనకు గురి చేయడం సరికాదన్నారు. రైతులు తమ భూముల్లో కొత్తగా బోరు వేయించుకోవాలంటే తహసీల్దార్, లేదా భూగర్భ జలవనరుల విభాగం తరుపున ఎన్.వో.సీ ఇవ్వాలని కొందరు అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని, ఓల్టా చట్టం ప్రకారం భూగర్భ జలాలున్న చోట బోర్లు వేసేలా చూడాలనే నిబంధన ఉందిగానీ, ఇంకెలాంటి అభ్యంతరాలు లేవని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. కొందరు రైతులు ఈ విధంగా ఎన్.వో.సీ అడుగుతున్నారని, తన దృష్టికి తీసుకొచ్చారని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఈ విధమైన భయాందోళనలు రేకెత్తించవద్దని వారికి సూచిస్తున్నామన్నారు. ఈ విధంగా ఎలాంటి ఎన్.వో.సీ నిబంధనలు లేవని కలెక్టర్ కూడా స్పష్టంగా చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. పీఎం కిసాన్ నిధులు అందలేదన్న రైతుల ఫిర్యాదుని పరిష్కరిస్తామని కలెక్టర్ చెప్పారు.. పీఎం కిసాన్ యోజన-అన్నదాతా సుఖీభవ పథకంలో భాగంగా ఇటీవల విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ సాయం తమకు అందలేదని కొందరురైతులు ఫిర్యాదు చేశారని, సమస్యను వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే 22 సార్లు పీఎం కిసాన్ సాయం పొందిన రైతులకు, 23వ సారి అందకపోవడంపై విచారణ చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. 2019 ఆగస్ట్ కు ముందు ఉన్న అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పీఎం కిసాన్ యోజన సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు.

## సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు మూడు వేల నోట్‌బుక్స్ పంపిణీ

## ఎంపీ సానా సతీష్ బాబు పిలుపుకు విశేష స్పందన

కాకినాడ (చైతన్యరథం): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఇటీవల నగరానికి వచ్చిన సందర్భంగా, తనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల బొకేలు తీసుకురావడం కంటే, పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్ తీసుకురావాలని చేసిన పిలుపుకు విశేష స్పందన లభించింది. ఆ సందర్భంగా అందిన దాదాపు 3000 నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్స్‌ను మరియు ఎగ్జామ్స్ ప్యాడ్స్ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు నగరంలోని ప్రజావిద్యాలయం, ఎంపీపీఎస్ ప్రైమరీ మోడల్ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, పూల బొకేలు కొన్ని క్షణాల ఆనందాన్ని ఇస్తే, ఒక నోట్‌బుక్ విద్యార్థి భవిష్యత్తుకు పునాది వేస్తుందనే ఆలోచనతో ఎంపీ శ్రీ సానా సతీష్ బాబు గారు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు, నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత సేవ కావడమే సానా సతీష్ బాబు ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ తలాటం హరీష్ ఎంపీ కార్యాలయ ఇంఛార్జ్ మేకా లక్షణమూర్తి, ఆనంద్ న్యూటన్ , ఫౌండేషన్ సభ్యులు ముమ్మిడి వెంకటేశ్వర రావు, ఎంపీ వ్యక్తిగత సహాయకులు (పీఏ) గౌరీశంకర్‌లి, తదితరులు పాల్గొన్నారు.






# ఎస్సైఆర్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట (చైతన్యరథం): ఎస్సైఆర్‌పై వైసీపీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని, బీఎల్ ఏలు ఇంటింటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫామ్ లు అందించి, ఓటర్లు అందించిన సమాచారాన్ని బీఎల్‌ఓలకు అందిస్తే, ఆ వివరాలను పున:పరిశీలించి డిజిటలైజ్ చేస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తమ పార్టీల బీఎల్‌ఏలు ఓటర్ల సమాచారం సేకరించి, పూర్తిగా డిజిటలైజ్ చేస్తుంటే వైసీపీ దుష్ప్రచారం చేయడం ఏమిటని ప్రత్తిపాటి ప్రశ్నించారు. నిజంగా అర్హుల ఓట్లు తొలగిస్తే, ఆ పార్టీనేతలు ఆధారాలతో సహా ఈసీకి ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, గట్టినేని రమేష్, పిల్లి కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, బీజేపీ నాయకులు గట్టా హేమ, సి.వి.ఏ.పి యూనిట్ సయ్యద్ మహమ్మద్ అలీ, టీడీపీ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

**●ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ధర్మరాజు**



ఉంగుటూరు (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏలూరు జిల్లా ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఉంగుటూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జనవాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాలు, ఇంటి రుణాలు, పింఛన్లు, తాగునీటి సమస్యలపై ఎక్కువ వినతులు వచ్చాయన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

నియోజకవర్గంలో 27 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10,37,701 విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,030 మందికి రూ.7,29,16,393 మేర లబ్ధి చేకూరిందని వెల్లడించారు.

## ప్రజాదర్బార్ ద్వారా ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం

**●అధికారం అలంకారం కాదు... ప్రజాసేవే మా బాధ్యత : ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు**



విజయవాడ (చైతన్యరథం): ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం విజయవాడలోని తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా స్వీకరించి, సంబంధిత శాఖలతో అనుసంధానం చేసి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించిన ప్రజాకేంద్రిత పాలనను అనుసరిస్తూ, ప్రతి సమస్యను ఒక నిర్దిష్ట విధానంలో పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల ప్రారంభించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి కూడా ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా దాదాపు 100కు పైగా ఫిర్యాదులు, విజ్ఞప్తులు తన దృష్టికి వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపించి పరిష్కార ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి, ఫోన్ ద్వారా లేదా ఇతర మాధ్యమాల ద్వారా తమ సమస్యలను ఎప్పుడైనా తెలియజేయవచ్చని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నానని బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మాకు అధికారం అనేది అలంకారం కాదు... ప్రజలకు సేవ చేసే బాధ్యత. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం. ఆ బాధ్యతను నిబద్ధతతో, పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వర్తిస్తూనే ఉంటాం అని స్పష్టం చేశారు.

## దానియేలు సేవలు చిరస్మరణీయం: గద్దె క్రాంతి కుమార్

విజయవాడ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం దానియేలు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రాణిగారితోట సెంటర్ లో టీడీపీ నాయకులు ఇస్లం దానియేలు 3వ వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ పాల్గొని దానియేలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫ్రూట్స్ పంపిణీ చేశారు. తొలత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాణిగారితోట పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చే వ్యక్తి దానియేలేనని, ప్రజలతో ఆయనకు ఉన్న ఆత్మీయ అనుబంధం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌కు తలలో నాలుకలాంటి వ్యక్తిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల నిర్వహణలో ఎల్లప్పుడూ అండగా నిలిచిన నాయకులు దానియేలు అని కొనియాడారు.

## కొవ్వూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అర్హులైన వారికి హెల్త్ పెన్షన్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన చోట్ల సీసీ రోడ్లు నిర్మించాలని, అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ప్రజలు 23 వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ప్రతి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కేడర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## విజయనగరం టీడీపీలోకి భారీగా చేరికలు... ఆహ్వానించిన ఎమ్మెల్యే అదితి



అయ్యన్నపేట: జిల్లాలో చాలా మంది వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని అయ్యన్నపేట 44 డివిజన్కు చెందిన 150 కుటుంబాలు శుక్రవారం వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించించారు. ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీలో కష్టపడి పని చేసినవారికి ఎల్లప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ : తమ్మినేని గీతా విద్యాసాగర్



ఆమదాలవలస (చైతన్యరథం): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఆమదాలవలస మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం ఆమదాలవలసలో స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహించి, నియోజకవర్గ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంపత్ రావు, మురళీధర్, పీ.వి. కె రాజు, తమ్మినేని శ్రీను, మురళి తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత : ఎమ్మెల్యే తోయక



గుమ్మలక్ష్మీపురం (చైతన్యరథం): ప్రజా దర్బార్లో వచ్చిన ప్రతి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలు వచ్చి వినతులు అందించారు. ప్రధానంగా రహదారులు తాగు, సాగునీరు, పింఛన్లు, నూతన ఇల్లు మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండల కన్వీనర్ నరేష్, కొప్పల వెలమ డైరెక్టర్ అక్కెన మధుసూదన్ రావు, నాయకులు రాంబాబు, రాజేష్ పాల్గొన్నారు.

## రేషన్ మాఫియాపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి మరోసారి ఉక్కుపాదం

**●100కు పైగా రేషన్ బస్తాల అక్రమ రవాణాను నేరుగా అడ్డుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ మాఫియా పై ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి మరోసారి ఉక్కుపాదం మోపారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు. గతంలో నల్లచెరువు, నల్లకుంట ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను స్వయంగా అడ్డుకొని కేసులు నమోదు చేయించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, అనంతరం పోలీసు మరియు పౌరసరఫరాల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతి రేషన్ దుకాణంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి రేషన్ షాప్ నంబర్--150 పరిధిలోని రామనామ క్షేత్రం వద్ద భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్నట్లు 18 డివిజన్ టీడీపీ అధ్యక్షులు ఉల్లి గోపాల్ కృష్ణ గుర్తించి ఎమ్మెల్యే గళ్ళా మాధవికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఎమ్మెల్యే గళ్ళా మాధవి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి రాకను గుర్తించిన అక్రమార్కులు పారిపోగా, వాహన డ్రైవర్ చిక్కారు. అప్పటికే అక్కడ 100కు పైగా బస్తాల రేషన్ బియ్యాన్ని వాహనంలో లోడ్ చేసి తరలించేందుకు సిద్ధంగా ఉంచినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తించి,అడ్డుకున్నారు. అనంతరం లాలాపేట పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేరాల్సిన బియ్యాన్ని దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులతో సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు తావులేదని, అక్రమ రవాణా, నిల్వలు, దుర్వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

## ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ లేదు : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**●చింతలపాడులో ప్రజాదర్బార్... సమస్యల పరిష్కారానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**



నందిగామ (చైతన్యరథం): చింతలపాడు గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించిన ఆమె సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పౌరుడికి పారదర్శకంగా, జవాబుదారీతనంతో పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి వద్దకే పాలనను తీసుకెళ్లే ఉద్దేశంతో ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి వినతిని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య శుక్రవారం తన కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి విన్నవించుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ఎమ్మెల్యే పరిశీలించి, సంబంధిత సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే సంబంధిత అధికారులకు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఎమ్మెల్యే... ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొడాలి నాని త్వరలోనే జైల్లో ఉప్మా, ఇడ్లీ రుచి చూసే పరిస్థితి : కనపర్తి



అవనిగడ్డ (చైతన్యరథం): మాజీ మంత్రి కొడాలి నాని త్వరలోనే జైల్లో ఉప్మా, ఇడ్లీ రుచి చూసే పరిస్థితి దగ్గరలోనే ఉందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డలో నిర్వహించిన ప్రెస్మీట్లో ఆయన మాట్లాడారు. బచ్చులకూర జోసెఫ్ అనే వ్యక్తి 'ప్రశ్న రావణ్ అనే పేరుతో కులాలను, మతాలను రెచ్చగొట్టేలా మాట్లాడటమే కాకుండా, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో చూస్తూ ఊరుకోబోమన్నారు. అధికారం మారిన తర్వాత జైలుకు వెళ్లాల్సి వస్తుందనే భయంతో, ప్రాణభయంతో రెండేళ్లు హైదరాబాద్‌లో దాక్కున్న కొడాలి నాని, ఇప్పుడు వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో కొడాలి నాని హిందూ దేవతా విగ్రహాలను పగలగొట్టినప్పుడు కూడా చాలా చులకనగా, అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. ప్రశ్న రావణ్ లాంటి వాళ్లని సమర్థిస్తూ మాట్లాడుతున్న కొడాలి నానితో సహా అలాంటి వారిని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాల్సిన అవసరం ఉందన్నారు.

## కూటమి ప్రభుత్వంలో నేరుగా ఎమ్మెల్యే వద్దకే పరిష్కారం

**●ప్రజా గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్**



పెనమలూరు (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు విలువ లేకుండా అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పిన దుస్థితికి కూటమి ప్రభుత్వం ముగింపు పలికిందని, ఇప్పుడు ప్రజల సమస్యలకు నేరుగా ప్రజాప్రతినిధుల వద్దే పరిష్కారం లభించే పారదర్శక పాలన కొనసాగుతోందని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా పోరంకిలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు రెవెన్యూ, పెన్షన్లు, గృహాలు, తాగునీరు,రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజా సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, రాజకీయ కక్ష సాధింపులకే ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించారని విమర్శించారు. ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయాలు వైసీపీ నాయకుల రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయని, ఫలితంగా అభివృద్ధి కుంటుపడి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందన్నారు,ప్రజలే కేంద్రబిందువుగా పాలన సాగుతోందని, సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం కేవలం వినతులు స్వీకరించే కార్యక్రమం కాదని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపించే బాధ్యతాయుతమైన ప్రజా వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు.

అనంతరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కమిటీల పనితీరు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం, ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల చేరవేత, ప్రజా సమస్యలపై నిరంతర పర్యవేక్షణ, రాబోయే పార్టీ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ వంటి అంశాలపై ఎమ్మెల్యే సమగ్ర దిశానిర్దేశం చేశారు.

## యార్లగడ్డ ఆదేశాల మేరకు వాటర్ ట్యాంకుల క్లీనింగ్

**● గ్రామాల్లో సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం**

**: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల వాటర్ ట్యాంకులను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. గన్నవరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గల సురక్షిత తాగు నీటి పథకాల వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయా గ్రామ పంచాయతీల అధికారులు నీటి ట్యాంకులను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని వాటర్ ట్యాంకును గురువారం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. గన్నవరం మండలం అల్లాపురం గ్రామంలోని పంచాయతీ ద్వారా తాగునీటిని సరఫరా చేసే వాలు వద్ద మురుగునీరు పేరుకుపోవటాన్ని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించినా ఆయన తక్షణమే శుభ్రం చేయాలని, గ్రామంలోని డ్రైనేజీలు క్లీన్ చేయాలనీ ఆదేశించారు. గురువారం సదరు వాటర్ పిట్ ను శుభ్రం చేయించిన అధికారులు, గ్రామంలోని కచ్చా డ్రైన్లు శుభ్రం చేసేందుకు నివాసితులకు నోటీసులు జారీ చేశారు. కాగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్వో ప్లాంట్లలో అధికారులు తనిఖీలు చేసి నీటి నాణ్యత పరీక్షలు చేయించి పలు ప్లాంట్లలో ఫిల్టర్లను మార్పించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు.

## ప్రతిప్రజా సమస్యను క్షుణ్ణంగా పరిష్కరిస్తాం

**● వేమూరులో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**



వేమూరు (చైతన్యరథం) : కొల్లూరు మండలంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలను స్వయంగా స్వీకరించి ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి, అర్హత ఉన్న ప్రతి వినతిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ... ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వేగవంతమైన పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత శాఖల అధికారులు ప్రజల వినతులపై నిరంతరం పర్యవేక్షణ చేసి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండలానికి చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఉమ్రా యాత్రను ప్రారంభించిన హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ వించిపేట నుంచి మహమ్మదీయ హజ్ ఉమ్రా సర్వీసెస్ టూర్స్ అండ్ ట్రావెల్స్ వారి ఆధ్వర్యంలో ఉమ్రా మక్కా యాత్ర కోసం బయలుదేరిన 90 మంది ఉమ్రా యాత్రకుల బస్సును రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ భాషా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, ఎం ఎన్ డి ఫరూక్‌లు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రావెల్స్ నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొని ఉమ్రా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.జీవితంలో ఒక సారి ముస్లిం అందరూ పవిత్ర హజ్ యాత్ర చేయడం ముఖ్యమని, ఉమ్రా యాత్ర ఎన్నిసార్లు అయినా వెళ్ళ వచ్చని, పవిత్ర మక్కా యాత్ర వెళ్లడం అనేది ఎంతో గొప్ప విషయమని ప్రతి ముస్లిం మక్కాకు మదీనాకు వెళ్లడం అదృష్టంగా భావిస్తారని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా గారు తెలియజేశారు. విజయవాడ నుండి వెళ్ళే వారికి రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రకు లక్ష రూపాయలు సబ్సిడీ కూడా ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ముస్లిం కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు.

# వైభవంగా ఆదిశేషస్వామి కళ్యాణోత్సవం

## పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు



వరికుంటపాడు (చైతన్యరథం): వరికుంటపాడు మండలం, తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ అమృతవల్లి సమేత శ్రీ ఆదిశేష స్వామివారి దేవాలయ 25వ వార్షిక కళ్యాణ మహోత్సవం మరియు శ్రీ మానసదేవి (నాగలక్ష్మి) అమ్మవారి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ పవిత్ర ఆధ్యాత్మిక వేడుకల్లో ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి దైవానుగ్రహాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఆలయ ప్రాంగణం భక్తజనాలతో కిటకిటలాడగా, భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ సంస్కృతి కలగలిసిన ఈ మహోత్సవం కన్నులపండువగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని, ఇటువంటి మహోత్సవాలు సమాజంలో ఐకమత్యాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. స్వామివారి, అమ్మవారి దివ్య ఆశీస్సులతో ఉదయగిరి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలు కలిగి ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రతి కుటుంబం ఆనందం, అభివృద్ధి, సుభిక్షాలతో కళకళలాడాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.



# కనిగిరి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మరో కీలక అడుగు

కనిగిరి (చైతన్యరథం): కనిగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా నిర్మిస్తున్న డయాలసిస్ సెంటర్ పనులను కనిగిరి శాసనసభ్యుడు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యత ప్రమాణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రావడం ద్వారా కనిగిరి నియోజకవర్గ ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన డయాలసిస్ వైద్య సేవలు లభించి, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగిపోనున్నాయి.




శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు ఒంగోలు నగరంలోని కమ్మపాలెంలో 5.25 కోట్లతో నిర్మిస్తున్న మెయిన్ రోడ్డు పనులు పరిశీలించే కార్యక్రమంలో పాల్గొన్నారు,

# ఆత్మకూరులో ఘనంగా మంత్రి ఆనం జన్మదిన వేడుకలు



ఆత్మకూరు (చైతన్యరథం): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు బస్టాండ్ సెంటర్లో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం నేత మాజీ అట్రాసిటీ కమిటీ మెంబర్ ఆత్మకూరు పట్టణ ఏ ఎస్ ఆర్ కాలేజ్ కరెస్పాండెంట్ మట్లి సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ టిడిపి అధ్యక్షులు తుమ్మల చంద్ర రెడ్డి సూచనలతో మంత్రి ఆనం జన్మదిన వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి.. బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక సీఐ గంగాధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమంలో ప్రసంగించారు.. ఈ సందర్భంగా 75 కిలోల భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికి ఒకరు కేకులు తినిపించుకొని మంత్రి ఆనంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మట్లీ సురేంద్ర ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బందికి కలిపి మొత్తం 350 మందికి నూతన వస్త్రాలను అందించారు.. అలాగే కార్యక్రమం వద్ద 1000 మందికి ఉచిత అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా టిడిపి నేతలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆత్మకూరు అభివృద్ధి అంటే ఆనం అని టీడీపీ నేతలు కొనియాడారు. మట్లి. సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే మన నేత ఆనం రామనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఆత్మకూరు కోసం వారు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని అందుకోసమే తన సొంత ఖర్చులతోనే ఈ పూర్తి సేవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు..ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతలు, అన్ని మండలాల కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



# వైసీపీ కార్యాలయంలో గిరిజన మహిళపై దాడి దారుణం

## ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్

మంగళగిరి (చైతన్యరథం): ఒంగోలులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్నపై జరిగిన దాడి, కులం పేరుతో దూషించడం, ఆమెను మెట్లపై నుంచి తోసివేయడానికి ప్రయత్నించడం, ప్రశ్నించిన బీసీ నాయకుడిపై కూడా దౌర్జన్యానికి పాల్పడటం అత్యంత దురదృష్టకరమైన, ఖండనీయమైన ఘటన. ఒక మహిళపై, అది కూడా గిరిజన మహిళపై పార్టీ కార్యాలయంలోనే దాడి జరగడం వైసీపీ నాయకత్వం గిరిజనులు, బలహీన వర్గాల పట్ల కలిగి ఉన్న అసలు వైఖరిని మరోసారి బట్టబయలు చేసిందని నరహరి ప్రసాద్ అన్నారు. వైఎస్సార్ జయంతి కార్యక్రమం వంటి సందర్భంలో గిరిజన మహిళను అవమానించడం, ఆమెను కులం పేరుతో దూషించడం, అడ్డుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం ప్రజాస్వామ్యానికి మచ్చ. ఈ ఘటనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును ప్రభుత్వం అత్యంత వేగంగా దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నేను డిమాండ్ చేస్తున్నాను. వైసీపీ నాయకులు నేడు గిరిజనుల గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది. 2019 నుంచి 2024 వరకు వారి పాలనలో గిరిజన సమాజం ఎన్నో అవమానాలు, అన్యాయాలు ఎదుర్కొంది. గిరిజనుల భూ హక్కుల పరిరక్షణలో ఘోర నిర్లక్ష్యం కనిపించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో భూ ఆక్రమణలు, అక్రమ మైనింగ్, అటవీ హక్కుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైంది. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల లేమి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వైద్యం అందక అనేకసార్లు ఆందోళనలు జరిగాయి. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, వైద్య సేవలు, ఉపాధి అవకాశాల కల్పనలో కూడా వైసీపీ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయలేదు. అదేవిధంగా గిరిజనుల కోసం రాజ్యాంగం కల్పించిన రక్షణలను అమలు చేయడంలోనూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సకాలంలో న్యాయం అందించడంలోనూ వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. గిరిజనుల సమస్యలను పరిష్కరించాల్సిన సందర్భాల్లో రాజకీయ ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చి, వారి ఆత్మగౌరవాన్ని పదేపదే దెబ్బతీసింది.వైసీపీ పాలనలో గిరిజన నాయకులకే గౌరవం దక్కని పరిస్థితి నెలకొంది. అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్ప శ్రీవాణి అనేక సందర్భాల్లో తన శాఖకు సంబంధించిన నిర్ణయాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసిన సంఘటనలు ప్రజలు మర్చిపోలేదు. అదే విధంగా మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను రబ్బర్ స్టాంప్ గా చేసి వైసీపీ ప్రభుత్వం, పార్టీ నాయకత్వం వ్యవహరించిన తీరు గిరిజన సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది. గిరిజన సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా వారిని పక్కన పెట్టడం, అవమానకర పరిస్థితులు కల్పించడం జగన్ ప్రభుత్వంలో సర్వసాధారణ. అలాంటి వైఖరి నేడు సొంత పార్టీ కార్యాలయంలో గిరిజన మహిళపై దాడి రూపంలో మరోసారి బయటపడింది.గిరిజన మహిళపై దాడి చేసి.., ఆమెను కులం పేరుతో అవమానించడం వైసీపీ సంస్కృతికి నిదర్శనం. గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిన రాజకీయ దృక్పథమే ఇలాంటి సంఘటనలకు కారణమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, విద్య, ఉపాధి, భూ హక్కులు, గురుకులాల అభివృద్ధి, సబ్ ప్లాన్ నిధుల సమర్థ వినియోగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. గిరిజనుల గౌరవం, హక్కుల పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం రాజీ పడదని ఉద్ఘాటించారు. ఒంగోలు ఘటనలో పాల్గొన్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలు శ్రీమతి పేరం ప్రసన్నకు పూర్తి రక్షణ కల్పించాలని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ ఘటనపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నరహరి ప్రసాద్ డిమాండ్ చేశారు. గిరిజన మహిళల ఆత్మగౌరవంపై దాడి చేసే ఏ రాజకీయ శక్తినైనా గిరిజన సమాజం, ప్రజాస్వామ్యవాదులు ఎప్పటికీ క్షమించరని అన్నారు.

# ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి

## అధికారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశం



పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీడుపల్లి గ్రామానికి చెందిన రైతులు చెరువు వద్ద ఉన్న తమ వ్యవసాయ పొలాలకు సరైన దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పొలాలకు వెళ్లేందుకు శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. వారి సమస్యను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సామకోటి ఆదినారాయణ, టీడీపీ నాయకులు మురళి, నాగరాజు, బద్రీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా దర్బార్‌లో సమస్యల సత్వర పరిష్కారం

తాడిపత్రి (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాడిపత్రి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. సంజీవ్ నగర్ లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో తాడిపత్రి శాసనసభ్యులు జెసి అష్మిత్ రెడ్డి నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలను స్వయంగా ఆలకించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిపై వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి సమస్యకు సత్వర పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోందని జెసి అష్మిత్ రెడ్డి తెలిపారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

కదిరి (చైతన్యరథం): పట్టణంలోని మున్సిపల్ 33వ వార్డు, మూర్తిపల్లి ప్రాంతంలోలి నిర్వహించిన లి'ప్రజా దర్బార్'లి కార్యక్రమంలో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నాను. ఈ సందర్భంగా హౌసింగ్, పెన్షన్లు, విద్యుత్ శాఖకు సంబంధించిన అంశాలతో పాటు తక్కువ వోల్టేజ్ సమస్యపై అనేక వినతులు అందాయి. ప్రజలు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి మెజారిటీ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగింది. మిగిలిన దీర్ఘకాలిక సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటిని అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించాను. ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లడం, ప్రతి కుటుంబ సమస్యకు పరిష్కారం చూపడం, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రజల సేవలో నిరంతరం అందుబాటులో ఉంటూ, ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు నా కృషి కొనసాగుతుందని అన్నారు.



# సమస్యలన్నీ విన్నా.. అతి త్వరలోనే పరిష్కరిస్తా

## ప్రజాదర్బార్‌లో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడి



కోవూరు (చైతన్యరథం): బుచ్చిరెడ్డిపాళెం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రజల నుంచి స్వయంగా వినతి పత్రాలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని నమోదు చేసుకున్నామని, అతి త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చాలా మంది ప్రజలు సీసీ రోడ్లు, వంతెనలు, డ్రైనేజీల వంటి మౌలిక వసతుల పనులు చేపట్టాలని కోరారని, ఇవన్నీ నెరవేర్చేలా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న అత్యంత ప్రాముఖ్యమైన 'సర్' కార్యక్రమం విజయవంతం చేయాల్సిన అవసరాన్ని స్థానిక నాయకులకు ఎమ్మెల్యే గుర్తు చేశారు. కోవూరు నియోజకవర్గంలో 'సర్' ప్రక్రియ పురోగతిని పరిశీలిస్తే.. కోవూరు మండలంలో 75 శాతం, కొడవలూరులో 72.39 శాతం, ఇందుకూరుపేటలో 72.2 శాతం, బుచ్చి రూరల్‌లో 71.2 శాతం, విడవలూరులో 67.54 శాతం పూర్తి కాగా, బుచ్చి టౌన్‌లో కేవలం 63.4 శాతం మాత్రమే పూర్తయిందని తెలిపారు. బుచ్చి టౌన్ నాయకులు అందరూ ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, ఏ వార్డుల్లో అయితే ఈ ప్రక్రియ వెనకబడి ఉందో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో మొత్తం 2,69,146 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 2,66,838 ఎనుమరేషన్ ఫామ్‌లను పంపిణీ చేసి 99.14 శాతం పూర్తి చేయడం నిజంగా అభినందించాల్సిన విషయమన్నారు. అయితే ఇందులో 1,97,000 వేల ఫామ్‌లు మాత్రమే డిజిటలైజేషన్ (72 శాతం) అయ్యాయని, మిగతా పనిని కూడా నాయకులు వేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా మూడు రోజుల సమయం మాత్రమే ఉన్నందున, మ్యాపింగ్, లింకేజ్ కాకుండా మిగలిపోయిన వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎవరైనా సరైన సమాచారం లేక ఫామ్‌లు ఇవ్వకపోయినా, పనులకు వెళ్లి అందుబాటులో లేకపోయినా నాయకులు, బీఎల్ఏలు స్వయంగా వారిని కలిసి చైతన్యపరచాలని సూచించారు. ఓట్లను తొలగించే అవకాశం ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండదని, కానీ వివరాలు సక్రమంగా అప్‌డేట్ చేసుకోకపోతే రాబోయే రోజుల్లో సంక్షేమ పథకాలు అందుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేశారు. తరచూ ప్రాంతాలు మారే సంచార జీవుల మ్యాపింగ్ చేయడం, అలాగే కొత్తగా వివాహమై వచ్చిన కోడళ్ల వివరాల మ్యాపింగ్ చేయడం కొంత కష్టమైనప్పటికీ.. నాయకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.



# ప్రజాదర్బార్‌లో పతి సమస్యకు పరిష్కారం

## మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు వెల్లడి

మడకశిర (చైతన్యరథం): మడకశిరలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిరష్కార వేదిక కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి మడకశిర ఎమ్మెల్యే, శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు శుక్రవారం ఉదయం నిర్వహించారు. వివిధ సమస్యలతో అర్జీలతో తన క్యాంపు కార్యాలయానికి వచ్చిన నియోజకవర్గ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి అర్జీలు తీసుకుని, వాటిని క్షుణ్ణంగా పరిశీలిం, వారి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అర్జీదారుల ముందే ఫోన్ చేసి ఆదేశించారు. కష్టాలతో వచ్చిన వారిని సమస్యలు పరిష్కరించి సంతోషంగా ఇంటికి పంపించారు.

**రూ.66.21లక్షల చెక్కులు పంపిణీ**

వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గ ప్రజలు 195మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.66,21,371 విలువైన చెక్కులను పార్టీ నాయకులు గుండుమల తిప్పేస్వామి శ్రీనివాసమూర్తి తదితరులతో కలిసి రాజు అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అనారోగ్యం వస్తే అవే చివరిరోజులు అనే పరిస్థితులు ఉండేవని లబ్ధిదారులకు ఎమ్మెల్యే గుర్తు చేశారు. కానీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబుగారు అమలు చేస్తున్న సీఎంఆర్ఎఫ్ విధానంతో ఎంతోమంది పేదవారు మెరుగైన వైద్యం చేయించుకుని కుటుంబాలకు అండగా నిలబడుతున్నారని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు పార్టీ కార్యాలయంలో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**లబ్ధిదారులకు స్వయంగా అన్నం వడ్డించిన ఎమ్మెల్యే**

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు తీసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులకు చెక్కులు అందించిన అనంతరం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వారికి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. అంతేకాదు స్వయంగా లబ్ధిదారులకు భోజనం వడ్డించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని మనసున్న మారాజులా మంచి మనసును చాటుకున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మడకశిరలోని పార్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని, నియోజకవర్గ ప్రజల కోసం పార్టీ కార్యాలయం తలుపులు 24గంటలు తెరిచే ఉంటాయని ఎం.ఎస్.రాజు తెలిపారు. తమ విషయంలో ఇంత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల నియోజకవర్గ ప్రజలు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

**కష్టాల్లో ఉన్న మైనార్టీ కుటుంబానికి ఆర్థికసాయం**

మడకశిర పట్టణానికి చెందిన బాబా అనే అతను ఇటీవల మరణించారు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు, భార్య ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో, కష్టాల్లో ఉన్న విషయాన్ని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు దృష్టికి తెచ్చారు. వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే చలించిపోయారు. తమ కుటుంబానికి ఏదైనా సాయం చేయాలని వారు అడిగారు. తక్షణమే ఆ కుటుంబానికి రూ.50వేలు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు.

# ఎన్నారై టీడీపీ కేంద్ర కమిటీ నియామకం

## అధ్యక్షుడిగా డాక్టర్ పిల్లి గురు రాజా

## 45 మందితో కార్యవర్గాన్ని ప్రకటించిన అధిష్ఠానం

**అమరావతి (చైతన్యరథం):** ఎన్నారై టీడీపీ కేంద్ర కమిటీని పార్టీ అధినాయకత్వం ప్రకటించింది. కార్యవర్గ సభ్యుల పేర్లను రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. పార్టీకి 20 ఏళ్లుగా సేవలందిస్తున్న కర్నూలు జిల్లాకు చెందిన పిల్లి గురు రాజాను అధ్యక్షుడిగా నియమించారు. విదేశాల్లోని తెలుగువారిని పార్టీకి అనుసంధానించడంలో గురురాజాది కీలక పాత్ర. గత ఎన్నికల్లో వీరంతా టీడీపీ విజయానికి అహర్నిశలూ కృషి చేశారు. పార్టీ పట్ల విధేయత చూపుతూ అభివృద్ధికి ఎంతో కష్టపడ్డారు.

**ప్రెసిడెంట్:** పిల్లి గురు రాజా

**జనరల్ సెక్రటరీలు:** జి.గంగాధర్, ముక్కు తులసికుమార్, చలసాని కిషోర్

**వైస్ ప్రెసిడెంట్లు:** ఇంద్రసేననాయుడు మద్దిభట్ల, కోమటి జయరామ్, రషీదా బేగం, సురేష్ పుట్టగుంట, శ్యామ్ కోడూరి

**ఆర్గనైజింగ్ సెక్రటరీలు:** విజేత జవ్వాది, బాలసుబ్రహ్మణ్యం అన్నమేటి, విజయ్ అడుసుమిల్లి, శివ నాగరాజు నక్కల, కౌతారపు లావణ్య, మాధవి ముప్పవరపు, రాజా రవికిరణ్ కోడి, సైఫుల్లా ఖలీద్, రాచూరి మోహన్, ఆళ్ల వెంకట్, చావ పద్మ, వేణుగోపాల్ రెడ్డి, యష్ బొద్దులూరి, హేమ కోనూరు, విజయ్ చెన్నుపాటి, షా ఫహద్,

**సెక్రటరీలు:** శ్రీనివాస్ గోగినేని, రాజేష్ పల్లేటి, నాగరాజు జడ, పింకీ పొనుగోటి, పేరూరు రామకృష్ణ, గాలి దుర్గాభవాని, వంక వెంకటరమణమ్మ, కృష్ణప్రియ అడుసుమిల్లి, సూర్య బెజవాడ, తరణీధర్ పరుచూరి, సుభాష్ రావాడ, జోగి నాయుడు, వెంకటరమణ, గోపి నంబళ్ళ, కవిత పరుచూరి, అనిల్‌కుమార్ నున్న, నర్మద జొన్నగడ్డ


**సోషల్ మీడియా:** స్వాతి రెడ్డి, సాయి బొల్లినేని

**ట్రెజరర్:** శ్రీనివాస్ అబ్బూరి


డాక్టర్ పిల్లి గురు రాజా
ప్రెసిడెంట్


కోమటి జయరాం
వైస్ ప్రెసిడెంట్


ముక్కు తులసికుమార్
జనరల్ సెక్రటరీ


ఆళ్ల వెంకట్
ఆర్గనైజింగ్ సెక్రటరీ


అడుసుమిల్లి విజయ్
ఆర్గనైజింగ్ సెక్రటరీ


కృష్ణప్రియ అడుసుమిల్లి
సెక్రటరీ


స్వాతి రెడ్డి
సోషల్ మీడియా


సాయి బాలినేని
సోషల్ మీడియా


శ్రీనివాస్ అబ్బూరి
ట్రెజరర్


యాష్ బొద్దులూరి
ఆర్గనైజింగ్ సెక్రటరీ

# లోకేష్ చొరవతో చికాగోకు తెలుగు కుటుంబం

## పాస్‌పోర్ట్‌లు పోవడంతో హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో మూడు రోజులు అష్టకష్టాలు



**నిజంగా ఇది ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సంఘటన. విదేశీ గడ్డపై... అదీ చిన్న పిల్లలతో పాస్‌పోర్టులు పోగొట్టుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తెలుగు కుటుంబం పడిన ఆవేదన వర్ణనాతీతం. సోషల్ మీడియా వేదికగా వారు పంపిన ఆర్తనాదానికి ఏపీ మంత్రి నారా లోకేష్ తక్షణం స్పందించడం, కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడం మన వ్యవస్థల సమర్థతకు నిదర్శనం.**

**హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి చికాగోకు క్యాథే పసిఫిక్ విమానంలో ప్రయాణమైన ఒక సాధారణ తెలుగు కుటుంబానికి ఊహించని కష్టం ఎదురైంది. హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో కాలుపెట్టిన మరుక్షణం వారి పాస్‌పోర్టులు ఉన్న బ్యాగ్ విమానంలోనే మాయమైందని గమనించారు. ఎయిర్‌పోర్ట్ అధికారులు తదుపరి ప్రయాణానికి గానీ, కనీసం బయటకు వెళ్లడానికి గానీ అనుమతించకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. బొల్లా రాజేశ్వరి దంపతులు తమ చిన్నారులతో కలిసి దాదాపు 52 గంటల పాటు (మూడు రోజులు) ఎయిర్‌పోర్ట్ కుర్చీలపైనే గడపాల్సి వచ్చింది. నిస్సహాయ స్థితిలో ఉన్న రాజేశ్వరి) తమ పరిస్థితిని వివరిస్తూ సాయం చేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' (ట్విట్టర్)లో ఒక పోస్ట్ పెట్టారు. దీనికి మంత్రి లోకేష్ నిమిషాల వ్యవధిలోనే స్పందించారు. "మీరు పడుతున్న ఇబ్బందికి చాలా విచారిస్తున్నాను" అంటూ వెంటనే కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు ట్యాగ్ చేసి అత్యవసర సహాయం అందించాలని కోరారు. ఆగమేఘాలపై రంగంలోకి దిగిన కేంద్ర విదేశాంగ శాఖ హాంకాంగ్‌లోని భారత రాయబార కార్యాలయానికి తక్షణ ఆదేశాలు జారీ చేసింది. భారత రాయబార అధికారులు ఇమ్మిగ్రేషన్ అధికారులతో మాట్లాడారు. వెంటనే ఆ కుటుంబంతో సంప్రదింపులు జరిపి వారిని ఎయిర్‌పోర్ట్ నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అత్యవసర ప్రాతిపదికన వారికి తాత్కాలిక ప్రయాణ పత్రాలు (కొత్త పాస్‌పోర్టులు) జారీ చేసి, చికాగో ప్రయాణానికి మార్గం సుగమం చేశారు.




దీంతో మూడు రోజుల ఆందోళన తర్వాత ఆ కుటుంబం ఊపిరి పీల్చుకుంది. కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్, ఏపీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లకు రాజేశ్వరి–మధు దంపతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. హాంకాంగ్‌లో భారత కాన్సుల్ జనరల్ రాజేష్‌నాయుడు, అధికారులు సురభి గోయల్, కె.వెంకటరమణ సహాయం మరువలేనిదన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మంత్రి నారా లోకేష్ మానవీయ కోణంలో స్పందించిన తీరు అభినందనీయమని.. దీనివల్ల ప్రభుత్వాల పట్ల తమ నమ్మకం మరింత పెరిగిందంటూ కృతజ్ఞతలు తెలియజేసింది. ఇక ఆ కుటుంబంలోని ఇద్దరు చిన్నారులు... థ్యాంక్యూ ఇండియన్ గవర్నమెంట్ అని చెప్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# ఐరన్ డోమ్.. మేక్ ఇన్ ఇండియా!



## ఇజ్రాయెల్ ప్రొడక్షన్ లైన్!

మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి ఊతమిచ్చే దిశగా ఇజ్రాయెల్ రక్షణ రంగ సంస్థ రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. గగనతల రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్‌లో భాగమైన ఇంటర్‌సెప్టర్ మిసైల్స్ తయారీని భారత్‌లో చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా భారతీయ కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.ప్రస్తుతం ఇంటర్‌సెప్టర్ మిసైల్స్ తయారీ ఇజ్రాయెల్‌లో జరుగుతోంది. అంతేకాకుండా, కొంతకాలం క్రితమే అమెరికాలో కూడా ఈ మిసైల్స్ ఉత్పత్తి ప్రారంభమైంది. అమెరికా రక్షణ రంగ సంస్థ రేథియాన్ భాగస్వామ్యంతో రాఫెల్ ఈ ప్రొడక్షన్ లైన్‌ను ఏర్పాటు చేసింది. ఇక భారత్‌లో ప్రొడక్షన్ లైన్ ఏర్పాటైతే మిసైల్ తయారీ ఖర్చు మరింత తగ్గే అవకాశం ఉంది. ఐరన్ డోమ్‌కు సంబంధించిన సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. రక్షణ రంగంలో భారత్, ఇజ్రాయెల్ మధ్య గొప్ప సహకారం ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఇరు దేశాలు బరాక్–8 దీర్ఘ శ్రేణి మిసైల్‌ను కలిసి అభివృద్ధి చేశాయి. గగనతల లక్ష్యాలను ఛేదించే ఈ క్షిపణిని భారత త్రివిధ దళాలు వినియోగిస్తున్నాయి. ఇక పశ్చిమాసియాలో ఘర్షణలతో గగనతల రక్షణ వ్యవస్థలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో భారత్‌లో ఐరన్ డోమ్ ప్రొడక్షన్ లైన్ ఏర్పాటుతో రాఫెల్ సంస్థకు వ్యూహాత్మక ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు.

# ఇక నుండి మందులకు ప్రిస్క్రిప్షన్ తప్పని సరి




మందుల దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. ఇకపై 12 శాతానికి పైగా ఇథైల్ ఆల్కహాల్ ఉన్న కొన్ని మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉన్నప్పుడే మెడికల్ షాపులు విక్రయించాలి. ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ మందులను ఇవ్వొద్దని స్పష్టం చేసింది. కొన్ని దగ్గు సిరప్‌లు, టానిక్‌లు వంటి మందుల్లో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉండటంతో వాటిని కొందరు వైద్య అవసరాలకు కాకుండా దుర్వినియోగం చేస్తున్నట్లు ప్రభుత్వానికి నివేదికలు అందాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మందుల విక్రయంపై మరింత కఠినమైన నిబంధనలు అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

### మెడికల్ షాపులు పాటించాల్సిన నిబంధనలు

కొత్త మార్గదర్శకాల ప్రకారం.. రిజిస్టర్డ్ వైద్యులు ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఉన్నప్పుడే ఈ మందులను మెడికల్ షాపులు విక్రయించాలి. అలాగే ప్రతి విక్రయానికి సంబంధించిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు, ప్రిస్క్రిప్షన్ కాపీలు, విక్రయ రికార్డులను కనీసం మూడు సంవత్సరాల పాటు భద్రపరచాలి. అవసరమైతే ఔషధ నియంత్రణ అధికారులు పరిశీలించేందుకు ఈ రికార్డులను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.

# దద్దరిల్లిన ధర్మాసనం!

## కోర్టులోనే పేట్రేగిన పిటిషనర్... సంయమనంతో వ్యవహరించిన న్యాయమూర్తులు



సుప్రీంకోర్టులో ఇవాళ శుక్రవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పిటిషనర్‌ను బలవంతంగా కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన న్యాయమూర్తులు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కేసు విచారణ చేస్తున్న సమయంలో జరిగింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. శుక్రవారం విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి పిటిషనర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు. ఈ ఘటనతో కొద్దిసేపు కోర్టు హాలులో కలకలం రేగింది. అయినా న్యాయమూర్తులు ఏమాత్రం సహనం కోల్పోకుండా విచారణను కొనసాగించడం విశేషం.



# కివీస్‌లో కాలు మోపిన భారత ప్రధాని మోదీ

## సాదరంగా స్వాగతం పలికిన ఆదేశ ప్రధాని లక్సన్

భారత విదేశాంగ విధానంలో మరో కీలక అధ్యాయం మొదలైంది. ఆస్ట్రేలియాలో అత్యంత విజయవంతమైన పర్యటనను ముగించుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఇవాళ (శుక్రవారం) న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. గత నాలుగు దశాబ్దాలలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఈ పర్యటనకు విచ్చేశారు. విమానాశ్రయానికి చేరుకున్న మోదీకి పీఎం లక్సన్ ఆత్మీయంగా కౌగిలించుకుని సాదర స్వాగతం పలికారు.



# డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్ళాలనుకుంటున్నా!

## బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా వెల్లడి

డిసెంబర్‌లో తాను స్వదేశానికి తిరిగెళ్లాలని అనుకుంటున్నట్టు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, ఆవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనా తాజాగా తెలిపారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థుల తిరుగుబాటు అనంతరం షేక్ హసీనాతో పాటు పలువురు ఆవామీ లీగ్ నేతలు భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. హింసాత్మక నిరసనల నేపథ్యంలో ఆమె దేశాన్ని వీడాల్సి వచ్చింది. ఈ నిరసనల్లో సంభవించిన మరణాలకు షేక్ హసీనా బాధ్యురాలని నూతన ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రైబ్యునల్ తేల్చింది. ఆమెకు మరణ శిక్ష కూడా విధించింది. అప్పటి హోం మంత్రికి కూడా మరణ శిక్షను ఖరారు చేసింది. తాను మళ్లీ బంగ్లాదేశ్ వెళ్లాలనుకుంటున్నట్టు షేక్ హసీనా తాజాగా తెలిపారు. బహిష్కరణకు గురైన ఇతర ఆవామీ లీగ్ నేతలు కూడా స్వదేశానికి వెళతారని చెప్పారు. బంగ్లాదేశ్‌లో కోర్టు ముందు లొంగిపోతానని ఆమె చెప్పారు. అధికారులు తనను అరెస్టు చేయవచ్చని అన్నారు. తనను చంపే అవకాశం కూడా ఉందని చెప్పారు. అయినా వెళ్లక తప్పదని అన్నారు. ప్రస్తుతం ఆవామీ లీగ్‌పై బంగ్లాదేశ్‌లో నిషేధం ఉంది. స్వదేశానికి వెళ్లాక నిషేధాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేయనున్నానని కూడా షేక్ హసీనా చెప్పారు. బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నోందని ఆరోపించారు. అక్కడ మళ్లీ ప్రజాస్వామ్య ప్రక్రియలను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే, తిరిగెళ్లే విషయమై అక్కడి అధికారులతో ఇంకా ఎలాంటి సంప్రదింపులు మొదలు కాలేదని తెలిపారు.



# అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మళ్లీ యుద్ధ మేఘాలు

## కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు



అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.



# దక్షిణ స్పెయిన్‌లో భారీ కార్చిచ్చు

## దహన కాండలో 11 మంది మృతి, మరో 19 మంది గల్లంతు

దక్షిణ స్పెయిన్‌లోని అండలూసియా రీజియన్‌ను భారీ కార్చిచ్చు కాల్చి బూడిద చేస్తోంది. ఈ ఘోర ప్రమాదంలో ఇప్పటివరకు 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 19 మంది గల్లంతయ్యారు. మంటలు ఉధృతంగా వ్యాపించడంతో సుమారు 600 మంది నివాసితులు నిరాశ్రయులయ్యారు. ప్రతికూల గాలుల మధ్య అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అండలూసియా ప్రాంతీయ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం, అల్మేరియా ప్రావిన్స్‌లోని లాస్ గల్లార్డోస్, బెడార్, అంటాస్ మునిసిపాలిటీలపై ఈ కార్చిచ్చు తీవ్ర ప్రభావం చూపింది. తొలుత మరణాల సంఖ్య 12 గా ప్రకటించినప్పటికీ, అధికారులు దానిని 11 గా సవరించారు.

దాదాపు 600 మంది ఇళ్లను వదిలి వెళ్లగా, రాత్రికి రాత్రే 120 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అల్మోక్రైజర్, ఫ్యూయెంటె డెల్ అల్బారికో, లాస్ పినోస్, లా సెరెనా, పినార్ వంటి పరిసర ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. శరణార్థులుగా మారిన వారిలో 74 మందికి లుబ్రిన్ థియేటర్‌లో, మరో 74 మందికి గరుచా థియేటర్‌లో అధికారులు తాత్కాలిక వసతి కల్పించారు.

### 3,150 హెక్టార్లు బూడిద.. హై అలర్ట్‌లో అధికారులు

ఈ భీకర కార్చిచ్చు కారణంగా ఇప్పటివరకు దాదాపు 3,150 హెక్టార్ల అటవీ భూమి పూర్తిగా అగ్నికి ఆహుతైపోయింది. ప్రస్తుతం మంటల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల సహాయక చర్యలు, మంటల్ని అదుపు చేయడం కష్టతరంగా మారిందని అండలూసియా అత్యవసర సేవల మంత్రి ఆంటోనియో సాంజ్ కాబెల్లో తెలిపారు. అంతేకాదు, గాలుల దిశ మారే అవకాశం ఉన్నందున అధికారులు ఇప్పటికీ హై అలర్ట్ కొనసాగిస్తున్నారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా అక్కడ 'ప్లాన్ ఇన్ఫోకా' అత్యవసర ప్రణాళికను అమలు చేస్తున్నారు.

# ట్రంప్‌నకు ఫెడరల్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ

## లైంగిక వేధింపుల కేసులో భారీ జరిమానా విధింపు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫెడరల్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ రచయిత్రి ఈ జీన్ కారోల్ దాఖలు చేసిన లైంగిక వేధింపులు, పరువు నష్టం కేసులో కోర్టు ఖాతాలో ఉన్న రూ.5.8 మిలియన్ డాలర్ల (సుమారు రూ.55 కోట్లు) పరిహారాన్ని ఆమెకు వెంటనే విడుదల చేయాలని మన్‌హట్టన్‌లోని ఫెడరల్ జడ్జి లూయిస్ ఏ కాప్లాన్ తీర్పునిచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ ట్రంప్ న్యాయవాదులు చేసిన అప్పీల్‌ను సైతం అప్పీలేట్ కోర్టు తిరస్కరించింది. 1996లో మన్‌హట్టన్‌లోని ఓ డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో ట్రంప్ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ జీన్ కారోల్ ఆరోపించారు. ఇదే విషయాన్ని 2019లో ప్రచురితమైన తన పుస్తకంలోనూ ప్రస్తావించారు. అయితే కారోల్ తనకు తెలియదని.. ఆమె ఆరోపణలు పచ్చి అబద్ధమని ట్రంప్ కొట్టిపారేశారు. దీంతో తనపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కారోల్ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే 2023 మేలో మన్‌హట్టన్ ఫెడరల్ కోర్టు జ్యూరీ.. లైంగిక వేధింపులు, పరువు నష్టానికి ట్రంప్‌ను బాధ్యుడిగా తేల్చుతూ 5 మిలియన్ డాలర్ల జరిమానా విధించింది. దీనిపై అప్పీల్‌కు వెళ్లేందుకు ట్రంప్ ఆ మొత్తాన్ని కోర్టు ఖాతాకు జమ చేశారు. వడ్డీతో కలిపి అది 5.8 మిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఈ సివిల్ తీర్పును సవాల్ చేస్తూ ట్రంప్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు యూఎస్ సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో కారోల్‌కు పరిహారం చెల్లించేందుకు మార్గం సుగమమైంది. 'ట్రంప్ ఏళ్ల తరబడి కేసును సాగదీస్తూ వస్తున్నారు. బాధితురాలికి న్యాయం చేసేందుకు పరిహారం చెల్లించాల్సిన సమయం వచ్చింది' అని జడ్జి లూయిస్ ఏ కాప్లాన్ తన తీర్పులో పేర్కొన్నారు. కాగా, జీన్ కారోల్ దాఖలు చేసిన మరో పరువు నష్టం కేసుకు సంబంధించి 2024లో మన్‌హట్టన్ ఫెడరల్ కోర్టు జ్యూరీ ట్రంప్‌కు 83.3 మిలియన్ డాలర్ల (సుమారు రూ.794 కోట్లు) భారీ జరిమానా విధించగా.. దీనిపై ఆయన చేసిన అప్పీల్‌పై విచారణ కొనసాగుతోంది.

# చైనా వైపు దూసుకొస్తున్న మరో రక్కసి తుపాను

చైనా వైపు మరో రక్కసి తుపాను దూసుకొస్తోంది. తూర్పు తీరంవైపు బావి తుపాను వస్తోందని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుపాను తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న రీత్యా వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. తుపాను శనివారం మొదట తైవాన్‌ను తాకి అనంతరం చైనాలోని ఫుజియాన్, జెజియాంగ్ ప్రావిన్సుల్లో తీరాన్ని తాకనుంది. ప్రభావిత ప్రావిన్సుల్లో 40 సెంటీమీటర్ల వరకూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. రక్కసి తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్తమైంది. తీరానికి సమీపంలోని 17 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. 1.70 లక్షల మంది విపత్తు నిర్వహణ సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. తీర ప్రాంతాలతో పాటూ బీజింగ్ వరకూ తుపాను ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నమే రాజధాని బీజింగ్‌లో అధికారులు ఎమర్జెన్సీని ప్రకటించారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. క్రీడాకార్యక్రమాలను వాయిదా వేశారు. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు, గాలులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తైవాన్‌లో కూడా హైఅలర్ట్ ప్రకటించారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ పలు విమాన సర్వీసులను రద్దు చేసింది. గ్రేటర్ బే ఎయిర్‌లైన్స్ కూడా పలు విమాన సర్వీసులను నిలిపివేసింది. మిగిలిన విమానాలను దారి మళ్లించింది.



# మళ్లీ మొదటికి హర్మూజ్‌లో దుస్థితి!

అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకుంటున్న నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకల ప్రయాణానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. జూన్‌లో కుదిరిన తాత్కాలిక ఒప్పందం సమయంలో రోజుకు దాదాపు 34 నౌకలు ప్రయాణించేవి. ప్రస్తుతం ఒకటి, రెండు నౌకలు మాత్రమే జలసంధిని దాటుతున్నాయి. ఉద్రిక్త పరిస్థితుల కారణంగా.. ముడి చమురు, ఎల్పీజీ తీసుకెళుతున్న 9 భారతీయ ట్యాంకర్లు పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయాయి. తొమ్మిది ట్యాంకర్లలో 198 మంది భారతీయులు చిక్కుకుపోయారు. ఆ ట్యాంకర్లు జలసంధి గుండా ప్రయాణించేందుకు అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే తాము దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో లేదని, మే నెల నుంచి హర్మూజ్ తమ నియంత్రణలోనే ఉందని తెలిపింది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరిగిన శాంతి ఒప్పందం నెల రోజులు కాకుండానే ముగిసిపోయింది. రెండు దేశాల మధ్య మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత వారం హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ సైన్యం దాడులు చేసింది. దీంతో రెండు దేశాల మధ్య పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీశాయి. గత మూడు రోజుల నుంచి రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది.

### అందుకే ఇరాన్‌ను టార్గెట్ చేశాం

గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం విరుచుకుపడింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే తాము దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో లేదని, మే నెల నుంచి హోర్ముజ్ తమ నియంత్రణలోనే ఉందని తెలిపింది. 800 వాణిజ్య నౌకలు, 380 మిలియన్ బ్యారెళ్ల చమురును హోర్ముజ్ దాటించామని వెల్లడించింది. ఈ మేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది.

# క్రికెట్ హిస్టరీలో ఫస్ట్ టైమ్
# ఇండియాకు రానున్న 'బిగ్‌బాష్ లీగ'

***చెన్నై వేదికగా డిసెంబరు 12న తొలి మ్యాచ్ - భారత ప్రధాని మోదీ అధికారిక ప్రకటన***






మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ప్రతిష్టాత్మక టీ20 టోర్నీ 'బిగ్ బాష్ లీగ' (BBL) చరిత్రలోనే తొలిసారిగా ఆస్ట్రేలియా వెలుపల మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ అరుదైన మైలురాయికి భారత గడ్డ... అది కూడా క్రికెట్ హబ్ అయిన చెన్నైలోని ప్రతిష్టాత్మక చెపాక్ స్టేడియం వేదిక కానుంది. బీబీఎల్ 2026-27 సీజన్ ఆరంభ మ్యాచ్‌కు చెన్నై ఆతిథ్యం ఇవ్వనుండటంతో క్రికెట్ ప్రపంచంలో సరికొత్త చరిత్ర లిఖించబడనుంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆసీస్ ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌ను సందర్శించిన సందర్భంగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

బీబీఎల్ 2026-27 సీజన్ తొలి మ్యాచ్ డిసెంబర్ 12న పెర్త్ స్కార్చర్స్-మెల్‌బోర్న్ రెనెగెడ్స్ జట్ల మధ్య చెన్నైలో జరగనుంది. ఇరు దేశాల మధ్య క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు 'స్పోర్ట్స్ రోడ్‌మ్యాప'ను ఇద్దరు ప్రధానులు ఆవిష్కరించారు. ఇటీవల టీ20 ప్రపంచ కప్ 2026 విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టును ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ చారిత్రాత్మక నిర్ణయంపై ప్రధాని మోదీ స్పందిస్తూ... "బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌ను చెన్నైలో నిర్వహించేందుకు భారత్ తరపున సాదరంగా ఆహ్వానిస్తున్నా. భారతదేశంలో ఎలాంటి లీగ్ జరిగినా సరే అభిమానులు చూపే ఆదరణ, వీక్షకుల సంఖ్య అద్భుతంగా ఉంటుందని కచ్చితంగా చెప్పగలను. క్రీడల్లోనే కాకుండా భారత్-ఆస్ట్రేలియా భాగస్వామ్యం అన్ని రంగాల్లోనూ చాంపియన్‌గా నిలుస్తుందనే నమ్మకం నాకుంది. 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుండగా.. 2036లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు కూడా భారత్ గట్టి ప్రయత్నాలు చేస్తోంది."

**క్రికెట్ అంటే కేవలం ఆట కాదు.. మన ఉమ్మడి అభిరుచి**

"మెల్‌బోర్న్ మైదానంలో అడుగుపెట్టే ఏ భారతీయుడికైనా ఒకేసారి రెండు రకాల భావోద్వేగాలు కలుగుతాయి. ఒకటి భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌ల్లో ఉండే తీవ్రమైన ఉత్కంఠ. రెండోది ఇరు దేశాల్లో క్రికెట్ అనేది కేవలం క్రీడ మాత్రమే కాదు.. అది మన ఉమ్మడి అభిరుచి అని గ్రహించడం. ఇవాళ మాత్రం ఎలాంటి చివరి ఓవర్ ఒత్తిడి లేదు. దానికి బదులుగా క్రీడను ఆస్వాదించడం, మన స్నేహాన్ని గుర్తుచేసుకోవడం ప్రధాన లక్ష్యం. ప్రధాని అల్బనీస్‌తో కలిసి ఇరు దేశాల స్పోర్ట్స్ రోడ్‌మ్యాప్‌ను విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది" అని మోదీ భావోద్వేగంగా మాట్లాడారు.




## 300 మ్యాచ్‌లు, 10 వేల పరుగులు
## అంతర్జాతీయ క్రికెట్‌లో స్మృతి మంధాన సరికొత్త రికార్డు

భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక అరుదైన మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయంగా అతి పిన్న వయస్సులోనే 300 మ్యాచ్‌లు ఆడిన బ్యాటర్‌గా ఆమె సరికొత్త రికార్డు సృష్టించింది. 29 ఏళ్ల స్మృతి మంధాన ఇప్పటివరకు తన కెరీర్‌లో 9 టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచ్‌లు ఆడింది. మొత్తంగా అంతర్జాతీయ క్రికెట్‌లో 10వేలకు పైగా పరుగులు సాధించిన ఆమె ఖాతాలో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. భారత జట్టు తరపున స్మృతి మంధాన 2013లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే.

ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో లార్డ్స్ మైదానంలో భారత మహిళల జట్టు టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ స్మృతి మంధాన బాధ్యతాయుతంగా ఆడి హాఫ్ సెంచరీ సాధించింది. అయితే మరో ఓపెనర్ షఫాలీ వర్మ మాత్రం నిరాశపరిచింది. ఆమె డకౌట్‌గా వెనుతిరిగింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన యస్తికా భాటియా (12) కూడా ఎక్కువ సేపు నిలదొక్కుకోలేకపోయింది. ఈ దశలో సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన జెమీమా రోడ్రిగ్స్ (35) దూకుడుగా ఆడింది. మంధానతో కలిసి మూడో వికెట్‌కు అర్ధ శతక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే ఇంగ్లాండ్ బౌలింగ్‌లో బయటకు వెళ్లే బంతిని వెంటాడిన జెమీమా చివరకు బౌల్డ్ అయింది. తొలి సెషన్ ముగిసే సమయానికి భారత మహిళల జట్టు 25 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో స్మృతి మంధాన (56 ), హర్మన్ ప్రీత్ కౌర్ (14) పరుగులతో నిలిచి ఉన్నారు.

## సెమీస్‌కు ఫ్రాన్స్.. మొరాకోపై 2-0తో విక్టరీ



బోస్టన్: ఫిఫా ప్రపంచ కప్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లో ఫ్రాన్స్ జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. బోస్టన్ స్టేడియంలో జరిగిన హోరాహోరీ పోరులో మొరాకోను 2-0 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌లో అడుగుపెట్టింది. మ్యాచ్ మొదటి సగ భాగంలో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపె పెనాల్టీ కిక్‌ను మిస్ చేయడంతో ఇరు జట్లు 0-0తో నిలిచాయి. మొరాకో డిఫెండర్లు ఫ్రాన్స్ దాడులను సమర్థవంతంగా అడ్డుకున్నారు. మ్యాచ్ 60వ నిమిషంలో కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే (66వ నిమిషంలో) ఎంబాపె అందించిన పాస్‌ను ఉస్మాన్ డెంబెల్లే గోల్‌గా మలిచి ఫ్రాన్స్ విజయాన్ని ఖాయం చేశాడు.

ఈ మ్యాచ్‌లో చేసిన గోల్‌తో కిలియన్ ఎంబాపె పలు ప్రతిష్టాత్మక రికార్డులను నెలకొల్పాడు. ప్రస్తుత వరల్డ్ కప్ టోర్నీలో ఇది అతనికి 8వ గోల్. దీంతో 'గోల్డెన్ బూట' రేసులో అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ సరసన నిలిచాడు. వరల్డ్ కప్ కెరీర్‌లో ఎంబాపెకు ఇది 20వ గోల్ కావడం విశేషం. ప్రపంచ కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో మెస్సీ (21 గోల్స్)కి కేవలం ఒకే ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు.

2022 ఖతార్ వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌లోనూ మొరాకోను ఇదే 2-0 స్కోరుతో ఓడించిన ఫ్రాన్స్ ఇప్పుడు అదే ఫలితాన్ని రిపీట్ చేసింది. వరుసగా మూడోసారి ప్రపంచ కప్ సెమీఫైనల్స్‌కు చేరిన ఫ్రాన్స్.. ఈ నెల 15న డల్లాస్ స్టేడియంలో జరగబోయే సెమీస్‌లో స్పెయిన్ లేదా బెల్జియంతో తలపడుతుంది.

## టీమిండియా ఓటములపై బీసీసీఐ సీరియస్

టీ20ల్లో మొన్నటిదాకా అజేయశక్తిగా కొనసాగిన భారత జట్టు వరుసగా రెండో సిరీస్ కోల్పోవడం అభిమానులకు మింగుడుపడడం లేదు. వరల్డ్ కప్ ఛాంపియన్ టీమిండియా ఇంత దారుణంగా ఓడడంపై మాజీలు, విశ్లేషకులు అవాక్కవుతున్నారు. బ్రిస్టల్‌లో ఘనమైన రికార్డు ఉన్నప్పటికీ నాలుగో టీ20లో 9 వికెట్లతో చిత్తైన భారత్ సిరీస్ కోల్పోయింది. ఈ ఘోర పరాజయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి సీరియస్‌గా తీసుకుంది. సిరీస్ ముగియడమే ఆలస్యం సమీక్ష నిర్వహించి.. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బందిపై చర్యల" తీసుకోనుంది.

ఇంగ్లండ్ పర్యటనలో హ్యాట్రిక్ ఓటములతో భారత జట్టు పొట్టి సిరీస్‌ను సమర్పించుకుంది. సిరీస్‌లో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో 9 వికెట్ల పరాజయంతో విమర్శలకు కేంద్రంగా మారింది టీమిండియా. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్, ఆపై ఇంగ్లీష్ టీమ్ దెబ్బకు తలవంచిన భారత జట్టు ప్రదర్శనపై బీసీసీఐ సమీక్షకు సిద్ధమవుతోంది. ఐదు టీ20ల సిరీస్ ముగియడమే ఆలస్యం ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శన, కోచ్ గౌతం గంభీర్, ఇతర సహాయక సిబ్బంది పనితీరును విశ్లేషించనుంది.

'టీ20ల్లో భారత జట్టు ప్రదర్శన పట్ల ఆందోళన చెందుతున్నాం. ఇంగ్లండ్ సిరీస్ ముగియగానే కెప్టెన్ కోచ్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తాం. అసలు పొరపాటు ఏం జరిగింది? ఎందుకు సిరీస్ ఓడాం? అనేది ఆరా తీస్తాం. తప్పులను సరిదిద్దుకుని మళ్లీ జట్టుకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం' అని బీసీసీఐ సెక్రటీ దేవజిత్ సైకియా పేర్కొన్నారు.




## 100వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్
# అరుదైన మైలురాయిపై అక్షర్ పటేల్ భావోద్వేగం

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తన సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయి అందుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ ద్వారా ఈ 31 ఏళ్ల గుజరాత్ ఆల్‌రౌండర్ తన వందో అంతర్జాతీయ టీ20 మ్యాచ్ పూర్తి చేసుకున్నాడు. భారత క్రికెట్ జట్టు తరపున 100 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల మైలురాయి అందుకుంటానని తాను ఎప్పుడూ ఊహించలేదని అక్షర్ పటేల్ అన్నాడు. ఈ అరుదైన ఘనతను తన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులకు అంకితం ఇస్తున్నట్టు వెల్లడించాడు.

**ఇంగ్లండ్ పర్యటన నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది**

బీసీసీఐ విడుదల చేసిన ప్రత్యేక వీడియోలో అక్షర్ పటేల్ తన 11 ఏళ్ల క్రికెట్ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యాడు. 'నేను తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికైనప్పుడు వంద మ్యాచ్‌లు ఆడతానని అస్సలు ఊహించలేదు. ఈ ఇంగ్లండ్ పర్యటన నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఎందుకంటే ఇదే సిరీస్‌లోనే నేను టీ20ల్లో 100 వికెట్ల మైలురాయి దాటాను. ఇప్పుడు వంద టీ20 మ్యాచ్‌ల మరో మైలురాయిని కూడా అందుకోవడం నాకెంతో ప్రత్యేకమైన రోజుగా నిలిచింది" అని అక్షర్ పేర్కొన్నాడు.

**అది ప్రతి ప్లేయర్ కల**

ఈ మైలురాయిని చేరుకోవడం కేవలం తన ఒక్కడి కృషి కాదని.. జట్టు సభ్యులు, కోచ్‌లకు ఇందులో సమాన భాగస్వామ్యం ఉందని అక్షర్ పటేల్ తెలిపాడు. టీమిండియా తరపున ఒక్క మ్యాచ్ అయినా ఆడాలనేది ప్రతి ప్లేయర్ కల అని, అలాంటిది వంద మ్యాచ్‌లు ఆడానంటే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేనని సంతోషం వ్యక్తం చేశాడు." ప్రతి రోజు ఏదో ఒకటి నేర్చుకుంటూ... మరింత మెరుగయ్యేందుకు ప్రయత్నిస్తూ ఉంటాను. నా మొదటి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ' అవార్డు దక్కించుకున్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరం మరింత మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను. ఏ ఆటగాడైనా తన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకున్నప్పుడే క్రికెట్‌లో మరింత ముందుకు వెళ్తాడు" అని అక్షర్ స్పష్టం చేశాడు.

చైతన్య రథం
సినిమా
శనివారం 11 జూలై 2026 X

# 'ఫౌజీ' రిలీజ్‌కు ముందే రికార్డు బిజినెస్

## ప్రభాస్ సినిమాకు భారీ ఓటీటీ డీల్?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఫస్ట్ లుక్, టైటిల్ గ్లింప్స్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొల్పిన ఈ చిత్రం... ఇప్పుడు రిలీజ్‌కు ముందే నాన్-థియేట్రికల్ బిజినెస్‌తో ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా సౌత్ ఇండియన్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సుమారు రూ.180 కోట్లకు సొంతం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో హిందీ థియేట్రికల్ హక్కులను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏఏ ఫిలింస్ రూ.60 కోట్లకు పైగా చెల్లించి దక్కించుకున్నట్లు కూడా టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ఒప్పందాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు ట్రేడ్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. హిందీ డిజిటల్ హక్కులతో పాటు శాటిలైట్, ఆడియో రైట్స్‌కు సంబంధించిన ఒప్పందాలు ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. అవి కూడా పూర్తయితే 'ఫౌజీ' విడుదలకు ముందే భారీ స్థాయిలో నాన్-థియేట్రికల్ బిజినెస్ నమోదు చేసే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'సీతారామం'తో ప్రశంసలు అందుకున్న దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని 1930 కాలం నాటి చారిత్రక నేపథ్యంతో రూపొందిస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, యుద్ధ వాతావరణం, దేశభక్తి అంశాలను ప్రధానంగా తీసుకుని కథను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.



## లంగావోణీలో పల్లెటూరి అందంతో...

మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన భాగ్యశ్రీ బోర్సే మొదటి సినిమాతోనే తన అందం, అభినయంతో మంచి పాపులారిటీ దక్కించుకుంది.

ఆమె నటించిన లేటెస్ట్ మూవీ 'లెనిన' సినిమా ప్రమోషన్స్‌లో మరింత అందంగా కనిపించి సోషల్ మీడియాలో తెగ హల్‌చల్ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా రాయల్ బ్లూ, లైమ్ గ్రీన్ లెహంగా ధరించి చేతికి గాజులు వేసుకుని ఎంతో పద్ధతిగా పక్కా పల్లెటూరి తెలుగమ్మాయిగా మెరిసిపోయింది. భాగ్యశ్రీ అందాలను చూసిన ప్రతి ఒక్కరూ లైక్స్, కామెంట్స్ చేస్తూ ఆ ఫొటోలను తెగ వైరల్ చేస్తున్నారు.

## దర్శకుడి నుంచి మళ్లీ నటుడిగా...

# మెహర్ రమేష్ కొత్త ఇన్నింగ్స్‌కు రెడీ!



టాలీవుడ్‌లో దర్శకులు నటులుగా మారడం కొత్త విషయం కాదు. గతంలో కె.విశ్వనాథ్, దాసరి నారాయణరావు వంటి దిగ్గజాలు కూడా కెమెరా ముందు తమదైన ముద్ర వేశారు. ఇప్పుడు అదే బాటలో ప్రముఖ దర్శకుడు మెహర్ రమేష్ మరోసారి నటుడిగా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలో ఆయన కనిపించనున్నారనే వార్త ఆసక్తి పెంచుతోంది. చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే.. మెహర్ రమేష్ దర్శకుడిగా కాకముందే నటుడిగా కెరీర్‌ను ప్రారంభించారు. 2002లో సూపర్ స్టార్ మహేష్‌బాబు నటించిన 'బాబీ' సినిమాలో ఆయన ఓ ముఖ్యమైన పాత్రలో కనిపించారు. ఆ తర్వాత పూర్తిగా దర్శకత్వంపై దృష్టి సారించిన మెహర్ రమేష్ 2004లో కన్నడ స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌తో 'వీర కన్నడిగ' చిత్రాన్ని తెరకెక్కించి దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు.

దర్శకుడిగా టాలీవుడ్‌లో ఎన్టీఆర్‌తో 'కంత్రి', 'శక్తి', ప్రభాస్‌తో 'బిల్లా', వెంకటేష్‌తో 'షాడో' వంటి భారీ చిత్రాలను తెరకెక్కించారు. వీటిలో 'బిల్లా' మాత్రమే కమర్షియల్‌గా మంచి గుర్తింపు తెచ్చుకోగా, మిగిలిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేక పోయాయి. నటుడిగా రీఎంట్రీ ఇస్తూనే దర్శకుడిగా కూడా మెహర్ రమేష్ కొత్త కథలపై పని చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టార్ హీరోలకు సరిపోయే కథలను సిద్ధం చేస్తూ, మరోసారి మెగాఫోన్ పట్టేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

## వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న వచ్చేస్తున్నాడమ్మీ!



మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ సరికొత్త ప్రయోగాలతో దూసుకుపోతున్నారు. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన ఈసారి టాలీవుడ్‌లో ఇప్పటివరకు రాని ఒక వినూత్నమైన కాన్సెప్ట్‌తో ముందుకు వస్తున్నారు. ఆయన కథా నాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం 'కొరియన్ కనకరాజు' టాలీవుడ్ హిస్టరీలోనే సరికొత్తగా ఒక ఇండో-కొరియన్ హారర్ కామెడీ జానర్‌లో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

'కనకరాజు వచ్చేస్తున్నాడమ్మీ' అంటూ విడుదల చేసిన ఈ క్రేజీ అప్‌డేట్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ చిత్రానికి దర్శకుడు మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా స్టార్ కామెడియన్ సత్య కీలక పాత్రలో ప్రేక్షకులను పొట్టచెక్కలయ్యేలా నవ్వించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి టాలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# రెయిన్ స్టంట్ సీక్వెన్స్ కోసం

## 12 గంటలు ఏకధాటిగా వర్షంలో తడుస్తూ షూటింగ్ చేసిన మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి మరోసారి సినిమాపై తన అంకితభావాన్ని చాటారు. బ్లాక్‌బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిరుబాబీ2/చిరు158 షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ షెడ్యూల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడును చిత్రీకరిస్తున్నారు. ప్రముఖ స్టంట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ ఆధ్వర్యంలో భారీ వర్షం నేపథ్యంలో ఓ గ్రాండ్ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో భారీ సంఖ్యలో ఫైటర్లు పాల్గొంటున్నారు. ఈ ఫైట్ చిరంజీవి కెరీర్‌లో కూడా అత్యంత భారీ యాక్షన్ సన్నివేశాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ షూటింగ్‌లో చిరంజీవి చూపించిన అంకితభావం ప్రస్తుతం చిత్ర బృందాన్ని ఆశ్చర్యపరిచింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ షూట్ చేశారు. మధ్యలో గంట లంచ్ బ్రేక్ తీసుకున్నారు తప్పితే మిగతా 12 గంటల పాటు వర్షంలోనే తడుస్తూ ఏకధాటిగా షూటింగ్ చేశారు. ఏమాత్రం అలసట లేకుండా అదే ఉత్సాహంతో యాక్షన్ సన్నివేశాలను చేయడం యూనిట్ మొత్తాన్ని ఆశ్చర్యపరిచింది. మొదటి షాట్ నుంచి చివరి షాట్ వరకు అదే ఎనర్జీ, అదే కమిట్‌మెంట్‌తో ప్రతి సన్నివేశాన్ని పూర్తి చేశారు మెగాస్టార్. ఆయన చూపించిన క్రమశిక్షణ, అంకితభావం చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఇది భారతీయ సినిమా రంగంలో అత్యంత కష్టపడి పనిచేసే స్టార్లలో ఒకరిగా ఆయన ఖ్యాతిని ఈ షెడ్యూల్ మరోసారి నిరూపించింది.



## 'శ్రీ శ్రీ'... ఫస్ట్ లుక్ అదుర్స్



వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ చణా41లో బిజీగా ఉన్నారు. ప్రతిష్ఠాత్మక ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థకు 10వ మైల్ స్టోన్ చిత్రంగా నిలుస్తోంది. ప్రేమ, వినోదం, మనసుని తాకే భావోద్వేగాలను అందంగా మేళవించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో దుల్కర్ సల్మాన్ సరసన పూజా హెగ్డే తొలిసారిగా నటిస్తున్నారు. చిత్ర నిర్మాతలు 'శ్రీ శ్రీ' అనే ఆహ్లాదకరమైన టైటిల్ ఖరారు చేశారు. దీనికి "లవ్ విల్ స్పార్క్ అగైన" అనే ఆకట్టుకునే ట్యాగ్‌లైన్ ఉంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే ఒక కాంపౌండ్ గోడపై కూర్చుని సరదాగా మాట్లాడుకుంటూ కనిపిస్తున్నారు. పాస్టెల్ బ్లూ షర్ట్, గ్రే ట్రౌజర్, కళ్లద్దాలతో కనిపిస్తున్న దుల్కర్ సిగ్గురించిన చిరునవ్వుతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తే, లైట్ బ్లూ సల్వార్ సూట్‌లో ఉన్న పూజా హెగ్డే అతని వైపు చూసి మనసారా నవ్వుతూ కనిపిస్తోంది. ఇద్దరి మధ్య ఉన్న సహజమైన కెమిస్ట్రీ పోస్టర్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.